www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 23-5-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 37

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 7.23 తదుపరి పాడ్యమి; నక్షత్రం: విశాఖ ఉ. 9.14 తదుపరి అనూరాధ; వర్జ్యం: మ. 1.23-3.03; దుర్ముహూర్తం: ఉ. 10.02-10.54, మ. 3.12-4.04; అమృతఘడియలు: రా. 11.21-1.01; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.39

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


బెంగాల్ సీఎం మమతకు షాక్

ఆ రాష్ట్రంలో 2010 నుంచి జారీచేసిన ఓబీసీ సర్టిఫికెట్ల రద్దు

కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు

చట్టవిరుద్ధం అని ధర్మాసనం వ్యాఖ్య

అయితే ఇప్పటికే ప్రయోజనం పొందిన వారికి ఇబ్బంది లేదని స్పష్టం



2



కోర్టు ఉత్తర్వులను **ఆమోదించం**

కోటా కొనసాగుతుంది

సీఎం మమతా బెనర్జీ

పిన్నెల్లి పరార్!

ఈవీఎం ధ్వంసం కేసుతో పలాయనం



ఈవీఎం పగలగొడుతున్న పిన్నెల్లిని అడ్డుకున్న శేషగిరిరావుపై పోలింగ్ ముగిశాక దాడి చేయడంతో రక్త గాయాలైన దృశ్యం (ఫైల్)

దేశం దాటారా.. ఇక్కడే ఉన్నారా?

ప్రత్యేక బృందాలతో పోలీసుల వేట

తెలంగాణలో మకాం వేసినట్లు సమాచారం

సంగారెడ్డిలో అరెస్టు చేసినట్లు వార్తలు

పాలమూరులోని ఓ పత్తి మిల్లులో బస

పోలీసులు వెళ్లడానికి ముందే షెల్టర్ ఖాళీ!

పిన్నెల్లి వాహనం సీజ్.. డ్రైవరు అదుపులోకి

లుక్ అవుట్ జారీ.. ఎయిర్‌పోర్టులన్నీ అలర్ట్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పోలింగ్ రోజు, ఆ తర్వాత మాచర్లలో అరాచకం సృష్టించిన వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీలో ఉన్నారు. విదేశాలకు పారిపోయారా... లేక దేశంలోనే ఎక్కడైనా అజ్ఞాతంలో ఉన్నారా అనేది తెలియడంలేదు. 'నేను ఎక్కడికీ పారి పోలేదు. పోలీసుల సూచన మేరకే హైదరాబాద్ వచ్చాను' అని సుద్దపూస కబుర్లుచెప్పిన ఆయన కోసం పోలీసు ప్రత్యేక బృందాలు

మిగతా 11వ పేజీలో...

పరారీకి ఐపీఎస్ సాయం!

'తాడేపల్లి' ఆదేశాలతో రంగంలోకి.. పోలీసుల కదలికలపై సమాచారం

మరో సీనియర్ ఐఏఎస్ కూడా సహకారం! 2

ఓ టీవీ చానల్ ప్రతినిధి పాత్రపైనా ప్రచారం



'గుర్తుతెలియని' పిన్నెల్లి

బూత్‌లోకి జొరబడి ఈవీఎం బద్దలు

లేచి నిలబడి దండం పెట్టిన పీవో

ఎమ్మెల్యే పేరు లేకుండానే ఫిర్యాదు

'గుర్తు తెలియని' నిందితులపై కేసు

సిట్ విచారణతో కదిలిన డొంక 11

సీఈవో ఆఫీసు నుంచి సీసీ టీవీ ఫుటేజ్

ఆ తర్వాతే కేసులో ఏ1గా పిన్నెల్లి

వెబ్‌క్యాస్టింగ్ పెట్టి ప్రయోజనమేమిటి?

మాచర్లలో వైఫల్యాల పరంపర

ఎమ్మెల్యేనే అడ్డుకునేంత మగాడివా.. ఎలా బతికుంటావో చూస్తా

నన్ను ఇప్పటికీ బెదిరిస్తున్నారు.. తీవ్రంగా కొట్టారు

భయపడిపోయి పొలాల్లో తలదాచుకున్నా 11

పిన్నెల్లి నుంచి ప్రాణహాని: బాధితుడు శేషగిరిరావు

వైసీపీ అభ్యర్థుల ఒత్తిళ్లు తట్టుకోలేం!

భయభ్రాంతులకు గురిచేస్తున్నారు 2

సెలవుల కోసం రిటర్నింగ్ అధికారుల మొర

వెంటనే ఎమ్మెల్యేను అరెస్ట్ చేయండి 11

రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఈసీ ఆదేశం

ఈవీఎం ధ్వంసం ఘటనపై తీవ్ర ఆగ్రహం

ఎక్స్‌లో లోకేశ్ చేసిన పోస్టుపై స్పందన

త్వరలో ఎమ్మెల్యే, ఇతర నిందితులను అరెస్ట్ చేస్తామని ఈసీకి డీజీపీ నివేదిక

4 బృందాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడి



2

పిన్నెల్లికి ఏడేళ్లు శిక్ష పడే అవకాశం

ఈవీఎం ధ్వంసంపై 10 సెక్షన్లతో కేసు

సీసీ ఫుటేజ్ వల్లే సాక్ష్యాలు దొరికాయి

కౌంటింగ్‌కు 20 కంపెనీల బలగాలు: మీనా



కోడ్ ఉన్నా 'క్లీన్'గా కట్టబెట్టేశారు!

క్లీన్ ఎనర్జీ సంస్థకు 1,725 ఎకరాల సంతర్పణ

కడప, నంద్యాల, అనంతల్లో కేటాయింపు

ఎకరా ఐదు లక్షలు లేదంటే ఏడాదికి రూ.31 వేల అద్దెకు అప్పగింత

రాష్ట్ర ఇంధన శాఖ ఉత్తర్వులు.. ఆ కంపెనీ పెట్టి మూడేళ్లూ కాలేదు

రూ.లక్ష పెట్టుబడితో 'క్లీన్' ఏర్పాటు..చిరునామా ఢిల్లీ పారిశ్రామికవాడ

కార్యకలాపాలూ అంతంతే.. అలాంటి కంపెనీకి ఇన్ని భూములా?

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ జగన్ ప్రభుత్వం భూసంతర్పణ చేసింది. 375 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల కోసం క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ (బార్మర్) ప్రైవేట్ లిమిటెడ్‌కు 1,725 ఎకరాలను కట్టబెట్టింది. ఈ నెల 17వ తేదీన ఇంధన శాఖ సంబంధిత ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లా కొత్తపాడులో 1,350 ఎకరాల్లో 225 మెగావాట్ల సోలార్ డీసీ ప్లాంటు.. అనంతపురం జిల్లా తలారిచెరువు, నంద్యాల జిల్లా బోయల ఉప్పలూరు, కడప జిల్లాలో 150 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును (375 ఎకరాల్లో) ఏర్పాటు చేస్తామంటూ క్లీన్ ఎనర్జీ సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌కు దరఖాస్తు చేసింది. ఎకరాకు రూ.5 లక్షలు లేదా ఏటా రూ.31,000 చొప్పున అద్దెకు భూములు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ప్రతి రెండేళ్లకు ఐదుశాతం చొప్పున అద్దె పెంచాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలింగ్ ముగిసినా జూన్ 4వ తేదీన గానీ ఫలితాలు వెలువడవు. ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుంది. ప్రభుత్వం విధాన నిర్ణయాలేవీ తీసుకోకూడదు. అయినా సంప్రదాయేతర ఇంధన వనరులను

మిగతా 12వ పేజీలో...

బంగాళాఖాతంలో అల్పపీడనం

రేపటికి వాయుగుండం.. తర్వాత తుఫాన్‌గా మార్పు

25న రాత్రి బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటే చాన్స్

'రీమల్'గా నామకరణం..నెలాఖరుకు కేరళలోకి నైరుతి?

4 రోజులు వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

రాష్ట్రంలో నేటి నుంచి పెరగనున్న ఎండలు.. 26 నుంచి వడగాడ్పులు

విశాఖపట్నం, అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్రకు ఆనుకుని నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. దీనిపై సముద్ర మట్టానికి 7.6. కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అల్పపీడనం ఈశాన్య దిశగా పయనించి శుక్రవారంనాటికి వాయుగుండంగా బలపడి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. ఆ తర్వాత

మిగతా 2వ పేజీలో...

హద్దు దాటొద్దు

"ఎన్నికల ప్రచారంలో 'హద్దు' దాటొద్దని మీ 'స్టార్ క్యాంపెయినర్ల'కు చెప్పండి" అంటూ ఎన్నికల కమిషన్ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సూచించింది! ఇరు పార్టీల స్టార్ క్యాంపెయినర్లు చేస్తున్న ప్రసంగాలు గాడి తప్పుతున్నాయంటూ.. ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించకుండానే ఆగ్రహం వ్యక్తం చేసింది. క్యాంపెయినర్లు ఎన్నికల నియమావళిని పాటించేలా చూడాల్సిన బాధ్యత పార్టీల అధ్యక్షులపైనే ఉన్నదని గుర్తు చేసింది.

ప్రచారంలో శ్రుతి మించొద్దని మీ 'స్టార్ క్యాంపెయినర్ల'కు చెప్పండి

బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులకు ఎన్నికల కమిషన్ హెచ్చరిక



కులం, మతం, జాతి, భాషలపై రెచ్చగొట్టే ప్రసంగాలు

ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడం సరికాదు

మతపరమైన ప్రచారం తప్పంటూ ఈసీ ఆగ్రహం

ముస్లింలీగ్, శక్తి వంటి పదాల వాడకంపై అభ్యంతరం

రక్షణ దళాలను రాజకీయాల్లోకి లాగొద్దని సూచన

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్‌లు తమ తమ స్టార్ క్యాంపెయినర్ల ప్రసంగాల్లో కనీస మర్యాద పాటించేలా చూడాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. పార్టీల నేతల ప్రసంగాల తీరుపై లోక్‌సభ ఎన్నికల్లో ఐదో దశ ముగిసిన తర్వాత ఈసీ స్పందించింది. కాంగ్రెస్ గెలిస్తే దేశ సంపదను ముస్లింలకు పంచేస్తుందంటూ మోదీ.. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రాహుల్ గాంధీ.. ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై ఇరు పార్టీలూ ఈసీకి ఫిర్యాదులు చేశాయి. వాటిపై వివరణ ఇవ్వాలంటూ రెండు పార్టీలకూ ఈసీ గతంలో ఆదేశాలు జారీ చేసింది. వాటిపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇచ్చిన వివరణలను తిరస్కరిస్తూ.. తాజాగా వారికి లేఖలు రాసింది. కులం, మతం, జాతి, భాషల ఆధారంగా రెచ్చగొట్టే ప్రసంగాలు, వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న నేతలు సంయమనం పాటించేలా చూడాలని ఆ లేఖల్లో సూచించింది. వివిధ కులాలు, మతాలు, తెగలు, భాషలకు చెందిన ప్రజల

మిగతా 2వ పేజీలో...

కేంద్రానికి ఆర్బీఐ భారీ గిఫ్ట్

రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్

ఆర్బీఐ చరిత్రలోనే అత్యధికం

బ్యాంకు కేంద్రబోర్డు సమావేశంలో నిర్ణయం

ఆర్థికరంగం బలోపేతం నేపథ్యంలో భారీ డివిడెండ్‌కు ఆమోదం

బడ్జెట్ అంచనాల కన్నా రెట్టింపు.. ద్రవ్యలోటు లక్ష్యసాధనలో ఉపయోగం

2



బయోమెట్రిక్ ఉంటేనే కొత్త సిమ్‌కార్డ్

సెప్టెంబరు నుంచి టెలికాం కొత్త నిబంధనలు

ఏపీకి 'అష్ట'కష్టాలు!

విభజన చట్టంలోని నిబంధనలతో కుదేలు

వాటిని సవరిస్తే ఆర్థికంగా వెసులుబాటు

అప్పులన్నీ జనాభా ప్రాతిపదికన విభజన

ఆస్తులు మాత్రం భౌగోళికంగా అప్పగింత

రూ.వేల కోట్ల భారంతో గాడితప్పిన రాష్ట్రం

ఏపీకి న్యాయం చేయాలని కోరుతూ కేంద్రానికి అనేకసార్లు చంద్రబాబు లేఖలు

ఒక్క నిబంధననూ సవరించని కేంద్రం

రాష్ట్రానికి శాపంగా 8 నిబంధనలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఏపీ రెండు రాష్ట్రాలుగా విడిపోయి పదేళ్లు కావస్తోంది. ఇప్పటికీ రాష్ట్రాన్ని విభజన కష్టాలు వెంటాడుతున్నాయి. విభజన అనంతరం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడితప్పింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఏపీకి రావాల్సింది కొండంత ఉంటే... వాస్తవంగా వచ్చింది గోరంత మాత్రమే. ఆదుకుంటామన్న కేంద్ర ప్రభుత్వం భరోసా ఇవ్వడమే తప్ప ఆచరణలో దక్కింది శూన్యం. రాష్ట్రాన్ని ఆదుకుంటామని కేంద్రం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు కాలేదు. మరోవైపు ఈ చట్టంలో పేర్కొన్న ఎనిమిది నిబంధనలతో రాష్ట్రానికి రూ.వేల కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఈ నిబంధనలు సవరించి ఏపీకి న్యాయం

మిగతా 12వ పేజీలో...



తిరుమలలో దర్శనం తర్వాత కూతురు, అల్లుడు, మనవడితో తెలంగాణ సీఎం రేవంత్ దంపతులు

ఏపీతో సత్సంబంధాలు 12

సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై కొత్త ప్రభుత్వంతో కలిసి ముందుకు: రేవంత్ రెడ్డి



కేజ్రీవాల్ కాంగ్రెస్‌కు, రాహుల్ ఆప్‌కు ఓటేస్తారు: రాఘవ్ చద్దా

న్యూఢిల్లీ, మే 22: ఆరోదశ ఎన్నికలకు ముందు ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)- కాంగ్రెస్‌ల బంధం గురించి వివరిస్తూ.. మే 25న జరగనున్న ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి ఆప్ అధినేత కేజ్రీవాల్ కాంగ్రెస్‌కు ఓటేస్తారని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆప్‌కు ఓటేస్తారని చెప్పారు. కంటి ఆపరేషన్ తర్వాత యూకే నుంచి తిరిగి వచ్చిన ఆయన దక్షిణ ఢిల్లీ ఆప్ అభ్యర్థి సాహీ రామ్ పహిల్వాన్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఢిల్లీ ప్రజలు ఓటేసేముందు తమ పిల్లల భవిష్యత్తును గురించి ఆలోచించి ఓటేయాలని అన్నారు. ఆప్ పథకాలతో ఢిల్లీలోని ప్రతి కుటుంబానికి నెలకు రూ.18వేలు ఆదా అవుతున్నాయని చెప్పారు. ఉచిత విద్యుత్, మందులు, నీరు అలాగే పిల్లల స్కూల్ ఫీజులు, మహిళలకు ఉచిత బస్సులాంటి పథకాలు కొనసాగాలంటే ఆప్‌కు ఓటేయాలని రాఘవ్ పిలుపునిచ్చారు.

కేంద్రానికి ఆర్బీఐ భారీ గిఫ్ట్

2.11లక్షల కోట్ల డివిడెండ్.. ఆర్బీఐ చరిత్రలోనే అత్యధికం

ముంబై, మే 22: ఎన్నికల తర్వాత కేంద్రంలో కొలువుదీరే కొత్త ప్రభుత్వానికి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీ గిఫ్ట్ ఇచ్చింది. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రానికి రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. ఆర్బీఐ చరిత్రలోనే ఇది అత్యధికం. ఇప్పటి వరకూ 2018-19లో ప్రకటించిన రూ.1.76 లక్షల కోట్ల డివిడెండ్ అత్యధికం కాగా.. తాజా డివిడెండ్ దీనిని అధిగమించింది. గత ఏడాది డివిడెండ్‌తో పోలిస్తే ఇది దాదాపు 140 శాతం ఎక్కువ. 2023 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ కేంద్రానికి రూ.87,416 కోట్ల మొత్తాన్ని అందించింది. బుధవారం ముంబైలో ఆర్బీఐ కేంద్రబోర్డు 608వ సమావేశం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస అధ్యక్షతన జరిగింది. దేశీయంగా, అంతర్జాతీయంగా ఆర్థిక రంగంలో నెలకొన్న పరిస్థితులను ఈ భేటీలో చర్చించారు. ఈ మేరకు ఆర్బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది.

లోక్‌సభ బరిలో 8,360 మంది

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 8,360 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. 1996లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికంగా 13,952 మంది పోటీ చేశారని, అభ్యర్థుల సంఖ్య పరంగా ఈ లోక్‌సభ ఎన్నికలు రెండో స్థానంలో నిలిచాయని తెలిపింది. ఈసారి పోటీ చేసినవారిలో మహిళలు 797మంది ఉన్నారని, మొత్తం అభ్యర్థుల్లో మహిళలు 9.5శాతమని పేర్కొంది. మరోవైపు, 8,360 మందిలో 8,337మంది అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ విశ్లేషించింది. ఏడో దశలో 904మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపింది. వీరిలో 95మంది(11%) మహిళలు. ఏడీఆర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ దశలో బరిలో ఉన్నవారిలో 199మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 299 మంది కోటీశ్వరులున్నారు.

బీజేపీకి 295 నుంచి 315 సీట్లు

» అమెరికా రాజనీతి శాస్త్రవేత్త బ్రెమర్ విశ్లేషణ

న్యూఢిల్లీ, మే 22: భారత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ వరుసగా మూడోసారి కూడా విజయం సాధించనుందని అమెరికా రాజనీతి శాస్త్రవేత్త ఇయాన్ బ్రెమర్ తెలిపారు. 295 నుంచి 315 స్థానాల వరకు గెలుచుకుంటుందన్నారు. భారత ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికం, స్వేచ్ఛాయుతం, పారదర్శకంగా ఉందని ప్రశంసించారు. అద్భుత ఆర్థికాభివృద్ధి కారణంగా ప్రధాని మోదీ సారథ్యంలో బీజేపీ హ్యాట్రిక్ గెలుపు అందుకోనుందని తెలిపారు. బ్రెమర్.. రిస్క్-రీసెర్చ్ కన్సల్టింగ్ సంస్థ అయిన యూరేసియా గ్రూపు వ్యవస్థాపకుడు.

బయోమెట్రిక్ ఉంటేనే కొత్త సిమ్‌కార్డ్!

న్యూఢిల్లీ, మే 22: టెలికాం రంగంలో కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023లో తీసుకొచ్చిన నిబంధనలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డాట్) త్వరలో అమలు చేయనుంది. ఈ విషయంపై డాట్‌కు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) గతంలో సిఫార్సు చేసింది నకిలీ సిమ్ కార్డ్‌లతో సైబర్ మోసాలు విజృంభిస్తున్న తరుణంలో వీటిని నిరోధించడానికి కొత్త మార్గదర్శకాలు ఉపయోగపడనున్నాయి. దీని ప్రకారం... కొత్త కనెక్షన్‌ను అందించాలంటే బయోమెట్రిక్ గుర్తింపు తప్పనిసరి. అటువంటి సున్నితమైన సమాచారాన్ని సేకరించడంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా టెలికాం కంపెనీలకు స్పష్టమైన మార్గదర్శకాలు డాట్ జారీ చేయనుంది. వీటితో పాటు దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించాలంటే.. సదరు కంపెనీలు ప్రభుత్వం నుంచి స్పెక్ట్రమ్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. టెలికమ్యూనికేషన్స్ చట్టంలోని వివిధ సెక్షన్‌లలో పేర్కొన్న నిబంధనలను సెప్టెంబర్ 15 నాటికి అమల్లోకి తీసుకురావాలని డాట్ లక్ష్యంగా పెట్టుకుంది.

పుణె టీనేజర్ బెయిల్ రద్దు.. అతడి తండ్రి కస్టడీకి

పుణె, మే 22: మద్యం మత్తులో పోర్షె కారును వేగంగా నడిపి ఇద్దరు ఐటీ ప్రొఫెషనల్స్ మరణానికి కారకుడైన టీనేజర్‌కు ఇచ్చిన బెయిల్‌ను పుణె జువైనల్ జస్టిస్ బోర్డు రద్దు చేసి జూన్ 5 వరకు రిమాండ్ హోమ్‌కు పంపింది. అయితే అతడిని వయోజనుడిగా భావించి విచారించాలన్న అంశంపై నిర్ణయం ప్రకటించలేదు. అతడికి బెయిల్ ఇచ్చి రోడ్డు ప్రమాదాలపై వ్యాసం రాయమనడంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయిన మూడు రోజుల తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. కాగా టీనేజర్ తండ్రికి పుణె సెషన్స్ కోర్టు బుధవారం రెండు రోజుల పోలీసు కస్టడీ విధించింది. పోలీసులను తప్పించుకొనేందుకు ఛత్రపతి శంభాజీనగర్ వెళ్లిన అతడిని అక్కడే మంగళవారం అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

ఈశాన్య, వాయువ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఈ క్రమంలో తుఫాన్‌గా మారి ఈనెల 25వ తేదీ రాత్రి పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటుతుందని కొన్ని మోడళ్లు, బంగ్లాదేశ్, మయన్మార్ దిశగా వెళుతుందని మరికొన్ని మోడళ్ల ఆధారంగా అంచనా వేశారు. ఈనెల 24వ తేదీ తరువాత ఏర్పడనున్న తుఫాన్‌కు ఒమన్ దేశం సూచించిన 'రీమల్' (ఆర్ఈఎంఏఎల్) అని పేరు పెట్టనున్నారు. కాగా, గడచిన మూడు రోజులుగా వాయువ్య భారతంలో తీవ్ర వడగాడ్పులు కొనసాగుతున్నాయి. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతాయి. ఈనెల 26వ తేదీ నుంచి వడగాడ్పులు వీస్తాయని ఇస్రో వాతావరణ నిపుణుడు హెచ్చరించారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. నైరుతి రుతుపవనాలు బుధవారం అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమరిన్, దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లో కొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న రెండు రోజుల్లో అండమాన్ దీవులు, అండమాన్ సముద్రంలో మిగిలిన ప్రాంతాలు, తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించనున్నాయని ఐఎండీ తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కేరళ పరిసరాల్లో విస్తారంగా, కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇంకా కర్ణాటక, తమిళనాడు, లక్షద్వీప్‌లో కూడా వర్షాలు పడుతున్నాయి. రానున్న రెండు, మూడు రోజుల వరకు వర్షాలు కొనసాగుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఉన్న మోడళ్ల మేరకు ఈనెల 31న కేరళలో(నాలుగు రోజులు అటు ఇటుగా) నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని బుధవారం వాతావరణ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అయితే కొందరు నిపుణులు ఒకరోజు ముందు (30న) రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నారు.

తీవ్ర ఒత్తిడిలో న్యాయవ్యవస్థ: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 22: దేశంలో న్యాయవ్యవస్థ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. ఈ విషయం దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. జూన్ 4 తరువాత ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, న్యాయవ్యవస్థపై ఒత్తిడిని తొలగించి.. స్వేచ్ఛగా పనిచేసేలా చూస్తుందని చెప్పారు. దాంతో తనపై పెట్టిన బోగస్ కేసులనూ కొట్టేస్తారని, జూన్ 5న తాను జైలు నుంచి విడుదలవుతానని అన్నారు.

అయోధ్యపై బుల్డోజర్ అబద్ధం

55 ఏళ్లు పాలించినా ఏ ఒక్కరి మంగళసూత్రం మేం లాక్కోలేదు

» ప్రధాని మోదీవి పచ్చి అబద్ధాలు

» ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ మే 22: ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అయోధ్యలోని రామ మందిరంపైకి బుల్డోజర్‌ను పంపిస్తుందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఈ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్లు పాలించిందని.. ఏనాడూ ఏ ఒక్కరి మంగళసూత్రాన్నీ లాగేసుకోలేదని ఖర్గే అన్నారు. ఎవరి విశ్వాసాలకూ తాము అడ్డు చెప్పలేదన్నారు. ఇవన్నీ తెలిసి కూడా ప్రధాని మోదీ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. "మా పార్టీ నేతలు ఎన్నడూ ఇంత బరితెగించి మాట్లాడలేదు" అని ఖర్గే అన్నారు. పేదలు ఏ మతంలో ఉన్నా వారికి సాయం చేయడం 'బుజ్జగింపు' కాబోదని చెప్పారు. బీజేపీ, మోదీలు ప్రజల మధ్య విభజన సృష్టించి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నాయని, ఓట్ల కోసమే వారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. యూపీఏ హయాంలో తీసుకువచ్చిన పథకాలతో పేదలకు తమ పార్టీ మేలు చేసిందని, కానీ, దీనిపై కూడా బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. గతంలో తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకం సహా అనేక పథకాలను తప్పుబట్టిన బీజేపీ.. ఇప్పుడు వాటిని తన ఘనతగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. "మేం ఏం చేసినా.. దానిని బుజ్జగింపుగా బీజేపీ ప్రచారం చేస్తోంది. కానీ, నా ఉద్దేశంలో బీజేపీనే బుజ్జగింపు రాజకీయాలు చేస్తోంది" అని అన్నారు. తమిళనాడు మాదిరిగా 69% రిజర్వేషన్లు పెంచాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఇవి పేదలకేనని. దీనిని కూడా బీజేపీ వ్యతిరేక కోణంలో ప్రచారం చేస్తోందన్నారు.

అందుకే కులగణన

కులగణనను ఖర్గే సమర్థించారు. గతంలో నిరాదరణకు గురైన కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే కులగణన చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఎవరి హక్కులనూ కాలరాయబోమని స్పష్టం చేశారు. కానీ, బీజేపీ మాత్రం ప్రతి విషయాన్నీ వక్రీకరించే పనిలో ఉందన్నారు. భూసంస్కరణలు తెచ్చినప్పుడు, బ్యాంకులను జాతీయం చేసినప్పుడు కూడా యాగీ చేసిందని దుయ్యబట్టారు. బీజేపీ నేతలకు ఫ్యూడల్ మనస్తత్వం ఉందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు తాము కట్టుబడి ఉంటామని, కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలో చేసి చూపుతున్నామని ఖర్గే చెప్పారు. పేదలకు తాము రూ.లక్ష ఇస్తామని చెబుతున్నామని.. ఇది వారి ఆర్థిక స్వావలంబనను పెంచుతుందన్నారు. ధనిక వర్గాలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన బీజేపీ.. ప్రజలకు రూ.లక్ష ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. "తాను లేకపోతే.. అంతా నాశనం అయిపోతుందని మోదీ అంటున్నారు. కానీ, ఎన్డీయే హయాంలో ఏం జరిగింది? దేశంపై రూ.155 లక్షల కోట్ల అప్పుల భారం పడింది. కాంగ్రెస్ హయాంలో ఈ అప్పు రూ.55 లక్షల కోట్లేనన్న విషయాన్ని వారు మరిచిపోతున్నారు. వారు చేసిన తప్పులు మరిచిపోతూ.. మాపై నిందలు మోపుతున్నారు" అని ఖర్గే వ్యాఖ్యానించారు. మరోవైపు, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కంకణం కట్టుకొందని ప్రియాంకగాంధీ ఆరోపించారు. ఝార్ఖండ్‌లోని గొడ్డాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

'అగ్నివీర్'ను చెత్తబుట్టలో పడేస్తాం : రాహుల్ గాంధీ

మహేంద్రగఢ్(హరియాణా) మే 22: ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని పూర్తిగా రద్దుచేసి చెత్తబుట్టలో పడేస్తామని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. బుధవారం హరియాణాలో ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. 'భారత జవాన్లను ప్రధాని మోదీ కూలీలుగా మార్చారు. ఇది ఆర్మీ పథకం కాదు... మోదీ పథకం. దీన్ని పీఎంవో రూపొందించింది' అని ఆయన పేర్కొన్నారు. "22మంది అగ్ర పారిశ్రామికవేత్తలకు రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం... రైతుల రుణాలను మాత్రం మాఫీ చేయబోమని బహిరంగంగానే చెబుతోంది. రైతుల రక్షణ కోసం, వారికి తగిన పరిహారం దక్కేవిధంగా మేం తీసుకొచ్చిన భూ సేకరణ బిల్లును రద్దు చేశారు" అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 4న తాము అధికారంలోకి రాగానే రైతుల రుణాలు మాఫీ చేస్తామని, దీనికి సంబంధించి కర్జా మాఫీ (రుణ మాఫీ) కమిషన్‌ను తీసుకొస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

హద్దు దాటొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నడుమ ఇప్పటికే ఉన్న విభేదాలు మరింత పెరిగేలా, పరస్పర విద్వేషాన్ని కలిగించేలా, ఉద్రిక్తతలను పెంచేలా ఏ పార్టీ, ఏ అభ్యర్థీ ఎలాంటి వ్యాఖ్యలూ చేయకూడదని, ఎలాంటి చర్యలూ చేపట్టకూడదని ఎన్నికల నియమావళి పేర్కొంటున్న విషయాన్ని గుర్తుచేసింది. క్యాంపెయినర్లు ఆ నియమావళిని అనుసరించేలా చూసే బాధ్యత పార్టీలదేనని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ తాత్కాలికమని.. ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు వస్తాయి, పోతాయని.. కానీ ప్రసంగాల ప్రభావం ఎక్కువ కాలం ఉండే ప్రమాదం ఉందని కేంద్ర ఎన్నికల సంఘం ఆందోళన వెలిబుచ్చింది. సమాజంలో విభజనకు దారితీసే ప్రసంగాలు ఆపాలని బీజేపీకి స్పష్టం చేసింది. మతపరమైనర ప్రచారం చేయకుండా తమ స్టార్‌క్యాంపెయినర్లను నియంత్రించాలని ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు రాసిన లేఖలో సూచించింది. ముస్లిం లీగ్ శక్తి వంటి పదాల వినియోగంపై ఈసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రచారంలో ప్రసంగాలు చేసేటప్పుడు అధికార పార్టీగా ఎంతో బాధ్యతతో వ్యవహరించాలని తెలిపింది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి మినహాయింపులు ఉండవని, అంతే జాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉన్నదని స్పష్టం చేసింది. భారత రాజ్యాంగం రద్దవుతుందని ప్రజలను తప్పుదారి పట్టించే ప్రకటనలు చేయొద్దని కాంగ్రెస్‌కు సూచించింది. తాము అధికారంలోకి వస్తే 'అగ్నివీర్' పథకాన్ని రద్దు చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించిన నేపథ్యంలో.. రక్షణ దళాలను రాజకీయాల్లోకి లాగొద్దని హెచ్చరించింది. ఎన్నికల ప్రచారంలో పార్టీలన్నీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడం తప్పని.. ఎన్నికల వ్యవస్థపై ఓటరుకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే తాము సహించబోమని హెచ్చరించింది.

పాక్‌కు.. రాహుల్, అఖిలేశ్ జై

» కూటమి గెలిస్తే రాముడు మళ్లీ గుడారాల్లోకే

» యూపీ ప్రచార సభల్లో ప్రధాని మోదీ

లఖ్‌నవూ, మే 22: పాకిస్థాన్‌కు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు మద్దతు ఇస్తున్నాయని, ఆ దేశం వద్ద ఉన్న అణుబాంబును చూపించి భారత్‌ను భయపెడుతున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో ఆరో విడత ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ప్రచార సభల్లో మాట్లాడుతూ ఈ సందర్భంగా రాహుల్, అఖిలేశ్ యాదవ్‌లపై విరుచుకుపడ్డారు. "రాహుల్, అఖిలేశ్ 2017లో కలిసి యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి పరాజయం పాలయ్యారు. ఒకసారి ఫ్లాప్ అయిన 'ఇద్దరు రాకుమారులు' సినిమాను తిరిగి తెరపైకి తీసుకురావడం ఆశ్చర్యం కలిగించింది" అని మోదీ అన్నారు. ఇండియా కూటమి యూపీలో 79 సీట్లు గెలవనున్నదన్న అఖిలేశ్ వ్యాఖ్యలపై.. నిద్రపోతున్న కూటమి నేతల మత్తును జూన్ 4న యూపీ ప్రజలు వదిలిస్తారని, అప్పుడు వాళ్లు తమ ఓటమికి ఈవీఎంలను దూషిస్తారని ఎద్దేవా చేశారు. 'ఇండియా' గెలిపిస్తే సనాతన ధర్మాన్ని రాహుల్, అఖిలేశ్ ధ్వంసం చేసేస్తారని, అయోధ్య ఆలయంలోని రాముడిని తిరిగి గుడారాల కిందకు చేరుస్తారని ఆరోపించారు.

2010 నుంచి జారీచేసిన ఓబీసీ సర్టిఫికెట్ల రద్దు

» 2010 నుంచి జారీ చేసినవి చెల్లవన్న కలకత్తా హైకోర్టు

కోల్‌కతా, మే 22: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ సర్కారు జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2010 తర్వాత రూపొందించిన ఓబీసీ జాబితా పూర్తిగా 'చట్టవిరుద్ధం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. పశ్చిమబెంగాల్ బీసీ కమిషన్ సారథ్యంలో 'వెస్ట్ బెంగాల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ యాక్ట్-1993 ప్రకారం కొత్తగా ఓబీసీల జాబితా రూపొందించాలని నిర్దేశించింది. రాష్ట్రంలో 1993 నాటి చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఓబీసీల జాబితా రూపొందించారని.. దానివల్ల అసలు ఓబీసీలకు అన్యాయం జరిగిందంటూ 2011లో కలకత్తా హైకోర్టులో పిల్ దాఖలైంది. ఆ వ్యాజ్యాన్ని విచారించి కోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో పద్నాలుగేళ్లుగా అక్కడ జారీ అయిన ఓబీసీ సర్టిఫికెట్లన్నీ రద్దయినట్టయింది. అయితే.. ఈ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాలు పొంది ఇప్పటికే సర్వీసుల్లో ఉన్న వారికి, ఆ రిజర్వేషన్ కారణంగా ప్రయోజనం పొందిన వారికి, ఇప్పటికే ఏదైనా ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించి ఎంపిక ప్రక్రియలో ప్రాసెస్‌లో ఉన్నవారికి తాజా ఉత్తర్వులు వర్తించవని కోర్టు స్పష్టం చేసింది. కాగా కోల్‌కతా హైకోర్టు తీరును ప్రభుత్వం అంగీకరించే ప్రసక్తే లేదని పశ్చిమ బెంగాల్ సీఎం మమత పేర్కొన్నారు. రాష్ట్రంలో ఓబీసీ రిజర్వేషన్ల కోటా కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

ఎలా తప్పించుకున్నారు?

పిన్నెల్లికి సీనియర్ ఐపీఎస్ సాయం!

తాడేపల్లికి ఆయన అత్యంత సన్నిహితుడు

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు పోలీసుల నుంచి ఎలా తప్పించుకోగలిగారు? పిన్నెల్లి సోదరులు పోలీసులకు దొరకకుండా తాడేపల్లి ప్యాలెస్‌కు అత్యంత సన్నిహితుడైన ఓ సీనియర్ ఐపీఎస్ దర్శకత్వం వహించగా, మరో సీనియర్ ఐఏఎస్ సహకరించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హింసాత్మక సంఘటనలు జరిగిన నేపథ్యంలో పోలీసులు పిన్నెల్లి సోదరులను హౌస్ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే పోలీసులకు తెలియకుండా ఇంట్లో నుంచి వారిద్దరూ తప్పించుకున్నారు. ఆ తర్వాత పోలింగ్ బూత్‌లో ఈవీఎంను ధ్వంసం చేసిన వీడియో బయటకు రావడంతో పిన్నెల్లిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో తన అరెస్టు అనివార్యమని భావించిన పిన్నెల్లి మరోసారి పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్నారు. తెలంగాణలో వారిని అరెస్ట్ చేసినట్టు వార్తలు కూడా వచ్చాయి. అయితే పిన్నెల్లి సోదరుల జాడ తెలియరాలేదు. పోలీసుల కదలికలను పిన్నెల్లికి చేరవేస్తున్నది ఎవరు? ఈవీఎం ధ్వంసంతో పాటు ఎమ్మెల్యేపై మరో హత్యాయత్నం కేసు కూడా ఉన్న నేపథ్యంలో పారిపోయేందుకు సహకరించింది ఎవరు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తాడేపల్లి పెద్దలతో నిరంతరం టచ్‌లో ఉండే సీనియర్ ఐపీఎస్ అధికారిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఐపీఎస్ స్వీయ దర్శకత్వంలోనే పిన్నెల్లి తప్పించుకున్నట్టు ఉన్నత స్థాయి పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. దీనికి మరో సీనియర్ ఐఏఎస్ అధికారి సహకరించినట్లు చర్చ జరుగుతోంది. కీలక అధికారి పోలీసుల కదలికలను ఎప్పటికప్పుడు పిన్నెల్లికి చేరవేస్తూ.. 'సేఫ్'గా తప్పించుకునే మార్గాలను సూచిస్తున్నట్లు తెలుస్తోంది. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జగన్ విదేశాలకు వెళ్లేరోజునే పిన్నెల్లి సోదరులు తాడేపల్లి ప్యాలెస్‌లో ఆయనను కలుసుకున్నారు. ఈవీఎం ధ్వంసం చేసిన సంగతి తెలిపారు. ఆ విషయంలో ఎన్నికల కమిషన్ సీరియస్ యాక్షన్ తీసుకుంటే పిన్నెల్లి సోదరులకు సహకరించాలని సదరు కీలక అధికారిని జగన్ ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఆయన పోలీసుల కదలికలను పిన్నెల్లికి చేరవేస్తున్నట్లు తెలుస్తుంది.

పరారీలోనూ పోలీసుల హస్తం!

పిన్నెల్లి సోదరులు హౌస్ అరెస్ట్‌లో ఉన్నప్పుడు మాచర్ల పట్టణంలోని తమ స్వగృహం నుంచి పరారవడానికి స్థానిక పోలీసు అధికారుల హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. హోంగార్డు నుంచి కానిస్టేబుళ్లు, ఎస్ఐ, ఎస్పీ అధికారులు సహకరించినట్లు సమాచారం. సిట్ బృందం మాచర్లలో పర్యటించినపుడు పోలీసుల పనితీరులో లోపాలను గుర్తించింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించింది. ఇదిలావుంటే, పిన్నెల్లి సోదరులు విదేశాలకు పారిపోయే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది. దీనికోసం ఒక ప్రముఖ టీవీ చానల్‌కు చెందినవారిని ఉపయోగించుకున్నట్లు సమాచారం. పిన్నెల్లి సోదరులు ఆంధ్ర సరిహద్దులు దాటే సమయంలో కూడా ఆ చానల్‌కు చెందిన ప్రముఖ వ్యక్తి వారితో ఉన్నట్లు తెలుస్తోంది.

పిన్నెల్లికి ఏడేళ్లు శిక్ష పడే అవకాశం: సీఈవో

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశముందని సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. కోర్టు రెండేళ్లపైబడి శిక్ష విధిస్తే.. ఆయనపై అనర్హత వేటు కూడా పడే అవకాశముందన్నారు. పాల్వాయి గేట్‌లో ఈవీఎంల ధ్వంసంపై ఐపీసీ, పీడీపీపీ, ఆర్పీ చట్టాల్లోని 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై ఈ నెల 20నే కేసు నమోదు చేసినట్లు తెలి పారు. సచివాలయంలో బుధవారం మీనా మాట్లాడుతూ.. "రాష్ట్రం లో పోలింగ్ రోజున 9 చోట్ల ఈవీఎంలు ధ్వంసమయ్యాయి. మాచర్ల లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశాం. ఇక్కడ ఏడు ఈవీఎంలు ధ్వంసమైనా.. కంట్రోల్ యూనిట్లలో డేటా భద్రం గానే ఉంది. రీపోలింగ్ అవసరం ఉండదు. పాల్వాయిగేట్‌లోని పో లింగ్ బూత్‌లో ఈవీఎంను గుర్తు తెలియని వ్యక్తి పగలగొట్టినట్టు మొదట కేసు నమోదు చేసినా.. తర్వాత ఫుటేజ్ ఆధారంగా ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసినట్లు గుర్తించాం. ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరుని ఏ1గా చేర్చి కేసు నమోదు చేశారు. పిన్నెల్లిని వెంటనే అరెస్ట్ చేయాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఆయన కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈవీఎంని ధ్వంసం చేసిన వారికి రెండేళ్ల నుంచి గరిష్ఠంగా ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉంది' అని తెలిపారు. కౌంటింగ్ రోజు 20 కంపెనీల కేంద్ర బలగాలను రాష్ట్రానికి రప్పిస్తున్నామని వెల్లడించారు.

సీఎస్‌ను తప్పిస్తేనే సజావుగా కౌంటింగ్

» జగన్ రాజకీయ జీవితానికి ఇక శుభం కార్డు: సోమిరెడ్డి

» సీఎం విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ రాష్ట్రంలో హింస: రఘురామ

విశాఖపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని విధుల నుంచి తప్పిస్తేనే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగుతుందని, ఆ దిశగా ఈసీ చర్యలు చేపట్టాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేత రఘురామకృష్ణరాజు డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో బుధవారం గంటా శ్రీనివాసరావు నివాసంలో మీడియాతో మాట్లాడారు. సోమిరెడ్డి మాట్లాడుతూ, 'జగన్ రాజకీయ జీవితానికి ఈ ఎన్నికలతో శుభం కార్డు పడుతుంది. జగన్ హయాంలో చట్టసభలకు గౌరవం లేదని, వ్యవసాయం, నీటి పారుదల శాఖలు దారి తప్పాయి' అని అన్నారు. రఘురామ మాట్లాడుతూ, 'జగన్ విదేశాలకు వెళ్లిన ప్రతిసారి రాష్ట్రంలో ఏదో ఒక హింస జరుగుతుంది. ఈసారి ఏమి ప్లాన్ చేశారో తెలియాల్సి ఉంది. విశాఖలో ప్రమాణ స్వీకారం అంటూ వైసీపీ నాయకులు రూమ్‌లు బుక్ చేసుకుంటున్నారు. వారికి ఇంకా భ్రమలు పోలేదు. ఉద్యోగులతో విభేదాలు పెంచుకున్న ఏ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాలేదని చరిత్ర చెబుతోంది' అని అన్నారు. సమావేశంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థుల ఒత్తిళ్లు తట్టుకోలేం!

» సెలవుల్లో వెళ్లిపోతాం

» ఎన్నికల సంఘానికి రిటర్నింగ్ అధికారుల మొర

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): పల్నాడు, అనంతపురం, తిరుపతి సహా సమస్యాత్మక జిల్లాల్లోని పలు నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు.. రిటర్నింగ్ అధికారు(ఆర్వో)లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఓవైపు పాలకపక్షం హింసాకాండ, ఇంకోవైపు ఆపార్టీ అభ్యర్థుల ఒత్తిళ్లను వారు తట్టుకోలేకపోతున్నారు. తమ కు సెలవులివ్వాలని ఎన్నికల కమిషన్(ఈసీ)ని అభ్యర్థిస్తున్నారు. ముఖ్యంగా సీమ ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ రోజు తమకు సహకరించలేదని కొందరు ఆర్వోలపై వైసీపీ నేతలు కత్తిగట్టినట్లు తెలుస్తోంది. దీంతో తమపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారని.. కౌంటింగ్ నాడైనా తాము చెప్పినట్లు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దాడులు జరిగిన చోట్ల తమపై పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని కూడా కొందరు నేతలు బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కౌంటింగ్ రోజు వరకూ ఎన్నికల విధుల్లో తాము కొనసాగలేమని.. వారిని తట్టుకోవాలంటే ఐఏఎస్ అధికారుల వల్లే అవుతుందని.. తమను ఆర్వో బాధ్యతల నుంచి తప్పించి వారికి బాధ్యతలు ఇవ్వాలని ఆర్వోలు వేడుకుంటున్నట్లు సమాచారం.

యుద్ధం ముగిసేదాకా జెలెన్‌స్కీనే!

» ఉక్రెయిన్ అధ్యక్షుడిగా మూడ్రోజుల క్రితమే పదవీకాలం పూర్తి.. అయినా కొనసాగింపు



రష్యాతో యుద్ధం ముగిసేదాకా ఉక్రెయిన్ అధ్యక్షుడిగా వోలోదిమిర్ జెలెన్‌స్కీ కొనసాగే సూచనలు కొనసాగుతున్నాయి. టీవీ సీరియల్ కమేడియన్‌గా ఉక్రెయిన్ ప్రజలకు సుపరిచితుడైన జెలెన్‌స్కీ.. 2019 మే 20న అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఆయన ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 20తోనే ముగిసింది. ఉక్రెయిన్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడి పదవీకాలం ముగియడానికి 45 రోజుల ముందే ఎన్నికలు జరగాలి. అంటే.. ఈ ఏడాది మార్చి 31న ఎన్నికలు జరగాల్సింది. కానీ, 2022 ఫిబ్రవరి 24 ప్రారంభమైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ భీకరంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు జరిగే సూచనలు కనిపించడం లేదు. దీంతో.. తానే అధ్యక్షుడిగా కొనసాగుతానని జెలెన్‌స్కీ సోమవారం రాయిటర్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "సైనికులు యుద్ధంలో ఉన్నారు. విదేశాల్లో 70 లక్షల మంది దాకా ఉక్రెనియన్లు ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. అందుకే ఎన్నికలను వాయిదా వేస్తున్నాం" అని వివరించారు. ఉక్రెయిన్ రాజ్యాంగం ప్రకారం సైనిక చట్టం(మార్షల్ లా) అమలులో ఉన్నప్పుడు ఎన్నికలు జరగడానికి వీలు లేదు. రష్యాతో యుద్ధం ముగిసేదాకా ఉక్రెయిన్‌లో మార్షల్ లా కొనసాగే అవకాశాలున్నాయి. అంతేకాకుండా.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 540 కోట్ల ఉక్రెయిన్ కరెన్సీ(రూ.1,129 కోట్లు) అవసరం అవుతుందని సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ అంచనా వేసింది. "దేశంలో అన్ని ప్రాంతాల్లో పరిస్థితులు ప్రశాంతంగా లేవు. కొన్ని ప్రాంతాల్లోనే ఎన్నికలు నిర్వహించడం సబబు కాదు. పైగా, బాంబింగ్, షెల్లింగ్ మధ్య పోలింగ్ కేంద్రాల ఏర్పాటు సాధ్యం కాదు" అని తేల్చిచెప్పింది. అయితే.. ఇలాంటి క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పుడు.. ఎన్నికల నిర్వహణ సాధ్యం కాకపోతే.. అధ్యక్ష బాధ్యతలు ఎవరు చేపట్టాలనే దానిపై రాజ్యాంగం స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. దీంతో.. తానే అధ్యక్షుడిగా కొనసాగడం సరైందేనని జెలెన్‌స్కీ చెబుతున్నారు. పైగా విపక్ష పార్టీల నేతలు కూడా ఇందుకు అంగీకారం తెలుపుతూ సంతకాలు చేసినట్లు వివరించారు. ఈ నెల 14న కీవ్ నగరంలో పర్యటించిన అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ కూడా యుద్ధం సద్దుమణిగేదాకా ఎన్నికలను నిర్వహించకపోవడం మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన ఓ సర్వేలో.. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే, 80శాతానికి పైగా పౌరులు జెలెన్‌స్కీకే జైకొట్టినట్లు తేలింది.

నాటో ఆదుకోవాలి.. యుద్ధాన్ని ఆపాలి: జెలెన్‌స్కీ

రష్యా యుద్ధాన్ని ఆపేందుకు నాటో తమను ఆదుకోవాలని జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు ఆయుధాలను సరఫరా చేయాలని ఇటలీ మీడియా సంస్థ రాయ్-1కు ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా కోరారు. తమ దేశంపై జరుగుతున్న క్షిపణిదాడులను అడ్డుకునేందుకు నాటో దేశాలు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల వాషింగ్టన్‌లో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశాల్లో త్వరలో ఉక్రెయిన్‌కు సభ్యత్వాన్ని ఖరారు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నాటో చొరవతోనే ఈ యుద్ధానికి ముగింపు ఉంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



ఒకే గొడుగు కింద వ్యవసాయ పథకాలు: సీఎస్

అమరావతి, మే22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వివిధ పథకాలను ఒకే గొడుగు కింద అమలు చేయాలని సీఎస్ జవహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. 2024-25 వార్షిక ప్రణాళికలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన కింద రూ.1,193కోట్లతో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై బుధవారం అధికారులతో ఆయన సమీక్షించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఉరవకొండ, మే 22: అనంతపురం జిల్లాలో ఓ కౌలు రైతు అప్పుల బాధతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉరవకొండ మండలం చిన్నముష్టూరుకు చెందిన నారాయణస్వామి(60)కి మూడు ఎకరాల పొలం ఉంది. మరో 5 ఎకరాలను కౌలుకు తీసుకుని వేరుశనగ, కంది సాగు చేసేవాడు. నాలుగేళ్ల నుంచి పంటలు సరిగా పండక 15లక్షలు అప్పు తీర్చే మార్గంలేక.. బుధవారం చెట్టుకు ఉరివేసుకున్నాడు.

'బర్మా క్యాంపు' దాడి కేసులో ట్విస్ట్

- కేసు రాజీకి ఓ వర్గం తీవ్ర ప్రయత్నం
- గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం వేదికగా చర్చలు
- పాత కేసులు తిరగదోడతామని పోలీసుల బెదిరింపు?
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశాఖ 'బర్మా క్యాంపు' కేసు రాజీకి ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. వైసీపీకి ఓటు వేయలేదని కుటుంబంపై జరిగిన దాడి రాష్ట్రంలో కలకలం రేపింది. తాజాగా ఈ కేసు రాజీ చేసేందుకు గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం వేదికగా ప్రయత్నాలు జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 15వ తేదీ రాత్రి విశాఖ నగరంలోని బర్మా కాలనీలో సుంకరి ధనలక్ష్మి కుటుంబంపై పొరుగునే ఉన్న మరో కుటుంబం, వారి స్నేహితులు కలిసి దాడి చేసి తీవ్రంగా కొట్టిన సంగతి తెలిసిందే. ఆ తరువాత కంచరపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేశామని వీధిలో చెప్పడం వల్లనే ఈ దాడి జరిగిందని, దాడి చేసిన వారిలో అత్యధికులు వైసీపీతో సంబంధాలు కలిగిన వారేనని బాధితులు ఆరోపించారు. ఈ కేసును ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేయడంతో పోలీసులు ఆయనపై కూడా కేసు పెట్టారు. బాధితుల ఆవేదనను ప్రచురించినందుకు, ప్రసారం చేసినందుకు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి', 'ఈటీవీ'పై కూడా కేసులు పెట్టారు. తమను పది మంది కలిసి తీవ్రంగా కొట్టగా కేవలం ఒక్కరినే అరెస్టు చేశారని, మిగిలిన వారిని అరెస్టు చేయలేదని, వారు బయట స్వేచ్ఛగా తిరుగుతున్నందున తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలంటూ బాధితులు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని ఆధారంగా చేసుకొని రాజీ చేయాలని ఓ వర్గం ప్రయత్నం చేస్తోంది. బర్మా క్యాంపు సచివాలయం నుంచి బాధిత కుటుంబానికి మంగళవారం సాయంత్రం ఫోన్ వచ్చింది. జాయింట్ కలెక్టర్ విచారణకు వస్తున్నారని, గోపాపట్నం తహసీల్దార్ కార్యాలయానికి రావాలనేది దాని సందేశం. బుధవారం ఉదయం మరోసారి, మధ్యాహ్నం మరోసారి ఫోన్ చేశారు. దాంతో బాధిత కుటుంబం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లింది. దాడి చేసిన పది మందీ అక్కడ వీరికి కనిపించారు. వారి తరఫున ఓ వ్యక్తి ఆటో వద్దకు వచ్చి, తగిలిన దెబ్బల చికిత్సకు ఖర్చు అంతా వారు భరిస్తారని, రాజీ పడాలని, బైండోవర్ కేసులు రాసుకోవాలని కోరారు. అంటే ఇరువర్గాలు మళ్లీ గొడవ పడబోమని రాసివ్వాలని సూచించారు. దానికి బాధిత వర్గం నిరాకరించింది. వారిపై కేసులు కొనసాగించాలని, తాము ఉపసంహరించుకోబోమని చెప్పి వెనక్కి వచ్చేశారు. కాగా.. ఈ రాజీ ప్రయత్నం ఎవరు చేస్తున్నారో తమకు తెలియదని, తలలు బద్దలు కొట్టి, చికిత్స చేయిస్తామంటున్నారని, ఇదేనా పోలీసులు చేసే న్యాయం అంటూ ధనలక్ష్మి కుటుంబం వాపోతోంది. తనకు, కుమార్తె నూకరత్నానికి, కుమారుడు మణికంఠకు ఆరోగ్యం బాగా లేదని, ఎన్ఆర్ఐ ఆస్పత్రికి బుధవారం వెళ్లి చికిత్స చేయించుకున్నామని తెలిపారు. దాడి చేసి తీవ్రంగా కొట్టిన వారిపై కేసులు పెట్టకుండా, పోలీసులు తిరిగి తమనే బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. పదేళ్ల క్రితం తన కుమార్తె కాలేజీ చదువుతున్నప్పుడు రౌడీలు ఆమెను వేధిస్తే అప్పుడు పోలీసు కేసు పెట్టామని, ఇప్పుడు చెప్పినట్టు వినకపోతే పాత కేసులన్నీ తిరగతోడుతామని బెదిరిస్తున్నారని ధనలక్ష్మి ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ దాడి చేసిన వారిని రక్షిస్తున్నారని, బాధితులైన తమను వేధిస్తున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని, దాడి చేసిన వారందరినీ అరెస్టు చేయాలని కోరారు.

ముగిసిన కృష్ణబాబు అంత్యక్రియలు

- నివాళులు అర్పించిన పలువురు ప్రముఖులు


కృష్ణబాబు భౌతికకాయం వద్ద తుమ్మల నాగేశ్వరరావు, పక్కన అయ్యన్నపాత్రుడు, నన్నపనేని రాజకుమారి తదితరులు

కొవ్వూరు, మే 22: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన కొవ్వూరు మండలం దొమ్మేరులో జరిగాయి. హైదరాబాద్ నుంచి మంగళవారం రాత్రి దొమ్మేరుకు కృష్ణబాబు భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉంచారు. అనంతరం వారి వ్యవసాయ క్షేత్రంలో కృష్ణబాబు కుమారుడు రవిబాబు దహన సంస్కారాలు నిర్వహించారు. కృష్ణబాబు మరణవార్త తెలిసి పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు వచ్చి ఆయన సోదరులు నరేంద్రనాథ్‌చౌదరి, అచ్యుతరామయ్య (అచ్చిబాబు)తోపాటు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తంచేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన వారిలో తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, వడ్డే శోభనాదీశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, గంటా మురళి, జొన్నకూటి బాబాజీరావు, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాసనాయుడు, జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నన్నపనేని రాజకుమారి తదితరులు ఉన్నారు.

ఐస్‌ఫ్యాక్టరీ సబ్సిడీ కోసం రూ.2లక్షలు డిమాండ్

- ఏసీబీ వలలో కాకినాడ జిల్లా పరిశ్రమల శాఖ జీఎం మురళి


రూ.2 లక్షలతో పట్టుబడిన జీఎం మురళి

సర్పవరం జంక్షన్, మే 22: ఏసీబీ వలకు ఓ పెద్ద అవినీతి చేప చిక్కింది. కాకినాడకు చెందిన పెమ్మాడి శ్రీనివాసరావు శ్రీముఖి ఐస్ ఫ్యాక్టరీని జూన్ 2021లో స్థాపించారు. ఏపీఐఐసీ కాకినాడ ఆఫీసులో ఇంటెన్సివ్ సబ్సిడీ విడుదల తేదీ జూన్ 2021కి బదులు మే 2021గా నమోదు చేశారు. సబ్సిడీ నగదు మంజూరుకు ఇబ్బంది లేకుండా తేదీ మార్పు కోసం జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ టి.మురళి రూ.2.50 లక్షల లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వకపోతే ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.40-50 లక్షల రాయితీ మంజూరు కాకుండా చేయడమే కాకుండా ఫ్యాక్టరీ సీజ్‌కు చర్యలు తీసుకుంటానని శ్రీనివాసరావును బెదిరించాడు. ఇలా ఏడాది నుంచి వేధిస్తుండటంతో బాధితుడు ఈ నెల 17న రాజమహేంద్రవరంలో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రూ2 లక్షలు శ్రీనివాసరావు బుధవారం రాత్రి ఇస్తుండగా జీఎం మురళిని ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఏపీఆర్‌సెట్ ఫలితాలు విడుదల

- జూన్ 10 తర్వాత అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టిన ఏపీఆర్‌సెట్ (ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) 2023-24 ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి, ఏపీ ఆర్‌సెట్ కన్వీనర్ దేవప్రసాదరాజు తిరుపతిలో ఈ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 64 సబ్జెక్టులకు 10,050 మంది దరఖాస్తు చేసుకున్నారని, 8,651 మంది పరీక్షలు రాశారని చెప్పారు. ఇందులో 4,352 మంది ఉత్తీర్ణత సాధించగా, 50.3 శాతం ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. ఫలితాల కోసం.. https://cets.apsche.ap.go-v.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. జూన్ 10వ తేదీ తర్వాత పీహెచ్‌డీలో ప్రవేశానికి అడ్మిషన్లు చేపడతామని తెలిపారు.





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఈసీ వింత వైఖరి!

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఐదుదశల పోలింగ్ ముగిసిపోయి, మిగిలిన రెండు దశలూ ఇంకో పదిరోజుల్లో పూర్తికాబోతున్న తరుణంలో, ఎన్నికల సంఘం బుధవారం ఈ దేశంలోని రెండు ప్రధాన రాజకీయపక్షాలకు గట్టిగా హితోపదేశం చేసింది. బీజేపీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షులకు రాసిన సుదీర్ఘమైన లేఖలో అది, ఆయా పార్టీల స్టార్‌క్యాంపెయినర్లు తమ వ్యాఖ్యలు, ప్రసంగాల్లో నియంత్రణ పాటించేట్టు చూడాలని కోరింది. హద్దు దాటవద్దని మీ వాళ్ళకు చెప్పండి అని పార్టీ అధ్యక్షులను ఎన్నికల సంఘం కోరింది. కులం, మతం, జాతి, భాషల ఆధారంగా సమాజాన్ని రెచ్చగొట్టే, చీల్చే రీతిలో ప్రసంగాలు చేయడం సరికాదంటూ ఎన్నికల నియమావళిని గుర్తుచేసింది. ప్రచారకర్తలు ఆ నియామవళికి కట్టుబడి ఉండేట్టుగా చూడాల్సిన బాధ్యత పార్టీలదేనని ఈసీ అంటోంది. మీ స్టార్ క్యాంపెయినర్లను అదుపులో ఉంచండి, వారిని గట్టిగా హెచ్చరించండి అంటూ నరేంద్రమోదీని, రాహుల్‌గాంధీని నియంత్రించాల్సిన బాధ్యతను జేపీ నడ్డా, ఖర్గేలమీద పెట్టింది. తద్వారా విద్వేషపూరితమైన ప్రసంగాలు చేస్తున్న వ్యక్తుల పేర్లు ప్రస్తావించకుండా, వారిని నేరుగా హెచ్చరించకుండా ఈసీ తెలివిగా పక్కకు తప్పుకుంది. ఉభయపక్షాలనూ తప్పుబట్టడం ద్వారా తాను తటస్థంగా కనిపించేందుకు తాపత్రయపడింది కానీ, ఏ మాత్రం ప్రయోజనం లేని, క్షేత్రస్థాయిలో ప్రభావం చూపని చర్య ఇది.

నరేంద్రమోదీకి నోటీసులు జారీ చేసేందుకు ధైర్యం చాలకనే, పార్టీ అధ్యక్షులను మధ్యలోకి తెచ్చే పనికి ఈసీ పూనుకుందని గతనెలలో ఎన్నికల సంఘం వివరణ కోరినప్పుడు కొందరు విమర్శించారు. తీవ్రాతితీవ్రమైన ఆరోపణలతో, అసత్యాలు అర్థసత్యాలతో ప్రచారం సాగుతున్న తరుణంలో నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు బీజేపీకి ఐదురోజుల గడువు ఇవ్వడం కూడా ఆశ్చర్యం కలిగించింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా పార్టీ అధ్యక్షులవెంటే పడుతూ స్టార్‌క్యాంపెయినర్లను మాత్రం ఈసీ స్వేచ్ఛగా వదిలేసింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిని నేరుగా ప్రశ్నించడం మానేస్తే, సదరు స్టార్‌క్యాంపెయినర్లకు మరింత రెచ్చిపోయే అవకాశం సహజంగానే చిక్కుతుంది. కాంగ్రెస్ మానిఫెస్టోలో ఉన్నాయంటూ, ముస్లింలకు దోచిపెడతారంటూ మోదీ చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి కారణమైనప్పటికీ, ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసిన తరువాత కూడా బీజేపీ అధ్యక్షుడు నడ్డాసహా చాలామంది స్టార్‌క్యాంపెయినర్లు వాటిని కొంతకాలం ప్రస్తావిస్తూనే వచ్చారు. ఏప్రిల్ 25నుంచి ఇప్పటివరకూ బీజేపీమీద పన్నెండు, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నాలుగు ఫిర్యాదులు అందాయని ఈసీ అంటోంది. అప్పటినుంచి ఇప్పటివరకూ మరిన్ని విద్వేషపూరితమైన వ్యాఖ్యలు సమాజం విన్నది.

గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మోదీకి క్లీన్‌చిట్ ఇచ్చి, ఒక ఎన్నికల కమిషనర్ రాజీనామాతో వివాదాల్లో ఇరుక్కున్న ఈసీ ఈసారి ఈ కొత్తమార్గాన్ని కనుక్కొంది. మోదీ, అమిత్‌షా ఇత్యాది పెద్దలు తమకు తోచినవి అంటూ ఉంటారు, కాంగ్రెస్ మానిఫెస్టోలోనూ, మన్మోహన్ మాటల్లోనూ లేనివన్నీ ఉన్నట్టుగా ప్రచారం చేస్తుంటారు, వారిని వదిలేసి ఈసీ నడ్డాను మాత్రం నిలదీస్తూ ఉంటుంది. మోదీకి నోటీసులు ఇచ్చే బాధ తప్పించుకోవడానికి ఎన్నికల సంఘం అనుసరించిన ఈ అడ్డదారి రాహుల్‌గాంధీకి కూడా ఉపకరిస్తోంది. కాంగ్రెస్‌పార్టీ మీ మంగళసూత్రాలు లాగేసుకుంటుంది, దేశసంపదను ముస్లింలకు పంచేస్తుంది అంటూ రాజస్థాన్‌లోని బన్‌స్వారాలో మోదీ చేసిన వ్యాఖ్యలమీద తాము ఫిర్యాదు చేసి ఎంతోకాలమైనప్పటికీ ఈసీ చర్యలు తీసుకోవడంలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నందుకు ఎన్నికల సంఘం ఆగ్రహించి ఆయనకు కూడా నోటీసులు ఇచ్చిన విషయం మరిచిపోకూడదు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినవారిపై సత్వర చర్యలు తీసుకోవడం, నియమనిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరపడం కంటే, పాలకపక్షపెద్దల ఆగ్రహానికి గురికాకుండా తెలివిగా వ్యవహరించడం ఈసీకి ముఖ్యమైపోయింది. అన్ని పార్టీలనూ ఒకేరీతిలో చూస్తున్నట్టుగా, సమానంగా శిక్షిస్తున్నట్టుగా ఉపరితలంలో కనిపిస్తున్నప్పటికీ, మొగ్గు అధికారపక్షంవైపు ఉన్న విషయం కనిపిస్తూనే ఉంది. మరోపక్కన, పోలింగ్ డేటాలో వైరుద్ధ్యాలున్నాయని అన్నందుకు, పోలింగ్‌శాతం వివరాలపై అనుమానాలు వ్యక్తంచేసినందుకు మాత్రం కాంగ్రెస్ అధ్యక్షుడిపై ఎన్నికల సంఘం ఈ మధ్యనే తాడెత్తున మండిపడ్డది. ఇటువంటి ఎన్నికల సంఘాన్ని, ఈ తరహా ఎన్నికలను దేశం గతంలో చూసివుండదు.

గాలిమేడలు, ఊహాగానాలు, పీడకలలు

జూన్ ఒకటిన ఓటు వేసేవారు అదృష్టవంతులు. వాళ్లకు ఆ రోజు సాయంత్రమే దేశవ్యాప్త ఎగ్జిట్ పోల్ ఫలితాలు తెలిసిపోతాయి. ఆ తరువాత ఇంకో మూడు రోజులలో నిజమైన ఫలితాలూ తెలిసిపోతాయి. కానీ, ఏప్రిల్ 19 నాడు పోలింగ్ జరిగినవారికి నలభై ఆరు రోజుల నరకం. తమ మనసు విప్పి, ఈవీఎం నొక్కిన తెలుగు రాష్ట్రాల ఓటర్లకు మే 13 తరువాత ఇరవై మూడు రోజుల ఉత్కంఠ. అభ్యర్థులకు, వారి పార్టీలకు ఒకరకం గుబులు. జనం ఎంపిక ఎట్లా ఉన్నదో అని. ప్రజలకు కూడా అదే గుబులు. తమ ఎంపిక ఏ సామూహిక రూపం తీసుకున్నదో అని.

కౌంటింగ్ దాకా కౌంట్ డౌన్ కాలం జారుడుబండలాగా ఉండదు. నిటారు కొండ మీదికి హైకింగ్ లాగా ఉంటుంది. బరిలోని వస్తాదులనుంచి, కేవలం ఓటేసిన సామాన్యుల దాకా దిగులు, ఆత్రుత, వణుకు, గుండెదడ, చిరాకు, భయం వంటి అనేక మానసిక వికారాలు కమ్ముకుంటాయి. నమ్మకం, ఆశ బలంగా ఉన్నవారు కలల్లో తేలిపోతుంటారు. ప్రచారఘట్టంలోనే పస తేలిపోయినవారు పీడకలల్లో ఓలలాడుతుంటారు. మరి కొందరు ఊహలకు, గణితశస్త్రాన్ని, గణాంకాలను తొడిగి, రకరకాల సంభావ్యతలను ప్రతిపాదిస్తుంటారు. క్రికెట్ క్రీడలో ప్రతి బంతి ప్రయాణానికీ, ప్రతి ఆటగాడి కదలికలకీ భాష్యాలు చెప్పే వ్యాఖ్యాతలలాగా, ఎన్నికల ప్రక్రియలోని ప్రతి కోణాన్నీ రాజకీయ పరిశీలకులు, సెఫాలజిస్టులు, వ్యూహకర్తలు కుంభాకార కటకంలో నుంచి చూపిస్తున్నారు. ఎదురుచూపుల భారాన్ని మోస్తున్న రాజకీయాసక్తులకు శ్రమ తెలియకుండా నిత్యం కొత్త కథలు చెబుతున్నారు. మరో వైపు మరి కొందరు ముసళ్ల పండగ జూన్ 4 తరువాత ఉందని భయపెడుతున్నారు.

దేశం మీదకు రెండు సంఖ్యలను వదిలి, ప్రత్యర్థులను వాటి మాయలోకి పడేసింది బీజేపీ. అవి 400, 370. గెలుపు ముందే ఖరారు అనీ, సంఖ్య మాత్రమే తేలవలసి ఉన్నదన్న అభిప్రాయాన్ని అవి కలిగించాయి. ఆ తరువాత నెమ్మదిగా, 220, 250, 260, 268 వంటి సంఖ్యలు కూడా ప్రవేశించి, వాతావరణాన్ని వేడెక్కించాయి. యథాతథవాదులు కొందరు 303 సంఖ్య అటూఇటూగా కొనసాగుతుందని, ఇదే ప్రభుత్వం, ఇదే మోదీ మూడోసారి పాలిస్తారని బల్లగుద్ది మరీ చెబుతున్నారు. ఇప్పుడున్నంత బలమే, కొంత చేర్పుతో, కొనసాగితే, అందులో రసవత్తరమైన ఊహలకు ఆస్కారం ఎక్కడుంది? అందుకని, బీజేపీ మెజారిటీకి ఆమడ దూరంలో ఉంటుందని, మిత్రుల సాయంతో గట్టెక్కుతుందని కొందరు ధైర్యంగా వేస్తున్న లెక్కలు, ఎన్నికల అనంతరం కొత్త సన్నివేశాల జోస్యానికి వీలు కల్పిస్తున్నాయి. మెజారిటీ తగ్గితే మోదీయే నేతగా ఉంటారా? ప్రభ తగ్గిన నాయకత్వంలో కొనసాగడానికి ఆయన ఇష్టపడతారా? బీజేపీలో అనంతర నేతలు పోటీపడరా? మద్దతు ఇచ్చే మిత్రపక్షాలు తమకు ఆమోదమయ్యే నేత కోసం పట్టుబట్టే అవకాశం ఉంటుందా? అడగాలే కానీ అనేక ప్రశ్నలు!

నరేంద్రమోదీ ఓడిపోతారని గానీ, కనీసం బలహీనపడతారని గానీ నమ్మడానికి, ఆయన విమర్శకులలో కూడా అత్యధికులు సంకోచిస్తారు. ఆయన ఇంకా ఇంకా బలపడతారని, తాను అనుకున్న లక్ష్యాలను నిర్దాక్షిణ్యంగా సాధిస్తారని కూడా వారు విశ్వసిస్తారు. ఎంతో కొంత వ్యతిరేకత వ్యక్తమవుతున్నదన్న సూచనలు కనిపిస్తున్నా, ప్రతికూలతల మీదనే వారి దృష్టి ఉంటుంది. బాధితులు కాగలిగిన దుర్బలులకు ఆ నిస్పృహ అధికం. భారతదేశంలో నెలకొన్న సామాజిక, రాజకీయ వాతావరణం మీద తీవ్రంగా కలవరపడే ఒక సామాజిక మాధ్యమాల మిత్రుడు, ఈ మధ్య మోదీ చేసిన ఒక హెచ్చరికకు బాగా బెదిరిపోయారు. తాను తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత, అవినీతిపరులను జీవితాంతం జైళ్లలో మగ్గేట్టు చేస్తానని మోదీ మొన్న ఆదివారం నాడు ఒక బెంగాల్ సభలో అన్నారు. దాన్ని హెచ్చరికగా కాదు. గ్యారంటీ కింద చెప్పారు. మోదీ పాలనలో రాజకీయప్రత్యర్థుల మీదనే అన్నిరకాల అభియోగాలూ మోపుతారన్న అభిప్రాయం నేపథ్యంలో, ఆ గ్యారంటీ ప్రజాజీవితంలో స్వతంత్ర భావాలతో ఉండేవారూ కలవరపడదగినదే. నరేంద్రమోదీ ప్రాభవం తగ్గుముఖంలో ఉన్నది కానీ, ఈ సారికి ఆయనే నెగ్గుతాడని నిలకడగా వాదిస్తున్న ప్రశాంత్ కిశోర్ కూడా మూడో దఫా పాలన గురించి భయం కలిగించే అంచనాలే ఇచ్చారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక, ఇంతకాలం అనుసరిస్తున్న విధానాలనే మోదీ మరింత తీవ్రంగా కొనసాగిస్తారని, వనరులను అధికారాలను కేంద్రీకృతం చేస్తారని, ఆర్థిక అంతరాలు పెరుగుతాయని, రాష్ట్రాల అధికారాలు మరింతగా క్షీణిస్తాయని, ప్రజల ప్రతిఘటన పెరుగుతుందని భవిష్యత్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఆర్థికవేత్త, సామాజిక రాజకీయ వ్యాఖ్యాత పరకాల ప్రభాకర్, ఈ మధ్య అనేక ఇంటర్వ్యూలలో మరోసారి మోదీ ప్రభుత్వం వస్తే ఎంతటి విధ్వంసానికి కారణమవుతుందో హెచ్చరిస్తున్నారు. మణిపూర్ లాంటి పరిస్థితి అన్ని రాష్ట్రాలలో ఏర్పడుతుందని, అక్కడక్కడ జరుగుతున్న మూకదాడులు అధికారికంగానే జరుగుతాయని ఆయన చెబుతున్నారు.

అవయ్ శుక్లా అని ఒక పూర్వ ఐఏఎస్ అధికారి బ్లాగుల ద్వారా, ఇతర మాధ్యమాల ద్వారా రాజకీయాలపై వ్యాఖ్యానిస్తుంటారు. ఆయన తాజా వ్యాసం చదివితే, కొత్త భయానుమానాలు ముంచెత్తుతాయి. కొందరు చెబుతున్నట్టు, లేదా, ఆశపడుతున్నట్టు, తాను అధికారంలోకి వచ్చే విధంగా ఫలితాలు లేకపోతే, నరేంద్రమోదీ అధికారాన్ని విజేతలకు అప్పగించి నిష్క్రమిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ మొదలుకొని, నిఘావ్యవస్థలు, భద్రతాయంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ప్రభుత్వానికి పరిచారకులుగా మారిన పరిస్థితులలో, అలవాటుపడిన అధికారాన్ని నాయకుడు వదులుకుంటారా? ఎమర్జెన్సీ అనంతరం ఎన్నికలలో ఓడిపోయిన ఇందిరాగాంధీ 1977లో చేసినట్టు, నరేంద్రమోదీ అధికారాన్ని వదులుకుంటారా? అని శుక్లా సందేహం. సుప్రీంకోర్టు, రాష్ట్రపతి.. ఈ రెండు వ్యవస్థలు దృఢంగా ఉంటే ప్రజల తీర్పు అమలుకు అవరోధాలు ఉండవని, కానీ, ఆ దృఢత్వం మీద తనకు విశ్వాసం కలగడం లేదని ఆయన అన్నారు. ఎన్నికల ఫలితాల తరువాత ప్రజల బాధ్యత ముగిసిపోవడం లేదు, ఇదే పాలన కొనసాగితే, ప్రతిఘటించవలసిన అంశాలు పెరగడం ఒక పార్శ్వం. ఒకవేళ, మార్పును కోరే తీర్పు వస్తే, అది అమలు జరిగేట్టు చూడవలసి రావడం మరో పార్శ్వం.

మోదీ ప్రభుత్వానికి ఎదురుగాలి వీస్తున్నదని తీవ్ర ఆశావాదంతో చెబుతున్నవారిని పక్కనపెట్టినా, ఈ సారి ఖాయంగా మోదీదే ప్రభుత్వం అని చెబుతున్నవారు కూడా పరిస్థితిలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తున్నారు. ఈ సారి కేంద్రంలో అధికారపార్టీ బాహుబలి పార్టీగా ఉండబోదు. అక్కడా ఇక్కడా బలాన్ని సమీకరించుకుని ముందుకు వెళ్లవలసిన స్థితిలో ఉంటుంది.. దాని వల్ల పరిపాలనలో తీవ్రత తగ్గుతుందని చెప్పలేం కానీ, ప్రజలకు ఉద్యమించే శక్తి పెరుగుతుంది. మొత్తానికి 2029 దాకా గడిచే కాలం, సంక్లిష్టంగా, సంరంభంగా, ఉద్రిక్తంగా ఉండబోతున్నది.

***

ఒక పార్టీకి తిరుగులేని మెజారిటీ వస్తే, ఒకటే సంభావ్యత. కానీ, కూటమిలోని మిత్రుల సహకారంతో మాత్రమే అధికారం సాధ్యపడితే, అది వేరే సన్నివేశం. ఎన్డీఏ కూటమిలో మళ్లీ చేరిన తెలుగుదేశంపార్టీ, తనమిత్రపక్షాలతో సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఘనవిజయం సాధించబోతున్నదన్న టాక్ సర్వత్రా వ్యాపించింది. మరి బీజేపీకి మునుపటిలా సొంతబలం లేక, కూటమి మిత్రుల బలంపై ఆధారపడేపరిస్థితి వస్తే? రాష్ట్రంలో అధికారంలోకి రావడమే కాకుండా, జాతీయస్థాయిలో కూడా చంద్రబాబుకు ప్రాధాన్యం పెరిగితే? ఈ చర్చ కూడా తెలుగుదేశం అభిమానులలోనే కాక, ఇతరులలో కూడా జరుగుతోంది. 2014 లాంటి ఎన్డీయే కాక, 1999 నాటి ఎన్డీయే ప్రభుత్వం వస్తే మెరుగని, మిత్రపక్షాలకు అందులో మెరుగైన భాగస్వామ్యం ఉంటుందని, రాష్ట్రానికి కావలసిన నిధులను, హోదాలను సంపాదించుకోవడానికి అవకాశాలు పెరుగుతాయని ఆంధ్రప్రదేశ్ శ్రేయోభిలాషులు మాట్లాడుకుంటున్నారు. ఒకవేళ, మోదీ కేంద్రంలో అధికారంలోకి రాకుండా, కూటమి ఆంధ్రప్రదేశ్‌లో అధికారం సాధిస్తే అప్పుడు పరిస్థితి ఎట్లా ఉంటుందన్న చర్చ కూడా వినిపిస్తోంది.

ఇటువంటి ఊహాగానాల మధ్య భారత రాష్ట్రసమితి పేరు ఎక్కడా వినిపించకపోవడం విచారకరమైన పరిణామం. నిజానికి ఇది టీఆరఎస్ లేదా బీఆరఎస్ స్వయంకృతం. ఏ ప్రమాదాన్ని, ఏ ప్రయోజనాన్ని చూసి 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లారో గానీ, దానివల్ల సమకూరిన అదనపు లాభమేమీ లేదు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు తెలంగాణలో వేరయ్యాయి. 2024లోనే లోక్‌సభ ఎన్నికలతో పాటు, అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగి ఉంటే, రాష్ట్రప్రభుత్వం ఎట్లాగూ చేజారినా, అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న నిష్పత్తిలో ఎంపీ స్థానాలు గెలిచే అవకాశం ఉండేది. అసెంబ్లీ ఎన్నికలు ముందే జరగడం వల్ల, అప్పుడు బీఆరఎస్‌కు పడిన ఓటు ఇప్పుడు చెదిరిపోయి, పార్టీ మూడోస్థానానికి దిగే పరిస్థితి ఏర్పడింది. ఆరేడు ఎంపీ స్థానాలు గెలుచుకుని ఉంటే, కేసీఆర్ ప్రధాని కాలేకపోయినా, ఢిల్లీలో ఒక చిన్నచక్రమైనా తిప్పే అవకాశం ఉండేది.





■ కె. శ్రీనివాస్

సందర్భం

మోదీ ప్రభుత్వానికి ఎదురుగాలి వీస్తున్నదని తీవ్ర ఆశావాదంతో చెబుతున్నవారిని పక్కనపెట్టినా, ఈ సారి ఖాయంగా మోదీదే ప్రభుత్వం అని చెబుతున్నవారు కూడా పరిస్థితిలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తున్నారు. ఈ సారి కేంద్రంలో అధికారపార్టీ బాహుబలి పార్టీగా ఉండబోదు. అక్కడా ఇక్కడా బలాన్ని సమీకరించుకుని ముందుకు వెళ్లవలసిన స్థితిలో ఉంటుంది. దానివల్ల పరిపాలనలో తీవ్రత తగ్గుతుందని చెప్పలేం కానీ, ప్రజలకు ఉద్యమించే శక్తి పెరుగుతుంది. మొత్తానికి 2029 దాకా గడిచే కాలం, సంక్లిష్టంగా, సంరంభంగా, ఉద్రిక్తంగా ఉండబోతున్నది.

బీజేపీ మెజారిటీకి ఆమడ దూరంలో ఉంటుందని, మిత్రుల సాయంతో గట్టెక్కుతుందని కొందరు ధైర్యంగా వేస్తున్న లెక్కలు, ఎన్నికల అనంతరం కొత్త సన్నివేశాల జోస్యానికి వీలు కల్పిస్తున్నాయి. మెజారిటీ తగ్గితే మోదీయే నేతగా ఉంటారా? ప్రభ తగ్గిన నాయకత్వంలో కొనసాగడానికి ఆయన ఇష్టపడతారా? బీజేపీలో అనంతర నేతలు పోటీపడరా? మద్దతు ఇచ్చే మిత్రపక్షాలు తమకు ఆమోదమయ్యే నేత కోసం పట్టుబట్టే అవకాశం ఉంటుందా? అడగాలే కానీ అనేక ప్రశ్నలు!

కలలు సాకారమయ్యేది కష్టమే!

ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలు కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీకి అగ్నిపరీక్షగా ఉన్నాయి. దేశంలో నెలకొన్న రాజకీయ పరిణామాలకు తోడు ప్రజల మనోభావాలు, ఇతర అంశాలను పరిగణనలోనికి తీసుకుంటే మిగిలిన పార్టీల కంటే బీజేపీనే పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పుడు సొంతంగా 370 సీట్లు సాధిస్తామంటోంది. కాంగ్రెస్ పార్టీ బలహీనతల దృష్ట్యా బీజేపీ బలంగా ఉన్నట్లు భావిస్తున్నా, సీట్ల సంఖ్య పెంచుకోవడం ఆ పార్టీకి కత్తిమీద సామే.

పాలనలో వైఫల్యాలు బీజేపీకి ఎన్నికల్లో ప్రతిబంధకం కానున్నాయి. ప్రధానంగా పేదరికం రేటు 11.28 శాతానికి చేరింది. నిరుద్యోగం పెరిగింది. చదువుకున్న వారిలో 20 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. విద్య వైద్య రంగాల్లో దేశం వెనుకబాటులో ఉంది. నూతన విద్యావిధానం పేరిట సంఘ్‌పరివార్ భావజాలాన్ని పెంచుకునేందుకు బీజేపీ యత్నించింది. ఆరోగ్యరంగంలో భారత్ అథమస్థానంలోనే ఉంది. జీడీపీలో ఈ రంగానికి కేటాయింపులు 1.2 శాతం మాత్రమే. మాతాశిశు మరణాలు ఎక్కువే. సామాన్యులకు వైద్యం ఖరీదైనదిగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం లోపభూయిష్టంగా ఉంది. మౌలిక వసతుల అభివృద్ధిని గొప్పగా చెబుతున్నా దేశంలో ఇంకా పది శాతం గ్రామాలకు సరైన రోడ్లు లేవు. జాతీయ రహదారుల శాతం 24 గానే ఉంది. నగరాలు, పట్టణాల ప్రగతి అంతంత మాత్రమే. మెట్రో నగరాలు నీటికొరతతో తల్లడిల్లుతున్నాయి. దేశంలోని 19 శాతం గ్రామాలకు విద్యుత్ అందడం లేదు. సాగునీటి, తాగునీటి సమస్యలు పెద్దఎత్తున ఉన్నాయి. సహజ, వర్షాధారిత నీటి వనరులను సద్వినియోగం చేయడంలో కేంద్రం విఫలమయింది. రాష్ట్రాల మధ్య జల వివాదాలను పరిష్కరించడం లేదు. ట్రైబ్యునళ్లు, బోర్డుల పేరిట కాలయాపన చేస్తోంది. నదుల అనుసంధానం పేరిట కొత్త చిచ్చుకు తెరలేపుతోంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉత్తర, దక్షిణ భారత్‌ల మధ్య తేడాల తీవ్రత పెరిగింది.

ఎన్నికల్లో హామీలు ఇచ్చిన వాటిని నెరవేర్చకపోవడంలో బీజేపీ ముందంజలో ఉంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పించలేదు. దేశంలో 40 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి దానిని నెరవేర్చకపోగా నల్లచట్టాలు తెచ్చి రైతులను మరింత నష్టపరిచేందుకు యత్నించింది. పంటలకు మద్దతు ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పెద్దనోట్ల రద్దు పేరిట హంగామా చేసినా దాంతో ఒనగూరిందేమీ లేదు. పైగా దేశంలోని నల్లధనం తెల్లధనం అయింది. ప్రభుత్వరంగ సంస్థలను సద్వినియోగం చేయకపోగా వాటిని విక్రయించి, మూసివేసి ఆ వ్యవస్థను దెబ్బతీసింది. స్విస్‌బ్యాంకు నుంచి నల్లధనాన్ని తెప్పించి ప్రతీ పౌరుని ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి, చేతులెత్తేసింది.



భారత్ వెలిగిపోతుందనే అతి ప్రచారం 2004లో బీజేపీని దెబ్బకొట్టింది. ఇప్పుడు మితిమీరిన ప్రచారం ఆ పార్టీని నష్టపరిచే ఛాయలు కనిపిస్తున్నాయి. మాయాజాలంతో ఓటర్లను తమవైపు తిప్పుకుంటామని బీజేపీ నేతలు కలలు కంటున్నా, అవి పూర్తిగా సాకారమయ్యేలా లేవు. ప్రజలు విజ్ఞులు... దేశ స్థితిగతులు, కేంద్రం పాలన తీరుతెన్నులు, హామీల అమలులో వైఫల్యాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకునే తమ తీర్పునిస్తారు.

రాష్ట్రాలతో సంబంధాలు సరిగా లేవు. సెస్‌ల పేరిట పన్ను వాటాలకు గండి కొట్టింది. అదానీ వంటి వారికి అండగా నిలిచి అపఖ్యాతి పాలయింది. పలువురు పారిశ్రామికవేత్తలు బ్యాంకుల్ని, ప్రజలను మోసం చేసి లక్షల కోట్ల రూపాయలు సంపాదించి విదేశాలకు పారిపోతే చూస్తూ ఊరుకుంది. మేక్ ఇన్ ఇండియా ఒక నినాదంగా మిగిలిపోయింది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి, నిర్వీర్యం చేస్తోంది.

బీజేపీ పదేళ్ల పాలనలో ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను శాఖలు పూర్తిగా అస్మదీయ శాఖలుగా మారిపోయాయి. తమకు గిట్టని, ఎదిరిస్తున్న వారిని దెబ్బతీయడమే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ఎన్డీయే ప్రభుత్వం వారి రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంది. ప్రతిపక్ష పార్టీ నాయకుల్ని, మంత్రులను, ముఖ్యమంత్రులను కేసుల్లో ఇరికించి భయపెట్టి లొంగదీసుకొన్నది. లొంగని వారిని జైల్లో పెట్టింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉత్తరాఖండ్ సీఎం సోరేన్‌ల అరెస్టులు రాజకీయ కక్షసాధింపులే. రాష్ట్రాల్లో విపక్ష ప్రభుత్వాలని కూలగొట్టి ఫిరాయింపులకు కొత్త అర్థాన్ని చెప్పింది. దేశానికి ప్రగతి నమూనాలను చూపాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా ఆలయాలు, నినాదాలను చూపుతూ దాన్నే ఘనతగా చాటుకుంటోంది. విదేశాంగ విధానాలు విమర్శల పాలయినా సమీక్షించుకోలేదు. రిజర్వేషన్ల వంటి సున్నిత అంశాన్ని వివాదం చేసింది. కులగణన చారిత్రక అవసరమైనా దానిని చేపట్టేందుకు బీజేపీకి ధైర్యం చాలడం లేదు. భారత్ వెలిగిపోతుందనే అతి ప్రచారం 2004లో బీజేపీని దెబ్బకొట్టింది. ఇప్పుడు మితిమీరిన ప్రచారం ఆ పార్టీని నష్టపరిచే ఛాయలు కనిపిస్తున్నాయి.

మాయాజాలంతో ఓటర్లను తమవైపు తిప్పుకుంటామని బీజేపీ నేతలు కలలు కంటున్నా, అవి పూర్తిగా సాకారమయ్యేలా లేవు. ప్రజలు విజ్ఞులు... దేశ స్థితిగతులు, కేంద్రం పాలన తీరుతెన్నులు, హామీల అమలులో వైఫల్యాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకునే తమ తీర్పునిస్తారు. ప్రధానంగా సమస్యల వలయంలో ఉన్న పేదలు, ఉపాధి కోసం చూస్తున్న నిరుద్యోగులు, మద్దతు లేని రైతులు, ప్రగతికి నోచని మహిళలు, వెనకబడిన వర్గాల వారు.. ఇలా అన్ని రంగాల వారు అన్ని విషయాలను బేరీజు వేసుకొనే తగిన నిర్ణయం తీసుకుంటారు. ప్రజల తీర్పు అన్నింటికీ ప్రామాణికంగా నిలుస్తుంది.

• డాక్టర్ బిఎస్ రావు
బిఎస్‌రావు ఫౌండేషన్

కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు భేష్

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా, పోలింగ్ అనంతరం చెలరేగిన అల్లర్లు, హింసాత్మక ఘటనలపై సీరియస్ అయిన కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యులైన అధికారులపై సంచలన చర్యలు తీసుకోవడం వల్ల కొంత అయినా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన ప్రజా హక్కులు కాపాడబడ్డాయి. అసలే వెంటిలేటర్ మీద ఉన్న ప్రజాస్వామ్యానికి ఇంది కొంత బలాన్ని ఇచ్చింది.

రాజ్యాంగాన్ని, ప్రజా హక్కులను కాపాడవలసిన అధికారులు సరైన ప్రణాళికలు లేకపోవడంతో బాటు హింసాత్మక ఘటనలపై వెంటనే స్పందించకపోవడం, నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు. ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. వీటిని ఎంతమాత్రం ఉపేక్షించరాదు. ఇలాంటి అధికారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో వీరు భయంతోనైనా తమ విధులను సక్రమంగా నెరవేరుస్తారు.

పల్నాడు, అనంతపురం ఎస్పీలను కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. సదరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక తిరుపతి ఎస్పీపై బదిలీ వేటు వేసింది. వీరితో పాటు పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లోని 12 మంది పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు వేసింది. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ని కూడా కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఐపీసీ సెక్షన్ ప్రకారం ఎఫఐఆర్ అప్‌డేట్ చేయాలని స్పష్టం చేసింది. ఇక పల్నాడు జిల్లా కలెక్టర్‌పై కూడా బదిలీ వేటు వేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. పల్నాడు కలెక్టర్‌పై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించింది.

ఈ మధ్య కాలంలో ఎన్నికల సంఘం ఇంత తీవ్రంగా స్పందించిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఎన్నికల సంఘం స్పందించిన తీరు బాగుంది. సీఈసీ భవిష్యత్తులో మరింత చురుగ్గా వ్యవహరించి ప్రజాస్వామ్యానికి పట్టంగట్టాలి. ప్రపంచ పటంలో మన దేశ గౌరవాన్ని ఇనుమడింపచేయాలి.

బీజేపీ మద్దతు ధర అతిపెద్ద మోసం!

మొట్టమొదటిసారిగా 1965–66 సంవత్సరంలో మార్కెట్లో సరైన ధరలు లభిస్తాయనే భరోసాను రైతులకు కల్పించడం కోసం ప్రధాన పంటల ఉత్పత్తులకు మద్దతు ధర విధానం తీసుకువచ్చారు. ఈ మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందు ప్రకటిస్తూ వస్తుంది. దీని ఆధారంగా రైతులు ఆయా వ్యవసాయ సీజన్ల ప్రారంభంలో ఏ ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలో ప్రణాళికలు తయారు చేసుకుంటారు. అయితే ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో వచ్చిన నూతన సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా మద్దతు ధర ప్రాముఖ్యత తగ్గుతూ వచ్చింది. దీని ఫలితంగా వ్యవసాయంలో కొంత సంక్షోభం మొదలైంది. ముఖ్యంగా మార్కెట్లో దళారుల దోపిడీ పెరగడం, రైతుల ఆదాయాలు నానాటికి తగ్గిపోవడం, ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరగడం జరిగింది. 2004 నాటికి రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం దేశవ్యాప్తంగా ఒక పెద్ద సవాలుగా మారి అది ఒక రాజకీయ ఎజెండాగా రూపాంతరం చెందింది.

2004లో యూపీఏ కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చి మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా పదవి చేపట్టిన వెంటనే మొత్తం రైతుల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి రైతు సంక్షోభాన్ని నిర్మూలించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించవలసిందిగా స్వర్గీయ డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ సారథ్యంలో జాతీయ రైతు కమిషన్ ఏర్పాటు చేశారు. సుదీర్ఘ అధ్యయనం తర్వాత స్వామినాథన్ కమిషన్ వివిధ సిఫార్సులతో కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో అతిముఖ్యమైన సిఫార్సు పంటల ఉత్పత్తికి అయ్యే అన్ని ఖర్చులను, రైతు యాజమాన్య సేవలను కూడా కలుపుకొని వచ్చే మొత్తం ఖర్చుపై (C3 ఖర్చు) 50 శాతాన్ని హెచ్చించి మద్దతు ధరగా ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా సంక్షోభం నుంచి రైతులకు విముక్తి లభిస్తుందని స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా ఇచ్చే మద్దతు ధరకు చట్టబద్ధత కూడా కల్పించాలని స్వామినాథన్ కమిషన్ సూచించింది.

ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల నుంచి అన్ని ఎన్నికలలోనూ ప్రధాన రాజకీయ పార్టీలు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇస్తూ వచ్చాయి. అయినప్పటికీ నేటి వరకు ఇది హామీగానే మిగిలిపోయింది. అయితే గత పదేళ్ళుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ మేరకు మద్దతు ధర ఇస్తున్నామని చెబుతూ వస్తుంది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల పదే పదే ప్రకటనలు కూడా విడుదల చేస్తూ వస్తుంది. ఇందులో వాస్తవం ఎంత ఉంది అనేది చాలా కీలకం. గత పదేళ్ళుగా ఇస్తున్న మద్దతు ధర నిజంగానే స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకే ఇస్తున్నారా? అంతకుముందు పదేళ్ళుగా అనగా 2004–05 నుండి 2013–14 (యూపీఏ ప్రభుత్వం) కాలంలో ఇచ్చిన మద్దతు ధరల కంటే గత పదేళ్ళ బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలలో పెరుగుదల ఎక్కువగా ఉన్నదా? అదేవిధంగా దేశంలోని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల యూపీఏ కాలంతో పోలిస్తే గత పదేళ్ళ బీజేపీ పాలనలో ఎక్కువ ఉందా? ఇవి కీలక ప్రశ్నలు.

సాధారణ వరి మద్దతు ధర 2004–05లో క్వింటాలుకు రూ.560 నుండి 2013–14 నాటికి రూ.1,310కు పెరిగింది. అనగా ఈ పదేళ్ళ యూపీఏ ప్రభుత్వ కాలంలో వరి మద్దతు ధరలో 134శాతం పెరుగుదల నమోదయింది. అదేవిధంగా మొక్కజొన్న మద్దతు ధర క్వింటాలుకు రూ.525నుండి రూ.1,310కు ఇదే యూపీఏ ప్రభుత్వ కాలంలో పెరిగింది. అంటే 150 శాతం పెరుగుదల. అదేవిధంగా వాణిజ్య పంట అయిన పత్తి మద్దతు ధరలో పెరుగుదల ఈ కాలంలో 110 శాతంగా నమోదయింది. ఇక గత పదేళ్ళ బీజేపీ పాలనలో (2014–15 నుంచి 2023–24) గణాంకాలను పరిశీలించినట్లయితే అన్ని ప్రధాన పంటల మద్దతు ధరలలో పెరుగుదల చాలా తగ్గింది. 2014–15లో వరి మద్దతు ధర క్వింటాలుకు రూ.1,360 ఉంటే, అది 2023–24 నాటికి కేవలం రూ.2,183కి పెరిగింది. అంటే గత పదేళ్ళల్లో వరి మద్దతు ధరలో పెరుగుదల కేవలం 60 శాతం మాత్రమే. ఈ పెరుగుదల యూపీఏ ప్రభుత్వ కాలంతో పోలిస్తే సగానికి తక్కువగానే ఉన్నట్లు అర్థమవుతుంది. అదేవిధంగా మొక్కజొన్న మద్దతు ధర గత పదేళ్ళ బీజేపీ పాలనలో క్వింటాలుకు రూ.1,310 నుండి రూ.2,090 పెరిగింది. అంటే గత పదేళ్ళల్లో మొక్కజొన్న మద్దతు ధరలో పెరుగుదల 59 శాతం మాత్రమే. ఇక పత్తి మద్దతు ధర పెరుగుదల కేవలం 76 శాతం. అన్ని ప్రధాన పంటల్లో దాదాపుగా ఇదే సరళిని గమనించవచ్చు. 2014–24 మధ్యకాలంలో ప్రకటించిన అన్ని పంటల మద్దతు ధరలో పెరుగుదల అంతకుముందు పదేళ్ళతో పోలిస్తే (2003–14 వరకు) సగం కూడా లేకపోవడం గమనార్హం.

ఇక మరో సూచికైనా మద్దతు ధరల వార్షిక వృద్ధిరేటును పరిశీలిద్దాం. యూపీఏ ప్రభుత్వ కాలంలో సాధారణ వరి మద్దతు ధరలో నమోదైన సగటు వార్షిక వృద్ధిరేటు 9.4 శాతం. అయితే వరి మద్దతు ధరలో ఈ సగటు వృద్ధిరేటు గత పదేళ్ళ బీజేపీ పాలనలో కేవలం 5.3 శాతం మాత్రమే. అదేవిధంగా యూపీఏ ప్రభుత్వ కాలంలో సగటు వార్షిక వృద్ధిరేటు 10.5 శాతంగా ఉన్న మొక్కజొన్న మద్దతు ధర గత పదేళ్ళ బీజేపీ పాలనలో కేవలం 4.9 శాతం మాత్రమే. పత్తి మద్దతు ధర సగటు వార్షిక వృద్ధిరేటు యూపీఏ కాలంలో 8.7 శాతంగా నమోదు కాగా, బీజేపీ పాలనలో 6.9 శాతం మాత్రమే. ఈ గణాంకాలను బట్టి అర్థమయ్యేది ఏమిటంటే గత పదేళ్ళ బీజేపీ పాలనలో దాదాపు అన్ని ప్రధాన పంటల మద్దతు ధరల సగటు వార్షిక వృద్ధిరేటుల్లో పెరుగుదల, గత యూపీఏ ప్రభుత్వ కాలంతో పోలిస్తే సగానికి తక్కువ! బీజేపీ ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నట్టుగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరను ఇచ్చి ఉన్నట్లయితే ఈ కాలంలో మద్దతు ధరల పెరుగుదల, వార్షిక అభివృద్ధి రేటు యూపీఏ ప్రభుత్వ కాలం కంటే ఎందుకు తక్కువగా నమోదైంది? స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తున్నామని చెబుతూ బీజేపీ ప్రభుత్వం రైతులని ఎందుకు మభ్యపెడుతున్నట్టు?

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను నిజంగానే అమలు చేసి ఉన్నట్లయితే ప్రస్తుతం ప్రధాన పంటల మద్దతు ధర ఎంత ప్రకటించాల్సి ఉండేది? తెలంగాణలో అధికారిక పంటల ఉత్పత్తి ఖర్చుల గణాంకాలు విశ్లేషిస్తే దీనికి సమాధానం దొరుకుతుంది. 2020–21లో మొత్తం వరి పంట ఉత్పత్తి ఖర్చు (C2) క్వింటాలుకు రూ.1,876. ఈ C2 ఖర్చుపై 10 శాతం రైతు యాజమాన్య సేవల విలువను కలిపినట్లయితే వరి ఉత్పత్తి ఖర్చు (C3) రూ.2,083. స్వామినాథన్ సిఫార్సు ప్రకారం ఈ C3 ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి క్వింటాలుకు రూ.3,124 రైతాంగానికి ఇవ్వాలి. కానీ బీజేపీ కేంద్ర ప్రభుత్వం 2020–21 సంవత్సరంలో వరికి ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు కేవలం రూ.1,868 మాత్రమే. అనగా సిఫార్సుల ప్రకారం ఇవ్వాల్సిన మద్దతు ధర కంటే రూ.1,256, అనగా 67 శాతం, తగ్గించి ఇచ్చారు. ఇదే లెక్కల ప్రకారం 2023–24 సంవత్సరానికి ఇవ్వవలసిన వరి మద్దతు ధర క్వింటాలుకు రూ. 3,645. కానీ కేంద్రం ఇచ్చిన ధర కేవలం రూ.2,183 మాత్రమే. అనగా స్వామినాథన్ సిఫార్సుల కంటే ప్రతి క్వింటాల్‌పై రూ.1,462 తగ్గించి ఇస్తున్నది. ఈ లెక్క ప్రకారం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేయకపోవడం వలన ప్రతి ఎకరానికి వరి రైతు నికరంగా నష్టపోతున్నది రూ.29,240. దీని ప్రకారమే ప్రస్తుత సంవత్సరం మొక్కజొన్న మద్దతు ధర క్వింటాలుకు రూ. 3,030, పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.13,381గా ఉండాల్సింది. కానీ మొక్కజొన్న రైతులు ప్రతి ఎకరానికి రూ.26,334, పత్తి రైతులు రూ.34,985 నికరంగా నష్టపోయారు. అయినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధర ఇస్తున్నామని ఎలా చెప్పుకోగలుగుతున్నది? ఇంతకంటే మోసం మరొకటి ఉంటుందా?

స్వామినాథన్ సిఫార్సు మేరకు C3 ఖర్చును ఆధారంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను ఇవ్వలేదు. మొత్తం C3 ఖర్చులోని కొన్ని ఖర్చులను తగ్గించి కేవలం A2 ఖర్చు, కుటుంబ కూలీల ఖర్చులను కలుపుకొని వాటిపై మాత్రమే 50శాతం హెచ్చించి మద్దతు ధరను ప్రకటిస్తూ వస్తుంది. ఉదాహరణకు 2020–21లో వరి సాగులో మొత్తం C3 ఖర్చు క్వింటాలుకు రూ.2,083 అయితే దానిని తగ్గించి కేవలం A2 ఖర్చు, కుటుంబ కూలీల ఖర్చు కలిపితే వచ్చే ఉత్పత్తి ఖర్చు క్వింటాలుకు రూ.1320ను ఆధారంగా చేసుకుని మద్దతు ధరను ప్రకటిస్తూ వస్తున్నారు. అంటే స్వామినాథన్ సిఫార్సు మేరకు తీసుకోవలసిన C3 ఖర్చు కంటే 58శాతం వరి ఉత్పత్తి ఖర్చును తగ్గించి చూపిస్తూ దానిపై 50శాతం అదనంగా మద్దతు ధరను ఇస్తూ రైతులను మోసం చేస్తున్నారు.

ఇలాంటి రైతు వ్యతిరేక బీజేపీ విధానాల ఫలితంగానే దేశంలో ఏనాడు వినని చూడని రైతుల ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా బీజేపీ నాయకత్వం వాస్తవిక పరిస్థితులను గ్రహించి, దేశ భవిష్యత్తులో రైతాంగం ప్రాముఖ్యతను గుర్తించి తదనుగుణంగా విధానాలు రూపకల్పన చేస్తుందని ఆశిద్దాం.

■ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న 2014–24 మధ్యకాలంలో ప్రకటించిన అన్ని పంటల మద్దతు ధరలో పెరుగుదల అంతకుముందు యూపీఏ పదేళ్ళతో పాలనతో పోలిస్తే (2003–14 వరకు) సగం కూడా లేదు. బీజేపీ ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నట్టుగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరను ఇచ్చి ఉన్నట్లయితే ఈ కాలంలో మద్దతు ధరల పెరుగుదల, వార్షిక అభివృద్ధి రేటు యూపీఏ ప్రభుత్వ కాలం కంటే ఎందుకు తక్కువగా నమోదైంది?



సంచలనం సృష్టించిన బెంగళూరు రేవ్ పార్టీ మూలాలు బెజవాడలోనే ఉన్నాయా..? వన్‌టౌన్‌లోని ఆంజనేయ వాగుకు చెందిన వాసు ఆధ్వర్యంలోనే ఈ పార్టీ జరిగిందా..? ఒకప్పుడు పూరింట్లో కటిక పేదరికం అనుభవించిన వాసు ఇప్పుడు రూ.కోట్లకు ఎలా అధిపతి అయ్యాడు..? వాసు డాన్‌గా జిల్లాలో బెట్టింగ్ బుకీల వ్యవస్థ నడుస్తోందా..? అన్నీ తెలిసి పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారా..? వీటన్నింటికీ అవుననే సమాధానమే వస్తోంది. బెంగళూరు శివారులోని ఓ ఫాంహౌస్‌లో నిర్వహించిన రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశాక వాసు పేరు వెలుగులోకి రావడంతో విజయవాడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

బెజవాడ బుకీ



లంకపల్లి వాసు



బెంగళూరు రేవ్ కేసులో ప్రధాన సూత్రధారుడు వాసు

- నాడు వన్‌టౌన్ వాగు సెంటర్‌లోని పూరింట్లో పేదరికం
- నేడు రూ.కోట్లకు అధిపతి.. ఖరీదైన విల్లాలు, కార్లు
- కేదారేశ్వరపేట లోటస్‌లో బెట్టింగ్‌లకు ఓనమాలు
- దక్షిణాదిలో ఏ ఎన్నికలు జరిగినా భారీగా పందేలు
- క్రికెట్ బెట్టింగ్‌ల్లోనూ ఆరితేరిన ఘటికుడు

నగరం సహా జిల్లా అంతటా అనుచర బుకీలు

(ఆంధ్రజ్యోతి- విజయవాడ/ చిట్టినగర్/వన్‌టౌన్/సత్యనారాయణపురం) : లంకపల్లి వాసు.. ఓ పేద కుటుంబానికి చెందిన వ్యక్తి. క్రికెట్ బెట్టింగ్ మొదలుకుని రాజకీయ బెట్టింగ్‌ల వరకు అన్నీ కలిసొచ్చి రూ.కోట్లకు అధిపతి అయ్యాడు. క్రికెట్ సహా దక్షిణాదిలో ఏ రాష్ట్రంలో ఎటువంటి ఎన్నికలు జరిగినా బెట్టింగ్‌లు నిర్వహించేవాడు. దీనిద్వారా కోట్లాది రూపాయలు ఆర్జించాడు. ఈ బెట్టింగ్‌లపై వాసు రూ.200 కోట్ల వరకు సంపాదించినట్టు తెలుస్తోంది.

పూరింటితో మొదలై..

కొత్తపేటలోని ఆంజనేయ వాగు కొండపై గతంలో ఒక పూరింట్లో నివాసం ఉండేవాడు. తల్లిదండ్రులు తొలుత కూలీ పనులు చేసుకుని జీవించేవారు. తండ్రి చనిపోవడంతో తల్లి ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించింది. కేదారేశ్వరపేటలో లోటస్‌కు చెందిన ఒక బుకీని పరిచయం చేసుకుని, అతని వద్ద చేరి, బెట్టింగ్‌లపై పూర్తి పట్టు సాధించాడు. అనతికాలంలోనే రూ.కోట్లు కూడగట్టాడు. ఎన్నో ఇళ్లు, విల్లాలు కట్టాడు. వాటన్నింటికీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు. చుట్టూ సీసీ కెమెరాలు పెట్టుకున్నాడు. ఆంజనేయ వాగు కొండ ప్రాంతంలో పైభాగాన ఒక రేకుల షెడ్‌ను అత్యాధునికంగా నిర్మించి, సీసీ కెమెరాలు అమర్చాడు. స్థానికంగా ఉండే బుకీలు ఈ షెడ్‌లో బెట్టింగ్‌లు నిర్వహించేవాడు.

బెంగళూరు పార్టీ నిర్వహించింది ఇతనే..

బెంగళూరులోని ఫాంహౌస్‌లో సన్‌సెట్-సన్‌రైజ్ పేరుతో వాసు పార్టీ నిర్వహించాడు. దీనికి ప్రత్యేకంగా ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. అందులోనే ఆహ్వానాలు పంపాడు. పుట్టినరోజు పార్టీ కోసమని ఫాంహౌస్‌ను తీసుకున్నాడు. కెంపెగౌడ్ పోలీసులు నమోదు చేసిన కేసును గురువారం బెంగళూరు సీసీబీ (సెంట్రల్ క్రైం బ్యూరో)కు బదిలీ చేశారు. బెట్టింగ్‌ల వ్యవహారం పూర్తిగా వెలుగులోకి వచ్చినప్పటికీ డ్రగ్స్ వ్యవహారం తేలాల్సి ఉంది. పార్టీలో ముగ్గురు డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులను అరెస్టు చేశారు. వాసుతో స్నేహం లేకుండా వారు పార్టీలోకి రావడం అసాధ్యమని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం వాసు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్టు సమాచారం. అతడి తల్లి అనారోగ్యంతో ఉన్నట్టు తెలిసింది.

అంతుచిక్కని కథ

వాసు బెట్టింగ్‌కు ప్రధాన బుకీ. అతడికి అనుబంధంగా విజయవాడలో 150 మంది, జిల్లాలో 400 మంది వరకు బుకీలు ఉన్నారు. క్రికెట్ సీజన్ ప్రారంభమైన ప్రతిసారీ పోలీసులు లాడ్జీలు, బ్యాచిలర్స్ రూంల్లో తనిఖీలు చేసి కొంతమంది బుకీలను పట్టుకుంటున్నారు. ప్రధాన బుకీ గురించి మాత్రం పోలీసులు వివరాలు వెల్లడించేవారు కాదు. ప్రధాన బుకీలు ఢిల్లీ, ముంబయి, బెంగళూరుల్లో ఉంటారని చెప్పుకొచ్చేవారు. వన్‌టౌన్, కొత్తపేట ప్రాంతాల్లో వాసు అనుచరులు ఎంతోమంది పలుమార్లు అరెస్టయ్యారు. వారంతా బుకీలని తెలిసినా పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాసు 150 గజాల స్థలంలో పూరిల్లు తొలగించి రూ.50 లక్షలతో ఇల్లు నిర్మించాడు. గట్టువెనుక కబేళా ప్రాంతంలో 500 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి విలాసవంతమైన గెస్ట్‌హౌస్‌ను నిర్మించుకున్నాడు. ఒకప్పుడు టిఫిన్‌కు, భోజనానికి స్నేహితుల వద్ద డబ్బు అడిగి తీసుకునే వాసు కోట్లాది రూపాయలు ఎలా సంపాదించాడో అర్థంకావడం లేదని స్థానికులు చెబుతున్నారు. స్నేహితుడు నాగరాజు అనే వ్యక్తికి క్రికెట్ బుకీ నేర్పించి ప్రధాన అనుచరుడిగా పెట్టుకున్నాడు. అతడు బెట్టింగ్‌లు నిర్వహిస్తూ రూ.10 కోట్లకు పైగానే సంపాదించినట్లు స్థానికులు చెబుతున్నారు.

స్క్రాప్ వ్యాపారి మోసం..

రూ.20 కోట్లతో జంప్

కొత్తపేట పోలీసులను ఆశ్రయించిన బాధితులు

వన్‌టౌన్, మే 22 : సాటి వ్యాపారులను నమ్మించి, రూ.20 కోట్ల మేర వసూలు చేసిన వన్‌టౌన్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి చివరకు కనిపించకుండాపోయాడు. దీంతో బాధితులు బుధవారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల కిందటి వరకు వించిపేటలోనే నివాసమున్న మహమ్మద్ అబ్దుల్ ఫహీమ్.. ఆ తర్వాత తాడేపల్లి సమీపంలోని నులకపేటకు మారాడు. ప్రస్తుతం అక్కడి నుంచి కూడా పరారయ్యాడు. ఫహీమ్ గురించి కుటుంబ సభ్యుల వద్ద ఆరా తీయగా, తమకు తెలియదని చెప్పారు. దీంతో బాధితులంతా బుధవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో వెస్ట్ ఏసీపీని ఆశ్రయించారు. ఆయన సలహాతో కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మహమ్మద్ అబ్దుల్ ఫహీమ్ (ఫైల్)

రూ.20 కోట్లు స్వాహా

ఫహీమ్ ట్రేడర్స్ పేరుతో మహమ్మద్ అబ్దుల్ ఫహీమ్ స్క్రాప్ వ్యాపారం చేసేవాడు. తాను.. తన మామ ఇక్బాల్‌తో కలిసి స్క్రాప్ వ్యాపారం చేస్తున్నానని, పెట్టుబడికి కొంత డబ్బు అవసరమని, సర్దుబాటు చేయాలని కొంతమంది వ్యాపారులను కోరాడు. స్క్రాప్ అమ్మేస్తే భారీ లాభాలు వస్తాయని, వాటా ఇస్తానని నమ్మించాడు. ట్రేడ్ లైసెన్స్, ఇతర డాక్యుమెంట్లను కూడా చూపించాడు. ఇది నమ్మి వించిపేటకు చెందిన మహమ్మద్ అక్బర్ ఇమ్రాన్ 2020వ సంవత్సరంలో కొంత డబ్బు ఇచ్చాడు. అయితే, ఫహీమ్ ఆ తరువాత రెండు విడతల్లో ఇమ్రాన్‌కు రూ.4 లక్షలు ఇచ్చాడు. అది లాభమని చెప్పాడు. నమ్మకం కలిగిన ఇమ్రాన్ మరికొంత సొమ్ము.. సుమారు రూ.80 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత ఓ ప్రైవేట్ సంస్థ నుంచి రూ.7 కోట్లకు స్క్రాప్ టెండర్ వచ్చిందని, పెట్టుబడికి కొంత డబ్బు కావాలని కోరాడు. అది నమ్మిన ఇమ్రాన్ తనకు తెలిసిన వారి వద్ద నుంచి అప్పు చేసి ఫిబ్రవరి 8వ తేదీన రెండు విడతలుగా రూ.9.2 లక్షలు, రూ.9.7 లక్షలతో పాటు మరోసారి రూ.10 లక్షలు ఆన్‌లైన్‌లో ఫహీమ్ ఖాతాకు పంపాడు. అప్పట్నుంచి ఫహీమ్ నుంచి ఎలాంటి స్పందన లేదు. దీనిపై ఇమ్రాన్ నిలదీశాడు. దీంతో ఓ ప్రైవేట్ సంస్థతో టెండర్ ఖరారైనట్లు రూ.7 కోట్ల డీడీ కాపీని ఇమ్రాన్ సెల్‌ఫోన్‌కు పంపించాడు. ఆ తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ నెల 15వ తేదీన ఇమ్రాన్ మరికొంతమందితో కలిసి ఫహీమ్ ఇంటికి వెళ్లాడు. పది రోజులుగా ఇంటికి రావడం లేదని కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే, ఫహీమ్ జాడ తెలియకపోవడంతో ఇమ్రాన్ తన స్నేహితులకు చెప్పాడు. కాగా, ఆ స్నేహితులు కూడా తాము పెద్ద మొత్తంలో ఫహీమ్‌కు డబ్బులిచ్చామని చెప్పి ఆందోళనకు గురయ్యారు. ఎస్‌కే ఇబ్రహీం ఖలీల్, షేక్ ఇర్షాద్, షేక్ అబ్దుల్ హమీద్ పాషా, షఫీ ఉల్లాఖాన్, అస్కర్ హుస్సేన్, పటాన్ బాగీ, అబ్దుల్ రషీద్, షేక్ కాజా, అబ్దుల్ రెహమాన్, షబ్బార్ తదితరులతో పాటు మరికొంతమంది నుంచి ఫహీమ్ దాదాపు రూ.20 కోట్ల వరకు వసూలు చేశాడని తెలిసింది. మోసపోయామని గ్రహించిన వారంతా బుధవారం పోలీసులను ఆశ్రయించారు.



సీపీ కార్యాలయం వద్ద బాధితులు



నెల్లూరు జిల్లాలో ప్రమాదానికి గురైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

అతివేగానికి బ్రేకులు పడవా..?

ప్రైవేట్ బస్సుల మితిమీరిన వేగం

- నెల్లూరులో నగరానికి చెందిన ప్రైవేట్ బస్సు బోల్తా.. డ్రైవర్ మృతి
- ఇటీవల వరుసగా జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం.. చర్యలు శూన్యం
- అడ్డుకట్ట వేయటంలో రవాణా, పోలీసులు విఫలం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రైవేటు బస్సులు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. మితిమీరిన వేగంతో నగరానికి చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నెల్లూరు జిల్లా ధగదర్తి మండలం సున్నపుబట్టీ దగ్గర కంటైనర్ లారీని ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. మహిళ పరిస్థితి విషమంగా మారింది. విజయవాడ నుంచి చెన్నై బయల్దేరిన ఈ బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. డ్రైవర్ మితిమీరిన వేగంతో ఓవర్‌టేక్ చేయబోయి కంటైనర్ లారీని ఢీకొన్నట్టుగా తెలిసింది.

పర్యవేక్షణ ఏదీ..?

నాలుగేళ్లుగా ప్రైవేట్ బస్సులపై రవాణా శాఖ దృష్టి సారించట్లేదు. దీంతో ప్రైవేట్ డ్రైవర్ల దూకుడు పెరిగింది. ఓవర్ స్పీడ్ కారణంగా నగరంలో కొంతకాలం కిందట జబ్బార్ ట్రావెల్స్ బస్సు బీభత్సం సృష్టించింది. బెంజిసర్కిల్ నడిబొడ్డున ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. అంతకుముందు ముళ్లపాడు వద్ద ఎన్‌హెచ్-65పై దివాకర్ ట్రావెల్స్ బస్సు ఓవర్ స్పీడ్‌తో వంతెనను ఢీకొట్టి కాల్వలో పడిపోయింది. ఈ ఘటనల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత కూడా ప్రైవేట్ దూకుడు కొనసాగింది. ప్రమాదాలు కూడా జరిగాయి. విజయవాడ-హైదరాబాద్ మార్గంలో 4 గంటల సమయంలోనే రాకపోకలు సాగించేలా ప్రైవేట్ ట్రావెల్స్ ఓవర్ స్పీడ్ మంత్రాన్ని ఎంచుకున్నాయి. దీంతో ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. విజయవాడ-చెన్నై, విజయవాడ-విశాఖపట్నం, విజయవాడ-బెంగళూరు, విజయవాడ-తిరుపతి.. ఇలా ప్రధాన మార్గాల్లో ఆర్టీసీ బస్సులకు స్పీడ్ లిమిట్ తక్కువగా ఉంటుంది. దీనిని ప్రైవేట్ ఆపరేటర్లు క్యాష్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే నగరంలోని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మితిమీరిన వేగంతో బస్సు నడిపి ప్రాణాలు పోగొట్టుకున్నాడని తెలుస్తోంది.

మామూళ్ల మత్తులో అధికారులు

ప్రైవేట్ బస్సుల విషయంలో కొన్నేళ్లుగా రవాణా శాఖ నిర్లిప్తంగా ఉంటోంది. ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల నుంచి రవాణా శాఖకు నెలవారీ ప్యాకేజీలు అందుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తనిఖీల ఊసే లేకుండాపోయింది. కాగా, ఓవర్ స్పీడ్‌ను పరిశీలించడానికి గతంలో రవాణా శాఖ సాంకేతిక యంత్రాలను ప్రవేశపెట్టింది. ఆ వాహనాలు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదు. ఓవర్ స్పీడ్‌పై ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ కూడా కరువైంది. ప్రైవేట్ బస్సుల్లో పోలీసులకు ఉచిత ప్రయాణాల ప్యాకేజీ ఉండటం, నెలవారీ మామూళ్లు అందడం వల్లే ఇలా చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా రహదారి భద్రతా కమిటీలు కూడా నామమాత్రంగానే మారాయి. ఈ కమిటీ సమావేశాల్లో తీసుకునే ముఖ్య నిర్ణయాలు అమలు కావట్లేదు. జాతీయ రహదారులు, ప్రమాదకర ప్రాంతాలపైనే దృష్టి పెడుతున్నారు. కానీ, వ్యవస్థీకృత లోపాలు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, లారీలు, ఆటోలు, క్యాబ్‌లపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఇప్పటికైనా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దుర్ఘటనను దృష్టిలో పెట్టుకుని రెండు జిల్లాల రోడ్డు భద్రతా కమిటీలు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దుర్గగుడి ఆలయ శిఖరానికి స్వర్ణతాపడ పనులు వేగవంతం

- రెండోసారీ టీటీడీకే అప్పగింత.. భక్తుల నుంచి విరాళాల సేకరణ

- 6లో..



బాలిక మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి (ఇన్‌సెట్‌లో) చిన్నారి వాగ్దేవి (ఫైల్)

అయ్యో పాపం

- చెరువులో పడి బాలిక మృతి • కానూరులో విషాదఛాయలు

పెనమలూరు, మే 22 : స్నేహితులతో సరదాగా ఆడుకుంటూ ఇంటి వెనుక ఉన్న చెరువులో పడి ఎనిమిదేళ్ల పాప మృతిచెందింది. ఈ సంఘటనతో బుధవారం కానూరులో విషాదఛాయలు అలముకున్నాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనమలూరు మండలం కానూరుకు చెందిన ఆరేపల్లి వాగ్దేవి (8) మంగళవారం మధ్యాహ్నం తర్వాత కనిపించకుండా పోయింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బాలికను ఎవరైనా కిడ్నాప్ చేశారా, కాల్వలో పడిందా అనే కోణంలో పోలీసులు రాత్రంతా గాలించారు. మొత్తం 14 మంది స్నేహితులను విచారణ చేశారు. చివరకు బాలిక ఆమె ఇంటి వెనుక ఉన్న కాల్వలో పడి మునిగిపోయిందని నిర్ధారించుకున్నారు. కాగా, బుధవారం ఉదయానికి బాలిక మృతదేహం నీళ్లపైకి తేలింది. దీన్ని చూసిన చిన్నారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

వన్‌టౌన్‌లోని టైలర్‌పేట జోడుబొమ్మల సెంటర్‌లో పేరుకుపోయిన చెత్త



చెత్త కష్టాలు

క్లాప్ వాహన డ్రైవర్లకు జీతాలు బంద్

- విధులకు రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే..
- వారం రోజులుగా చెత్త సేకరణ నిలిపివేత
- నగరంలో పేరుకుపోయిన 700 టన్నుల చెత్త

చెత్తపన్నును బలవంతంగా వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ చెత్తను సేకరించే వాహన డ్రైవర్లకు జీతాలు చెల్లించడంలో మాత్రం పాలకులు చూపట్లేదు. డ్రైవర్లకు జీతాలు నిలిపివేయడంతో విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. దీంతో నగరంలో 700 టన్నుల చెత్త పేరుకుపోయింది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/చిట్టినగర్) : రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు వైసీపీ ప్రభుత్వం సీఎన్‌జీ వాహనాలను కేటాయించింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 225, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు 42, గుడివాడ మున్సిపాలిటీకి 31, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీకి 42 వాహనాలు కేటాయించారు. వీటిద్వారా ఇంటింటి చెత్త సేకరణ నెపంతో చెత్తపన్ను వసూలు చేయడం ప్రారంభించారు. అయితే, పన్ను వసూలు చేయడంపై ఉన్న దృష్టి క్లాప్ వాహన డ్రైవర్లకు జీతాల చెల్లింపుపై చూపట్లేదు. దీంతో విజయవాడ కార్పొరేషన్‌లో 225 వాహనాల నిర్వహణ, జీతాలకు అవసరమయ్యే రూ.1.28 కోట్లు చెల్లించలేదు. ఈ మొత్తాన్ని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) చెల్లించాల్సి ఉంది. విజయవాడ కార్పొరేషన్‌తో పాటు వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలోనూ నిర్వహణ, జీతాల చెల్లింపు నిలిచిపోయింది. దీంతో వాహన డ్రైవర్లు విధులు బహిష్కరించారు. విజయవాడ నగరంలో 225 వాహనాల ద్వారా రోజూ సుమారు 300 టన్నుల చెత్తను సేకరించి తరలిస్తారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో 30 టన్నుల వరకు సేకరిస్తారు. వారం రోజులుగా క్లాప్ వాహనాల డ్రైవర్లు విధులు బహిష్కరించడంతో నగరంలో సుమారు 700 టన్నుల చెత్త పేరుకుపోయింది. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలోనూ ఇదే పరిస్థితి. క్లాప్ వాహనాలను స్వయంభు ఏజెన్సీ నిర్వహిస్తోంది. ప్రతినెలా సీడీఎంఏ ద్వారా ఏజెన్సీకి చెల్లింపులు జరగాలి. అయితే, గతనెల నిర్వహణ, వేతనాలు చెల్లించలేదు. బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, వేతనాలు పెంచాలని క్లాప్ వాహనాల

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం :

రత్నావళి, సీహెచ్ఎంవో

నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పేరుకుపోయిన చెత్తను తరలించేందుకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం చర్యలు తీసుకుంటోంది. చెత్తను తరలించేందుకు మూడు సర్కిళ్లకు ఐదు ప్రైవేట్ ట్రాక్టర్ల చొప్పున ఏర్పాటు చేశాం. వీఎంసీ టిప్పర్లతో పాటు ట్రాక్టర్లతో చెత్తను తరలిస్తాం. డ్రైవర్లకు జీతాలు అందేలా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. సీడీఎంఏ అధికారులతో మాట్లాడుతున్నారు.



దుర్గగుడి ఆలయ శిఖరానికి స్వర్ణతాపడ పనులు వేగవంతం

» రెండోసారీ టీటీడీకే అప్పగింత.. భక్తుల నుంచి విరాళంగా సేకరణ

వన్‌టౌన్, మే 22 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రధాన ఆలయ శిఖరంలోని సగభాగానికి స్వర్ణతాపడం పనులు వేగవంతం చేశారు. ఎప్పటి మాదిరే స్వర్ణతాపడం పనులను తిరుమలతిరుపతి దేవస్థానం(టీటీడీ)కి అప్పగించారు. ఆలయ పైభాగం స్వర్ణతాపడాన్ని గతంలో టీటీడీనే నిర్వహించింది. దీనికి తగిన బంగారాన్ని, సంబంధిత పనులకుగాను స్వర్ణతాపడ నిపుణులకు మజూరీ తదితరాలను దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానమే భరిస్తుంది. స్వర్ణతాపడం నిమిత్తం దాతల నుంచి దేవస్థానం విరాళాలు స్వీకరిస్తున్నది. కనకదుర్గ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పేరిట విరాళాల సేకరణకు ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన డోనర్ సెల్‌ను ప్రారంభించారు. ఇప్పటి వరకు భక్తుల నుంచి సుమారు రూ.25 లక్షలకు పైగా విరాళాలు సమకూరాయి. స్వర్ణతాపడానికి సుమారు 75 కేజీల బంగారం అవసరమని అంచనా వేశారు. భక్తుల విరాళాలతో పాటు దేవస్థానం వద్ద ఉన్న బంగారాన్ని కూడా టీటీడీకి అప్పగించి స్వర్ణతాపడం పనులను పూర్తి చేయించేందుకు ఆలయ అధికారులు రంగం సిద్ధం చేశారు.



ద్వారకా తిరుమలలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దుర్గగుడి ఈవో రామారావు

ద్వారకా తిరుమల చిన్నవెంకన్నకు పట్టువస్త్రాల సమర్పణ

వన్‌టౌన్, మే 22 : ద్వారకా తిరుమలలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జరుగుతున్న బ్రహ్మోత్సవ కళ్యాణోత్సవాల సందర్భంగా బుధవారం విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం తరపున ఈవో కేఎస్ రామారావు, ఏఈవో రమేష్‌బాబు, ముఖ్య అర్చకుడు మారుతి యజ్ఞనారాయణ శర్మ తదితరులతో కూడిన బృందం పట్టువస్త్రాలను సమర్పించింది. పట్టువస్త్రాలు, పరిమళ ద్రవ్యాలతో ఆలయానికి విచ్చేసిన బృందానికి ద్వారకా తిరుమల ఈవో త్రినాథరావు సాదర స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళధ్వనులు, వేదమంత్రాల మధ్య స్వామివారికి దివ్యసంకల్పం చేస్తూ అశేషజన ప్రజాక్షేమం కోరుతూ సంకల్పం చెప్పి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈవో రామారావు తదితరులకు ద్వారకా తిరుమల అధికారులు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.



ఆత్మీయ సమావేశంలో కేశినేని శివనాథ్, శ్రీరామ్ తాతయ్య, తదితరులు

ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ ఖాళీ

» టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, మే 22 : ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతుందని వైసీపీ నేతల పాపం పండిపోవడంతో ప్రజలందరూ కూటమి అభ్యర్థులకే ఓటు వేసేందుకు ప్రజలు పోటెత్తారని విజయవాడ కూటమి పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బుధవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయననుకేశినేని చిన్నిని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే, జగ్గయ్యపేట అసెంబ్లీ అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్(తాతయ్య), శ్రీరామ్ సాయి, మండల, గ్రామ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం చిన్ని ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ, జగ్గయ్యపేటలో పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున అనుసరించాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలపై సలహాలు, సూచనలు చేశారు. మండల అధ్యక్షుడు కట్టా వెంకటనరసింహరావు, వత్సవాయి అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు, నందిగామ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ మన్నె కళావతి తదితరులు చిన్నిని కలిసిన వారిలో ఉన్నారు. తిరువూరు మండల, గ్రామ పార్టీ నాయకులను తిరువూరులో జరిగిన ఎన్నికల సరళిని గూర్చి కేశినేని చిన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు నాయకులు కేశినేని శివనాథ్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, గంపలగూడెం మండల అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి, ఏ.కొండూరు మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, తిరువూరు రూరల్ అధ్యక్షుడు వెంకట నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొమ్మసాని మహేష్, గంపలగూడెం క్లస్టర్ ఇన్‌చార్జ్ కొత్త రజనీకాంత్, సీనియర్ నాయకులు కిలారు రమేశ్, గద్దె వెంకన్న, డాక్టర్ జయసింహ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతకు చర్యలు చేపట్టండి : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం,మే22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రవాణా, పరిశ్రమలు, చేనేత, కార్మిక, కాలుష్యనియంత్రణ శాఖలపై బుధవారం కలెక్టర్ తన ఛాంబరులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో పోలీసులు నిఘా ఉంచాలన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో సంబంధిత వివరాలను ఈ-డీటెయిల్ట్ యాక్సిడెంట్ రిపోర్ట్(ఈ-డార్)లో నమోదుచేయాలని సూచించారు. ఇప్పటివరకు నమోదైన వివరాలను ఆయన పరిశీలించారు. రహదారి భద్రతకు సంబంధించిన అంశంపై ప్రతినెలా మూడో శుక్రవారం సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి అంశాలను సంబంధితశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలన్నారు. కాలుష్య నియంత్రణకు తగుచర్యలు చేపట్టాలన్నారు. పర్యాటకశాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపైనా కలెక్టర్ ఆరా తీశారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి పురేంద్ర, పరిశ్రమలశాఖ జీఎం వెంకట్రావు, పర్యాటకశాఖ అధికారి రామ్‌లక్ష్మణ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ డైవర్షన్ ఛానల్‌పై బూదవాడ రైతులు, రైల్వే అధికారుల భేటీ

జగ్గయ్యపేట : బూదవాడ-మేళ్ల చెరువు రైల్వేలైన్‌లో రైల్వే అండర్‌పాస్ సమస్య పరిష్కారానికి బుధవారం జగ్గయ్యపేట తహసీల్దార్ శేషు సమక్షంలో గ్రామ రైతులు, మధిర ఐఓడబ్ల్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా రైతులు అండర్‌పాస్ వల్ల కలుగుతున్న ఇబ్బందులపై జిల్లా కలెక్టర్‌కు పలుసార్లు ఫిర్యాదు చేయటంతో రైల్వే అధికారులు, రైతుల మధ్య ఏకాభిప్రాయం కుదరక సమస్య పరిష్కారం కాలేదు. ఈ సందర్భంగా గ్రామ రైతులు గుగ్లోతు బ్రహ్మం, బాణావత్ బ్రహ్మంలు 12 అడుగుల లోతులో అండర్‌పాస్ వల్ల నీరు నిలిచిపోయి రాకపోకలు సాధ్యం కావటం లేదని, అండర్‌పాస్ గోడల మీద నుంచి పొలాలకు వెళ్లటం ప్రాణాంతకంగా ఉందని వివరించారు. రైల్వే అధికారులు అండర్‌పాస్ వద్ద నుంచి వస్తున్న నీటిని కాలవ ద్వారా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామని, రైతులు సంవత్సరకాలం పాటు కాల్వ నిర్మాణం జరిగేంతవరకు ఇవ్వాలని కోరారు. పరిహారం విషయం ఎంత భూమి అవసరమవుతుందో తెలుసుకునేందుకు శుక్రవారం సర్వేయర్‌తో సర్వే చేయిస్తామని తహసీల్దార్ శేషు చెప్పారు. రైతులు తాము మిర్చి సాగు చేస్తామని, 400 ఎకరాల్లో 120 మంది రైతులు సాగుచేస్తున్నారని, సంవత్సరం పాటు ఆ పొలాలు సాగు చేయకుండా ఖాళీగా ఉంచితే తమ జీవనం సాగదని, తదనుగుణంగా పరిహారం లెక్కించాలని కోరారు.



కామయ్యతోపుకు సమీపంలో ఒక బార్ వద్ద బహిరంగంగా మద్యం విక్రయిస్తున్న సిబ్బంది

బార్లు.. బార్లా!

» పెనమలూరులో 24 గంటలూ అందుబాటులో మద్యం

» ఉదయం పనులకు వెళ్లే కూలీలే లక్ష్యం

» పోలీసు, అబ్కారీ అధికారులకు రూ.20వేల పైనే నెలవారీ మామూళ్లు

పెనమలూరు : మండలంలో ప్రభుత్వ బార్లు నిత్యం మందుబాబులను దోపిడీ చేస్తున్నాయి. ఇక్కడ రోజువారీ కూలీలే లక్ష్యంగా 24 గంటలూ మద్యం విక్రయాలు చేస్తూ మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారు. క్వార్టరుకు రూ. 70 నుంచి రూ. 80 వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. అక్రమ విక్రయాలను నియంత్రించాల్సిన పోలీసు, అబ్కారీ అధికారులు మామూళ్ల మత్తులో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంతో మద్యం అమ్మకాలు మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.

రోజువారీ కూలీలే లక్ష్యంగా..

రోజూ ఉదయం పనులకు వెళ్లే కూలీలకు మద్యం అందుబాటులో ఉండటంతో వారు మద్యం సేవించి వెళ్లడం పరిపాటిగా మారింది. కామయ్య తోపు వద్ద ఉన్న బార్, వందడుగుల రోడ్డులో, నిడమానూరు రోడ్డులో బార్ల వద్ద విచ్చలవిడిగా మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. కామయ్యతోపు సమీపంలో బార్ బయట ఉదయం రెండు నుంచి మూడు కౌంటర్లు, పోరంకి నిడమానూరు రోడ్డులోని ఒక బార్ బయట ఏకంగా గోడకు రంధ్రాన్ని ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు.

పోలీసు, అబ్కారీ శాఖకు నెలవారీ మామూళ్లు

మండలంలో ప్రతి బారు నుంచి స్థానిక పోలీసు స్టేషన్, అబ్కారీశాఖకు ప్రతి నెలా ఇరవై వేలకు పైగా మామూళ్లు ఇస్తున్నా.. అధికారుల వేధింపులు ఏమాత్రం తగ్గడం లేదని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక బార్ యజమాని పేర్కొన్నారు. మండలంలో పదికి పైగా బార్లలో 24గంటలూ మద్యం విక్రయాల అనుమతుల విషయంలో పెనమలూరు స్టేషనుకు రెండు లక్షలు, అబ్కారీ శాఖ అధికారులకు రెండు లక్షలకు తగ్గకుండా అధిక మొత్తాల్లో చెల్లించాల్సి రావడంతో తమకు అన్నివేళలా మద్యం విక్రయాలు చేయాల్సిన పరిస్థితి ఉందని వాపోయాడు. ప్రజల జేబుకు చిల్లు పెడుతున్న బార్ల యాజమాన్యాలకు ముకుతాడు వేయడంతోపాటు సంబంధిత లంచావతార అధికారులకు ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.



నిడమానూరు రోడ్డులో ఒక బార్ గోడకు ఏర్పాటు చేసిన రంధ్రం ద్వారా విక్రయాలు



తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాదేవి

పోలీసుల నిర్లక్ష్యం..

వివాహితకు ప్రాణ సంకటం!

» 100కు ఫోన్ చేసినా ఫలితం శూన్యం

గుడివాడ, మే 22 : తనకు ప్రాణహాని ఉందని, భర్తే తనపై దాడి చేయడానికి వచ్చాడని 100కు పలుమార్లు ఫోన్ చేసినా పోలీసుల నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగా వివాహిత చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పలుమార్లు రెక్కీ నిర్వహిస్తున్నాడని, ప్రాణహాని ఉందని గోడు వెల్లబోసుకున్నా పోలీసులు పట్టించుకోలేదని, కనీసం నిందితుడిని స్టేషన్‌కు పిలిపించి, కౌన్సిలింగ్ కూడా యివ్వలేదని.. సకాలంలో స్పందించి ఉంటే హత్యాయత్నం జరిగి ఉండేది కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. స్థానిక ముబారక్ సెంటర్‌లో మరీదు నాగరాజు, దుర్గాదేవిలు నివాసముండే వారు. వారికి ఇద్దరు పిల్లలు. అనంతరకాలంలో భార్యపై భర్త నాగరాజుకు అనుమానం కలిగిన నాటి నుంచి ద్వేషం పెంచుకున్నాడు. భర్త పెట్టే హింసను భరించలేక 2017లోనే ఒన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉంది. రెండేళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు మరింత పెరగడంతో విడివిడిగా ఉంటున్నారు. దీంతో దుర్గాదేవి గుడివాడ మండలం మల్లాయిపాలెంలోని జగనన్న కాలనీలో ఇద్దరు పిల్లలతో జీవిస్తోంది. నాగరాజు కుందేరులో ఉంటున్నాడు. భర్త నాగరాజు నుంచి తనకు ప్రాణ హాని ఉందని దుర్గాదేవి పలుమార్లు పోలీసులను ఆశ్రయించింది. భారాభర్తల గొడవ, పైగా కోర్టులో ఉండటంతో పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. ఇటీవల కాలనీలోకి నాగరాజు పలుమార్లు వచ్చి వెళ్లాడని సమాచారం. ఇటీవల కత్తి పట్టుకుని తిరుగుతున్నాడని, స్థానికులు దుర్గాదేవి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అప్రమత్తమైన దుర్గాదేవి 100కు ఫోన్ చేసింది. రాత్రి కాలనీకి వచ్చిన తాలుకా పోలీసులు మరోసారి వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పి వెళ్లారు. బుధవారం ఉదయం 7.45 గంటల సమయంలో పిల్లలకు టిఫిన్ నిమిత్తం బయటకు వచ్చిన దుర్గాదేవిపై నాగరాజు కత్తితో దాడి చేశాడు. కుడి చెయ్యి అడ్డు పెట్టడంతో తీవ్ర గాయమైంది. చెవి పక్కన కత్తి గాయమైంది. దీంతో దుర్గాదేవి కేకలు వేయడంతో స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఎలాగోలా అక్కడి నుండి నాగరాజు తప్పించుకున్నాడు. తీవ్ర గాయాలైన దుర్గాదేవిని స్థానికులు 108 వాహనంలో గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలుకా పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. కనీసం నిందితుడిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ యిచ్చిన దాఖలాలు లేకపోవడం, నాగరాజు కదలికలపై నిఘా పెట్టిన సందర్భాలు లేకపోవడంతో మరింత రెచ్చిపోయాడు. పోలీసులు నిర్లక్ష్యం, వైఫల్యంతో వివాహిత చావు బతుకుల మధ్య కొట్టిమిట్టాడుతోంది.

రాజకీయాలకు అతీతంగా పాడిరైతు అభివృద్ధికి కృషి

» కృష్ణామిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, మే 22 : రాజకీయాలకు అతీతంగా సమష్టి కృషితో పనిచేయడం వల్లే పాడి రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వగలుగుతున్నామని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. డెయిరీ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు పదవి చేపట్టి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదారుల సంఘాలు, పాడి రైతుల ఆధ్వర్యంలో స్థానిక కాకాని కల్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించారు. చలసాని ఆంజనేయులును శాలువా, గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ, దివంగత ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగాలు తనకు స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్టీఆర్ కృషిఫలితంగా ఈరోజు పాడి రైతులకు గిట్టుబాటు ధర అందుతోందన్నారు. గ్రామాల్లో పాడి పశువులను పెంచే రైతులు, సంఘాల నుంచి మార్కెటింగ్ సిబ్బంది వరకు అహర్నిశలు కష్టపడి పనిచేయడంతో ఇది సాధ్యపడిందన్నారు. వీరవల్లిలో కోట్లాది రూపాయలు వ్యయంతో మరో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసుకోగలిగామన్నారు. ఇదే సహకారంతో మున్ముందు యూనియన్‌ను మరింత అభివృద్ధిపథంలో నడిపించేలా సమష్టి కృషి చేద్దామని చలసాని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, డైరక్టర్లు యెర్నేని సీతాదేవి, దాసరి వెంకట బాలవర్ధనరావు, చలసాని చక్రపాణి, బొడ్డు రామచంద్రరావు, బోయపాటి సుశీల, నెక్కలపు వాణిశ్రీ, వేమూరి సాయి, అంజిరెడ్డి, కొండలరావు, ట్రస్ట్ బోర్డు డైరక్టర్ పిన్నిమనేని లక్ష్మీప్రసాద్, హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ వాగంటి హరిబాబు పాల్గొన్నారు. సంఘాల అధ్యక్షులు, పీడ్ కమిటీ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు, పలువురు స్థానిక రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు, సిబ్బంది చలసానిని ఘనంగా సత్కరించి అభినందించారు.



అభినందన సభలో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు



బాస్కెట్‌బాల్ టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు

ఉత్కంఠగా బాస్కెట్‌బాల్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, మే 22 : నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఏపీ యూత్ అంతర్ జిల్లాల(రాష్ట్రస్థాయి)బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు రెండోరోజు ఉత్కంఠగా సాగాయి. లీగ్ మ్యాచ్‌ల్లో బాలికల విభాగంలో చిత్తూరు-వైజాగ్‌పై 36-28, అనంతపురం-గుంటూరుపై 44-30, తూర్పుగోదావరి-కడపపై 33-04, కృష్ణా -పశ్చిమగోదావరిపై 34-21, పశ్చిమగోదావరి-శ్రీకాకుళంపై 46-08, తూర్పుగోదావరి-గుంటూరుపై 43-09, అనంతపురం-కడపపై 27-06 తేడాతో విజయం సాధించాయి.

బాలుర విభాగంలో కర్నూల్-అనంతపురంపై44-41, వైజాగ్-గుంటూరుపై 42-22, పశ్చిమగోదావరి-చిత్తూరుపై 40-21, నెల్లూరు-శ్రీకాకుళంపై 55-46, కృష్ణా-చిత్తూరుపై 65-31, తూర్పుగోదావరి-గుంటూరుపై 43-09, వైజాగ్-నెల్లూరుపై43-04 తేడాతో విజయం సాధించాయి.

బడులు తెరిచే నాటికే పుస్తకాలు!

» యూనిఫాం, బ్యాగులూ ముందే పంపిణీ : సీఎస్

» పాఠశాలల పునఃప్రారంభంపై అధికారులతో సమీక్ష

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరంలో బడులు తెరవక ముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి(సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం సన్నద్ధత, పాఠశాలల పునఃప్రారంభంపై బుధవారం సచివాలయంలో విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు సకాలంలో స్టాక్ పాయింట్లకు చేరాలని ఆదేశించారు. 12న పాఠశాలలు తెరుచుకుంటాయని, 10వ తేదీ నాటికే విద్యార్థులకు పుస్తకాలు, ఇతర వస్తువులు అందజేస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. ఇప్పటికే 82శాతం పుస్తకాలు స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో మొత్తం 70,42,012 మంది విద్యార్థులుంటారని, వారిలో 36,54,539 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని చెప్పారు.

నలుగురు పౌరసరఫరాల డీఎంలకు మెమోలు

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల పౌరసరఫరాల మేనేజర్లకు మెమోలు జారీ అయ్యాయి. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పెండింగ్ సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ను భారత ఆహార సంస్థకు డెలివరీ చేయని కారణంగా ఈ నలుగురికీ పౌరసరఫరాల కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ జి.వీరపాండ్యన్ మెమోలు జారీ చేశారు. సీఎంఆర్‌ను డెలివరీ చేయడానికి ఈ నెలాఖరు వరకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, గడువులోగా సీఎంఆర్‌ను పూర్తి చేసేందుకు రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాలని, స్టాక్ అందుబాటులో లేకపోతే.. వెంటనే రికవరీ చేయాలని స్పష్టంచేశారు. టెలికాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నా ఆయా జిల్లాల్లో పరిస్థితి ఏమాత్రం మెరుగుపడకపోవడానికి ప్రణాళిక లోపమే కారణమన్నారు. దీనిపై ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



నిందితులతో పోలీసు అధికారులు

దివ్యాంగురాలిపై లైంగికదాడి కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

కంకిపాడు, మే 22 : దివ్యాంగురాలిపై లైంగికదాడి ఘటనలో నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దావులూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడిన గ్రామానికి చెందిన నల్లమోటు వేదాంత రాజు, చాట్ల జోజి బాబు, కొండేటి పెద్ది రాజును అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించినట్టు సీఐ తెలియజేశారు.

సాగు.. సాగేనా!

» ఏనుగులకోడు డ్రెయిన్‌పై సాగునీటి తూములు శిథిలం

» వేయి ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం

» ఏడాది నుంచి చర్యలు శూన్యం

» నీరంతా ఏనుగులకోడు డ్రెయిన్ పాలు

» బోర్లు, వర్షాలపైనే ఆధారపడాల్సిన దుస్థితి

సాగునీటి రంగాన్ని పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనడానికి ఏనుగుల కోడు డ్రెయిన్‌పై శిథిలమైన తూములే నిలువెత్తు సాక్ష్యం. సంబంధిత అధికారులు అంచనాలు తయారుచేసి పంపినా నిధులు మంజూరు కాక రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే పరిస్థితి దాపురించింది. తోట్లవల్లూరులో బందరు కాలువ నుంచి ఏనుగులకోడు డ్రెయిన్‌పై వ్యవసాయ భూములకు సాగు నీరందించాల్సిన తూములు ఏడాది క్రితం ధ్వంసమయ్యాయి. ఖరీఫ్ సమయం దగ్గర పడుతున్నా తూముల పునర్నిర్మాణ ఊసే లేకపోవటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు కనకదుర్గమ్మ కాలనీ వెనుక వైపు గల చిల్లడొంక వెంట వెయ్యి ఎకరాల్లో వరి, చెరకు సాగుకు బోర్లు, వర్షాలపైనే రైతులు ఆధారపడేవారు. పక్కనే బందరు కాలువ ఉన్నా సాగునీరందని పరిస్థితిని నివారించేందుకు సుమారు 30 సంవత్సరాల క్రితం ఇరిగేషన్‌శాఖ తూములు నిర్మించింది. బందరు కాలువ కట్టను తవ్వి ఏనుగుల కోడు డ్రెయిన్‌పై చిల్లడొంక పంట కాలువలోకి నీరు వచ్చేలా తూముల నిర్మాణం జరిగింది. ఈ తూముల నిర్మాణంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయి. అయితే మూడేళ్ల నుంచి బలహీనపడిన తూములు గతేడాది విరిగి ఏనుగులకోడు డ్రెయిన్‌లో పడిపోయాయి. దీంతో గతేడాది బందరు కాలువ నుంచి వచ్చే నీరు విరిగిన తూము నుంచి ఏనుగుల కోడు డ్రెయిన్‌లో వృధాగా కలుస్తోంది. ఈ విషయాన్ని ఏడాది క్రితమే రైతులు అధికారులకు తెలియజేశారు. ఈ వేసవిలో తూముల పునర్నిర్మాణం చేపడతారని రైతులు ఎదురు చూసినా ఫలితం లేకుండా ఉంది. బోర్లు ఉన్న రైతులు నారుమడులు పోసుకుని సకాలంలో వరినాట్లు వేసుకునే పరిస్థితి నెలకొంది. విగతా రైతులు వర్షాలపై ఆధారపడి నాట్లు వేసుకోవాలి. కాలువలకు జూన్‌లో సాగు నీరు విడుదలయ్యే అవకాశం ఉండగా.. కాలువలకు నీరొస్తే నిధులు మంజూరైనా తూముల నిర్మాణం సాధ్యమయ్యే పనికాదని రైతులు చెపుతున్నారు. ఇది రైతులకు శాపం కానుందంటున్నారు. సాగునీరు మురుగులో కలిసిపోతుందన్నారు.



చిల్లడొంక వెంట బందరు కాలువ సాగు భూములు





ఏనుగులకోడు డ్రెయిన్‌పై విరిగిపోయిన తూములు

వర్షాలే ఆధారం..



- ఈడ్పుగంటి డేవిడ్‌రాజు, రైతు

చిల్లడొంక ఏరియాలో అరెకరం పొలం ఉంది. బోరు లేనందున వరినాట్లకు కాలువ ద్వారా వచ్చే సాగునీరే ఆధారం. బందరు కాలువ నుంచి వచ్చే సాగునీటి తూములు విరిగిపోవటంతో ఈ ఏడాది వర్షాలపైనే ఆధారపడాల్సి ఉంది. తూములను పునర్నిర్మించటంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

నిధులు మంజూరు కాలేదు.

- వీరాంజనేయులు, ఇరిగేషన్ జేఈ

విరిగిపోయిన తూములను చూసి ఇరిగేషన్ వర్క్‌లకు అంచనాలు తయారుచేసి పంపాం. కాని నిధులు మంజూరు కాలేదు. దాంతో తూములు పునర్నించలేకపోయాం. నిధులు మంజూరైన వెంటనే తూముల నిర్మాణం చేపడతాం.

ఘనంగా రాజా రామ్మోహన్ రాయ్ జయంతి



గవర్నర్‌పేట, మే 22: ఎంజీ రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో బుధవారం సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు రామ్మోహన్ రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు సతీసహగమనమనే సాంఘిక దురాచారాన్ని రూపుమాపడంలో రామ్మోహన్ రాయ్ చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, సభ్యులు నాగభూషణం, మాధవరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ప్రధాన ఆలయ శిఖర స్వర్ణతాపడానికి విరాళం



వన్‌టౌన్, మే 22: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ప్రధాన ఆలయ శిఖర స్వర్ణతాపడానికి విజయవాడ సూర్యారావుపేటకు చెందిన రెండుచింతల సత్యనారాయణ బుధవారం విరాళాల విభాగంలో రూ. 1.40 లక్షలు విరాళం అందించారు. ఈవో రామరావును కలిసి ఆమేరకు చెక్కు అందించారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.





కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా టిఫిన్ బండ్లు, సర్వీసు రోడ్డులో నిలిపిన ప్రైవేట్ అంబులెన్స్‌లు, ఉచిత భోజనం కోసం రోడ్డు మీదే నిలబడ్డ రోగులు, బంధువులు

ఆక్రమణల చెరలో..

- జీజీహెచ్ సర్వీస్ రోడ్డులో షాపులు, టిఫిన్ బండ్లు, కొబ్బరి బొండాల కొట్లు
- రోడ్డు పొడవునా నిలిపిన ప్రైవేట్ అంబులెన్స్‌లు
- నిత్యం ట్రాఫిక్‌తో అస్తవ్యస్తం

పటమట, మే 22 : ఆక్రమణలతో కొత్త గవర్నమెంట్ ఆస్పత్రి పరిసరాలు నిత్యం ట్రాఫిక్‌తో అస్తవ్యస్తంగా ఉంటోంది. కొత్త గవర్నమెంట్ ఆసుపత్రి ఫీడర్ రోడ్డులో రెండువైపులా షాపులు, కొబ్బరి బొండాల కొట్లు, టిఫిన్ బండ్లు రోడ్డును ఆక్రమించి ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెడికల్ కాలేజి వరకు ప్రైవేట్ అంబులెన్స్‌లు రోడ్డు పొడవునా నిలిపి ఉంచడంతో ప్రతి రోజు ఆ రోడ్డులో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఒక్కొక్కరోజు దాతలు హాస్పిటల్‌లో రోగులకు, వారి సహాయకులకు ఉచిత భోజనం పెడుతున్నారు. వీరు తమ వాహనాలను హాస్పిటల్ బయట ఉంచి ఉచిత అన్నదానం నిర్వహించడంతో రోగులు, వారి బంధువుల క్యూలైన్లు రోడ్డు మీదకు రావడంతో ట్రాఫిక్ మరింత జటిలం అవుతోంది. దీనికి తోడు హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ముందు నుంచి మార్చురీ రూమ్ వరకు ద్విచక్ర వాహనాలుదారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులను హాస్పిటల్ లోపలి వైపునకు తీసుకెళ్లే అత్యవసర అంబులెన్స్‌లకు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గవర్నమెంట్ హాస్పిటల్ వైపు నుంచి రామవరప్పాడు వెళ్లే ప్రధాన రహదారి జామ్ అయినప్పుడు ప్రత్యామ్నాయంగా కొత్త గవర్నమెంట్ ఆసుపత్రి సర్వీసు రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి సర్వీసు రోడ్డులో ఆక్రమణదారుల షాపుల, ప్రైవేట్ అంబులెన్సుల నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ నిరంతరం జామ్ అవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి సర్వీసు రోడ్డును ఆక్రమణదారుల చెర నుంచి విముక్తి కలిగించి, ట్రాఫిక్ కష్టాలను తొలగించాలని ఆ ప్రాంత వాసులు, రోగులు కోరుతున్నారు.

డ్రెయినేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలి

జాతీయ రహదారి డ్రెయినేజీ సమస్యపై జరిగిన సమావేశంలో కలెక్టర్ ఆదేశం

కృష్ణలంక, మే 22 : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ మార్గంలో డ్రెయినేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఢిల్లీరావు నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్‌ఏఐ, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ ఢిల్లీరావు ఆయన చాంబర్‌లో జాతీయ రహదారి డ్రెయినేజీ సమస్యపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడ -మచిలీపట్నం జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65లో బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ మార్గంలో సరైన డ్రెయినేజీ లేకపోవడం వలన రెండు కిలోమీటర్ల వరకు సుమారు 4 నుంచి 5 ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వర్షపు నీరు జాతీయ రహదారిపై నిల్వ ఉండడం వలన నగరం మీదుగా వెళ్లే వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు అనేకం జరిగాయన్నారు. శాశ్వత పరిష్కారం దిశగా నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు త్వరితగతిన పనులు చేపట్టి పరిష్కరించాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని యుద్ధప్రాతిపదికన ఏ ఒక్కరికి నష్టం కలగకుండా నిబంధనల మేరకు పనులను పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణరెడ్డి, విజయవాడ ఆర్డీవో సిహెచ్.భవానీశంకర్, నగరపాలక సంస్థ ఈఈ చంద్రశేఖర్, సిటీప్లానర్ జూబిన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటమటలో పోలీసుల కవాతు

పటమట, మే 22 : ఎన్నికల పోలింగ్ అనంతరం ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా నగరంలో శాంతి భద్రతలు కాపాడే ఉద్దేశ్యంతో పటమట ఎస్‌ఐలు వల్లీపద్మ, సతీష్‌కుమార్‌లు బుధవారం సాయంత్రం పటమట వీధుల్లో తమ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు.

భవానీపురం పోలీసుల పెట్రోలింగ్



విద్యాధరపురం: భవానీపురం పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అవుట్ ఏజెన్సీలో పెట్రోలింగ్ నిర్వహించారు. సీఐగా కొత్తగా వచ్చిన ప్రసాద్ శాంతి భద్రతలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా ఎటువంటి గొడవలు చేయవద్దని, విద్వేషాలకు లోను కావద్దని, అరాచకాలకు పాల్పడవద్దని తెలిపారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

ధర్మపథం వేదికపై దక్షయజ్ఞం హరికథాగానం

వన్‌టౌన్, మే 22: దుర్గగుడి ధర్మపథం వేదికపై బుధవారం సాయంత్రం తెల్లాకుల వీర వెంకటేశ్వర గుప్త శిష్యురాలు బెజ్జంకి నాగమణి భాగవతారిణి దక్షయజ్ఞం హరికథాగానం చేశారు. దక్షయజ్ఞంలోని ఘట్టాలను చక్కటి హావ భావాలతో వివరించి భక్తులను ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై చావలి శ్రీనివాసరావు, మృదంగంపై లక్ష్మీనారాయణ సహకరించారు.

రేపు, ఎల్లుండి చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శుక్ర, శనివారాలలో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు తుమ్మలపల్లివారి క్షేత్రయ కళాక్షేత్రంలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమాలు జరుగుతాయని ఈవో రామరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు గిరిప్రదక్షిణ

వైశాఖ పూర్ణిమ సందర్భంగా గురువారం ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డు వద్ద నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు.



వేటూరికి నివాళులర్పిస్తున్న గోళ్ల నారాయణరావు, జయంతి చక్రవర్తి, గణపతి తదితరులు

వేటూరికి పుష్పాంజలి

విజయవాడ కల్చరల్, మే 22 : జీఆర్ పోలవరపు సాంస్కృతిక సమితి, గీతాంజలి మ్యూజికల్స్, వేద గంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ సినీ గేయ రచయిత డాక్టర్ వేటూరి సుందరరామ్మూర్తికి పుష్పాంజలి కార్యక్రమం జరిగింది. వేటూరి 14వ వర్ధంతిని పురస్కరించుకొని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో స్థాపించిన వేటూరి కాంస్య విగ్రహం వద్ద వేటూరి అభిమానులు, కళాసంస్థల అధినేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంతవరకు వేటూరి పాట అజరామరంగా వెలుగొందుతూనే వుంటుందని అన్నారు. డాక్టర్ దామోదర గణపతిరావు, చావా నర్సింహారావు, జి.శ్రీనివాస్, చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్, యాకోబ్ పాల్గొన్నారు.

యజమానిని కొట్టి కారును అపహరించిన గుర్తుతెలియని దుండగులు

విద్యాధరపురం, మే 22: బబ్బూరి గ్రౌండ్ సమీపంలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కారు యాజమాని జోగి వెంకటేశ్వరరావును కొట్టి కారు అపహరించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మహానాడులో జోగి వెంకటేశ్వరరావు భార్య, కుమారుడు, కుమార్తెతో ఉంటున్నాడు. ఇతను ఏపీ 16టీఎల్0933 నెంబరు గల టయోట కారును కొని అతనే డ్రైవర్‌గా కిరాయిలకు వెళుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటలకు కిరాయికి కారులో భవానీపురం తీసుకువచ్చి వారిని దించి బబ్బూరి గ్రౌండ్ వైపు బయలుదేరాడు. గుర్తు తెలియని ఇద్దరు యువకులు వెంకటేశ్వరరావు కారుకు అడ్డంగా వెళ్లి కారు ఆపారు. ఎందుకు ఆపారని వెంకటేశ్వరరావు ప్రశ్నించగా వారిద్దరూ కారులో ఉన్న బాధితుడిని కిందకు లాగి చేతులతో మొహంపై కొట్టారు. అనంతరం కారును తీసుకువెళ్లిపోయారు. బాధితుడు తన వద్ద సెల్‌ఫోన్ ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం తెలియజేశాడు. కుటుంబసభ్యులు ఘటనా ప్రాంతానికి వెళ్లి బాధితుడిని మణిపాల్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

చిత్తరంజన్‌శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు



సత్యనారాయణపురం, మే 22: విద్యార్థి దశ నుంచే విజ్ఞానంపై జిజ్ఞాస పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్ అన్నారు. సత్యనారాయణపురం చిత్తరంజన్‌శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పద్యాలు, శ్లోకాలు, నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లీషు, మెథమెటిక్స్ ట్రిక్స్, హెడ్ అండ్ షోల్డర్స్ ఎక్సర్‌సైజ్‌లలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో రూ.50 డిపాజిట్ కడితే ఒక కథల పుస్తకం ఇంటికి తీసుకు వెళ్లి చదువుకోవచ్చునన్నారు. ప్రతీ ఒక్కరూ రోజూ గంట సేపు పుస్తకాలను చదవాలన్నారు. సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని అన్నారు. విశ్రాంత బ్యాంక్ మేనేజర్ సుబ్బన్న, విశ్రాంత లెక్చరర్ బి.సావిత్రి, ఉపాధ్యాయురాలు కనకదుర్గలు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

సత్యనారాయణపురం, మే 22: కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్యాస్ వినియోగదారుడికి ఉచితంగా ఈకేవైసీ, సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ చేస్తున్నామని, వినియోగదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని హెచ్‌పీ గ్యాస్ సింగ్‌నగర్ డిస్ట్రిబ్యూటర్ శ్రీభవ్య కోరారు. అజిత్‌సింగ్‌నగర్ నూజివీడు రహదారిలోని ఆ కంపెనీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హెచ్‌పీగ్యాస్ ఏజెన్సీ పరిధిలోని ప్రతి వినియోగదారుడి ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్‌కు వచ్చే పైపును పరిశీలించి ఉచితంగా ఈకేవైసీ చేయడం జరుగుతుందన్నారు. జూన్ 30లోగా వీటిని చేయించుకోవాలని లేని పక్షంలో గ్యాస్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఈ ఫోన్ నెంబర్లు 0866-2401234, 9492339494లో సంప్రదించాలన్నారు.

జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన, సంరక్షణ



మొగల్రాజపురం, మే 22: ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల జంతు వృక్ష శాస్త్ర విభాగాల అధ్వర్యంలో జీవ వైవిధ్యం మీద విద్యార్థులకు అవగాహన, సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ అంతరించిపోయే జాతులను కాపాడుకోకుంటే ప్రపంచ ప్రాణికోటి మనుగడకు ప్రమాదం ఉన్నట్టేనని అన్నారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వివిధ మొక్కలు, వృక్షాలు, జంతువులు, కీటకాలు, శిలాజాలు, పక్షుల లక్షణాలను క్యూఆర్ కోడ్ ద్వారా గుర్తించే ప్రాజెక్టును విద్యార్థులు చేపట్టడం అభినందనీయం అన్నారు. ప్రాజెక్టులో భాగంగా బీఎస్సీ బోటనీ, జువాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వివిధ రకాల శిలాజాలను భద్రపరిచారు. వీటి సమాచారాన్ని ఒక కోడ్ రూపంలో రూపొందించి చరవాణిలో అన్వేషించడానికి వీలుగా రూపొందించారని వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. శ్రీనివాసరావు చెప్పారు. ప్రాజెక్టు మార్గదర్శకులుగా వ్యవహరించిన బోటనీ, జువాలజీ అధ్యాపకులు జి.శ్రావణి, డాక్టర్ సాంబనాయక్, సీహెచ్ శిరీషలను సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు అభినందించారు.

కనకదుర్గానగర్‌లో షాపుల తొలగింపు

- ఒక షాపు లీజుదారులు అడ్డగింత
- ఈఈ రమాదేవిపై అసభ్యకర పదజాలం
- పోలీసులకు ఫిర్యాదు



వన్‌టౌన్, మే 22: కనకదుర్గానగర్‌లో లీజులకు నడుస్తున్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం షాపులను బుధవారం తొలగించారు. కనకదుర్గానగర్‌లో దేవస్థానం పలు అభివృద్ధి పనులను చేపట్టింది. పనులకు అడ్డుగా ఉన్న 24 షాపుల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నుంచి చేపట్టారు. షాపులను తొలగిస్తున్న సమయంలో ఒక షాపు లీజుదారులైన మహిళలు దేవస్థానం ఈఈ లింగం రమాదేవిపై పరుష పదాలను వాడారు. తొలగింపు కార్యక్రమానికి అడ్డుపడి తమకు కోర్టు ఉత్తర్వులు ఉన్నాయంటూ నానా హంగామా చేశారు. దీనిపై ఈఈ రమాదేవి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన ప్రదేశానికి వచ్చి షాపుల తొలగింపునకు అడ్డుపడిన మహిళలను మందలించారు. అనంతరం పోలీసుల సమక్షంలో ఖాళీగా ఉన్న షాపులను తొలగించారు. గురువారం మిగతా షాపులను తొలగించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, మే 22: జమ్మిచెట్టు ఫీడర్ పరిధి మొగల్రాజపురం సెక్షన్‌లో విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్ పరిధిలోని బాడవపేట మొత్తం ఏరియా, జాన్‌స్ట్రీట్, జక్రయ్యవీధి, ఎల్లాటి ఆంజనేయులు వీధి, కార్వే ఆఫీసు ప్రాంతం, వాటర్ ట్యాంక్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



కల్కి... నాకు చాలా లక్కీ

ప్రభాస్

"కల్కి 2898 ఏడి' చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మా బక్క డైరెక్టర్ (నాగ్ అశ్విన్) బుజ్జితో నన్ను మూడేళ్లు టార్చర్ పెట్టాడు. బుజ్జి (కారు) బ్రెయిన్ చిన్నదైనా నా బుర్రంతా తినేసింది. ఈ సినిమాలో బుజ్జి, భైరవ, నాగ్ అశ్విన్ ప్రతిభ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది' అని ప్రభాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి అగ్రతారలతో రూపొందుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడి'. దీపికా పదుకొనే కథానాయిక. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. జూన్ 27న ఈ చిత్రం విడుదలవుతోంది. భారీ ఖర్చుతో తెరకెక్కిన ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను కూడా వినూత్నంగా భారీతనం ఉట్టిపడేలా నాగ్ అశ్విన్ నేతృత్వంలో చిత్రబృందం నిర్వహిస్తోంది. బుధవారం 'కల్కి' చిత్రబృందం హైదరాబాద్‌లో 'క్యూట్ స్టార్ బుజ్జి' అనే కారును పరిచయం చేస్తూ బుజ్జి వర్సెస్ భైరవ పేరుతో భారీ ఈవెంట్‌ను నిర్వహించింది. చిత్రబృందంతో పాటు ప్రభాస్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుజ్జి కారును నడుపుతూ ప్రభాస్ సందడి చేశారు. దీనికి సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'నేను చాలా లక్కీ. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి దిగ్గజాలతో నటించే అవకాశాన్ని 'కల్కి' నాకు ఇచ్చింది. కమల్‌సార్‌కి వంద దండాలు. ఇండియా గర్వించే నటుడు అమితాబ్. ఆయన స్ఫూర్తితోనే చాలామంది సినిమాల్లోకి వచ్చారు. 'సాగరసంగమం' చిత్రంలో కమల్‌హాసన్‌ను చూసి ఆయన వేసుకున్న దుస్తులు లాంటివి, కుట్టించుకొని వేసుకున్నాను. ఆ సినిమాలోని ఓ పాటలో ఆయన తలను లయబద్ధంగా ఊపే నాట్య భంగిమ చూసి నేను కూడా అలా చేయాలని ప్రయత్నించాను. దీపిక లాంటి ఇంటర్నేషనల్ స్టార్ ఈ సినిమాలో ఉండడం సంతోషం. దిశా అద్భుతమైన నటి. అశ్వనీదత్ గారు ఈ వయసులోనూ చాలా కష్టపడుతున్నారు. ఆయన ప్యాషన్ చూసి చాలా నేర్చుకోవాలి. సినిమా గ్రాండ్‌గా రావడానికి ఖర్చుకు వెనుకాడ లేదు. నిర్మాతగా 50 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో ఉన్నది బహుశా ఆయనొక్కరే. మొదటి చిత్రాన్నే ఎన్టీఆర్‌తో చేశారంటేనే ఆయన రేంజ్ తెలుస్తుంది. వారి కూతుళ్లు స్వప్న, ప్రియాంక గారికి సైతం అదే ప్యాషన్, తెగింపు వచ్చాయి. వారిని చూసి ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని మా చెల్లెళ్లకు చెబుతుంటాను' అన్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'బుజ్జి... పేరు చిన్నగా అనిపిస్తుంది గానీ, అది చేసే పని మాత్రం మామూలుగా ఉండదు. ఈ సినిమాలో బుజ్జి చాలా స్పెషల్. ఇలాంటి కార్‌ను ఇంజనీరింగ్ చేయడం చాలా కష్టం. ఒక కొత్త తరహా కారు తయారు చేయాలంటే పెద్ద టీమ్ ఉండాలి. ఆనంద్ మహీంద్రా గారు ఆ టీమ్‌ను పంపడం వల్లే బుజ్జి అనే కల సాకారమైంది. దీని తయారీలో మా టీమ్ కూడా చాలా కష్టపడింది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ "కల్కి' సినిమా గురించి ఒక్కటే మాట చెబుతాను. ఇది రిలీజయ్యేంత వరకూ చిన్న సినిమా. రిలీజయ్యాక చాలా పెద్ద సినిమా' అని అంచనాలు మరింత పెంచారు.

ఇకపై థియేటర్లకు పర్సంటేజ్ చెల్లించాల్సిందే



ఇతర రాష్ట్రాల తరహాలో నిర్మాతలు పర్సంటేజీ చెల్లించాలనీ, ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించమని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నష్టాలను తట్టుకోలేక . పదేళ్ల కాలంలో దాదాపు రెండు వేల సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూత పడ్డాయని ఆయన వెల్లడించారు.. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లు, ఎగ్జిబిటర్ల సమస్యలపై ఇటీవల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, పలువురు పంపిణీదారులు, నిర్మాతలు, ఎగ్జిబిటర్స్‌తో సమావేశమై ఎగ్జిబిటర్స్‌కు వాటాలపై కొన్ని ప్రతిపాదనలు తయారు చేశాం. దీనిపై నిర్మాతలకు జులై ఒకటి వరకూ గడువు ఇస్తున్నాం. అయితే 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', 'గేమ్ ఛేంజర్, 'భారతీయుడు 2' చిత్రాలకు మినహాయింపు ఇస్తున్నాం. ఇతర సినిమాలను పర్సంటేజ్ విధానంలోనే ప్రదర్శిస్తాం. కొంతమంది డిస్ట్రిబ్యూటర్స్ సినిమా వ్యాపారాన్ని జూదంలా మార్చారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు ఆటలు ప్రదర్శించం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి బాలగోవింద రాజ్, రవీంద్ర గోపాల తదితర సభ్యులు పాల్గొన్నారు.



లవ్ మీ.. ఓ డిఫరెంట్ ఫిల్మ్

టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. విడుదల నేపథ్యంలో హీరో ఆశిష్ బుధవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.


● నేను ఇదివరకు చేసిన సినిమాలకు భిన్నంగా డార్క్ తరహాలో నా పాత్ర ఉంటుంది. ఎవరైనా ఓ పని చేయవద్దని చెబితే మొండిగా అదే పని చేసే పాత్ర అది. ఇందులో యూ ట్యూబర్‌గా నటించాను. అతని దగ్గరకి ఓ దెయ్యానికి సంబంధించిన కథ వస్తుంది. అప్పుడు అతని జీవితంలో ఏం జరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు అరుణ్‌తో మాట్లాడి హీరో పాత్ర ఎలా కనిపించాలనుకుంటున్నారో తెలుసుకుని ఆ రకంగా నటించా

● ఈ సినిమాలో ఐదారుగురు హీరోయిన్లు ఉంటారు. అయితే సినిమా మొత్తం వారు కనిపించరు. గెస్ట్‌లా అలా వచ్చి వెళుతుంటారు. ఇందులో వైష్ణవిది దెయ్యం పాత్ర కాదు. దివ్యావతి ఆ పాత్ర పోషించారు. వైష్ణవి మరో కీలక పాత్ర పోషించారు.

● ఇందులో నటించడానికి ముందు 'చంద్రముఖి', 'ముని' వంటి సినిమాలు చాలా చూశాను. ఇందులో హారర్ ఒక భాగం మాత్రమే. మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత ఓ డిఫరెంట్ మూవీ చూశామని ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు.

● దర్శకుడు అరుణ్ నవలా రచయిత. ఈ కథను ఆయన చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. దెయ్యంతో మాట్లాడడం, రొమాన్స్ చేయడం.. వంటి అంశాలు కొత్తగా అనిపించాయి. పీసీ శ్రీరామ్, కీరవాణి వంటి లెజెండ్స్ మా సినిమాకు పని చేయడం అంగీకరించడం మాకు ప్లస్ పాయింట్. దర్శకుడు కథ చెప్పిన విధంగా తీస్తాడా అని ఆలోచించి, మొదట పదిహేను రోజులు షూటింగ్ చేసి, బాగా వచ్చిందంటే ముందుకు వెళదాం .. అనుకున్నాం. ఆ సీన్స్ బాగా రావడంతో ప్రొసీడ్ అయ్యాం.

● ఈ సినిమా తర్వాత సెల్ఫిష్ ఉంటుంది. ఆ తర్వాత సితార బేనర్‌లో ఓ సినిమా చేయబోతున్నా.



మోదీ చిత్రంలో నటించడం లేదు

భారత ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో తను నటించడం లేదని తమిళ నటుడు సత్యరాజ్ స్పష్టం చేశారు. 'ఆ సినిమా గురించి ఇంతవరకూ ఎవరూ నన్ను అడగలేదు. నిరాధారమైన ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో ఆశ్చర్యంగా ఉంది. ఇదంతా సోషల్ మీడియా సృష్టే. ఒకవేళ వారెవరైనా నన్ను అడిగినా ఆ చిత్రం చేయను. నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకోను' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారాయన.

పారిపోయే పిరికిదాన్ని కాదు



'నేను భయంతో పారిపోయే పిరికిదాన్ని కాదు.. నాకు కొంత బ్రీథింగ్ ప్లేస్ కావాలి. అందుకే రెండు రోజుల్లో మీడియా ముందుకు వస్తా. అందరి పని చెప్తా' అన్నారు నటి హేమ. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను పాల్గొనలేదని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆమె మరోసారి స్పష్టం చేశారు. ఈ రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ కూడా ఉన్నారని బెంగళూరు పోలీస్ కమిషనర్ వెల్లడించిన తర్వాత కూడా తను హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ పేర్కొనడం గమనార్హం. రెండు రోజుల నుంచి కొన్ని వందల ఫోన్ కాల్స్‌కు రిప్లయి ఇస్తున్నాననీ, నిజంగా అంత పెద్ద ఇష్యూలో ఉంటే ఫోన్ తన దగ్గర ఎలా ఉంటుంది అని హేమ ప్రశ్నించారు. తన జీవితంతో ఎవరు ఇలా ఆడుకుంటున్నారో, దీని వెనుక ఏ వెధవలు కుట్ర పన్నుతున్నారో కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాననీ, అన్నీ తెలుసుకుని మీడియాకు చెబుతానని ఆమె అన్నారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో నటి హేమ కూడా పాల్గొన్నారనీ, డ్రగ్స్‌తో దొరికారని నటి కరాటే కల్యాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే పోలీసులకు దొరికిపోయి కూడా హేమ ఇంకా బుకాయిస్తున్నారని 'బిగ్‌బాస్'లో పాల్గొన్న తమన్నా సింహాద్రి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను కూడా ఉన్నానంటూ వచ్చిన వార్తలను యాంకర్ శ్యామల ఖండించారు. ఓ పార్టీకి మద్దతు పలికినందుకే తన గురించి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

బరువు తగ్గించే ఆసనాలు

యోగాసనాల అనేక మానసిక శారీరక సమస్యలను తగ్గిస్తాయి. ప్రతి రోజూ కొంచెంసేపు వీటిని సాధన చేయడం వల్ల ఆందోళన తగ్గి విశ్రాంతి లభిస్తుంది. కండరాలు, అంతర్గత అవయవాల పనితీరు మెరుగవడమేకాక, ఆరోగ్యకరమైనరీతిలో బరువు తగ్గడానికి కూడా యోగాసనాలు ఉపయోగ పడతాయి. బరువు తగ్గడానికి సాధన చేయవలసిన ఐదు యోగాసనాలను తెలుసుకుందాం.

వజ్రాసనం

చాలా ఆసనాలకు ఈ ఆసనం మూల భంగిమ. దీన్ని సాధన చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. తొడలు పిరుదుల భాగంలో చేరిన కొవ్వు కరుగుతుంది.

ధనురాసనం

ఈ ఆసనం వంచిన విల్లులా ఉంటుంది. దీన్ని సాధన చేయడం వల్ల పొత్తి కడుపు బిగుతుగా మారి ఆ ప్రాంతంలో పేరుకున్న కొవ్వు కరుగుతుంది.

చతురంగ దండాసనం

చతురంగ దండాసనం చేయడంవల్ల మొత్తం శరీరంలో కదలిక, ఒత్తిడి కలుగుతాయి. ముఖ్యంగా చేతులు, ఛాతీ మరియు పొట్ట ప్రాంతం బిగుసుకు పోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో కొవ్వు కరుగుతుంది.

వీర భద్రాసనం

ఇది యుద్ధానికి సిద్ధమైన యోధుని భంగిమలా ఉంటుంది. దీన్ని సాధన చేసేటపుడు తొడ మరియు తుంటి భాగాలపై ఒత్తిడి పడటంతో, ఆయా ప్రాంతాల్లో పేరుకున్న అధిక కొవ్వు కరుగుతుంది,

సేతు బంధాసనం

ఇది వంతెనలాగా కనిపించే భంగిమ. దీన్ని సాధన చేయడం వల్ల నాడీ వ్యవస్థబలంగా మారుతుంది. వెన్నునొప్పి సయాటికాల నుండి ఉపశమనం లభించడమేకాక నడుము , పిరుదుల చుట్టూ ఉన్న కొవ్వు కరుగుతుంది.



జుట్టు నెరుస్తోందా?

కొందరికి ఎక్కువ వయస్సు ఉండదు.. కానీ జుట్టు మాత్రం తెల్లబడిపోతుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిని తెలుసుకొని జాగ్రత్తలు తీసుకుంటే జుట్టు నెరుపును ఆపేయవచ్చంటున్నారు నిపుణులు. ఆ జాగ్రత్తలేమిటో చూద్దాం.

- విటమిన్ బి, విటమిన్ డీ, విటమిన్ ఈ... ఈ మూడింటి వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. అందువల్ల ఈ మూడు విటమిన్లు ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి. అప్పుడు జుట్టు త్వరగా తెల్లబడదు.
- బ్లీచింగ్ వల్ల జుట్టు త్వరగా నెరిసిపోతుంది. అందువల్ల బ్లీచింగ్ ఉన్న సౌందర్యసాధనాలకు దూరంగా ఉండాలి. అంతే కాకుండా జుట్టును బాగా వేడి చేసే డ్రయ్యర్స్‌కు.. రోలర్లకు దూరంగా ఉండాలి. గాఢమైన రసాయనాలున్న సబ్బులు, షాంపులను వాడకూడదు. వీటితో పాటుగా ఈ కింది పద్ధతులను వాడితే జుట్టు తెల్లబడదు.

నూనెతో: వారానికి కనీసం మూడు సార్లు రాత్రి పడుక్కొనేముందు కొబ్బరినూనెను తలకు పట్టించాలి. ఆ మర్నాడు ఉదయం లేచి గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.



ఉల్లిపాయ: ఒక ఉల్లిపాయను తీసుకొని దానిని మిక్సీలో వేసి బాగా నూరాలి. ఆ రసాన్ని పల్చని బట్టతో వడగట్టాలి. దానిని కుదుళ్లకు పట్టించి అరగంట తర్వాత గోరు వెచ్చని నీటితో కడిగివేయాలి.

కరివేపాకు: కరివేపాకు, పెరుగులను సమపాళ్లలో తీసుకొని మెత్తగా నూరాలి. ఆ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగివేయాలి.

గోధుమగడ్డి: గోధుమగడ్డిని నానబెట్టి దాని నుంచి రసాన్ని తీయాలి. ఆ రసాన్ని జుట్టుకు పట్టించి అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగివేయాలి.



సెక్స్‌వర్కర్ల హక్కుల కోసం మూడు దశాబ్దాలుగా ఉద్యమం సాగిస్తున్నారు తిరుపతికి చెందిన సామాజిక కార్యకర్త మీరా రాఘవేంద్ర. అందుకోసం 'ఉమెన్స్ ఇనీషియేటివ్' సంస్థను నెలకొల్పారు. సెక్స్‌వర్కర్లను అసంఘటిత మహిళా కార్మికులుగా గుర్తించాలన్నది ఆమె ప్రధాన డిమాండ్. మరోవైపు మహిళా రైతులను, కూలీలను సంఘటితం చేసి... వారికి ఆధునిక వ్యవసాయ పద్ధతుల మీద అవగాహన కల్పిస్తున్నారు. "ఈ భూమి మీద ప్రతి మనిషికి సమానమైన గౌరవం దక్కాలన్నదే నా అభిమతం" అంటున్న మీరా తన సుదీర్ఘ సామాజిక, సేవా అనుభవాలను 'నవ్య'తో పంచుకొన్నారు.

మహిళలకు గౌరవం...

చొరవ... చైతన్యంతోనే

"ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, మానవ కల్పిత విపత్తులు ఎదురైనా, కొత్త జబ్బులు ఏవైనా సంక్రమించినా మొట్టమొదట అత్యంత తీవ్రంగా నష్టపోయేది మహిళలు. కాబట్టి ప్రతికూల పరిస్థితులను అవగాహన చేసుకొని, సమస్యల సుడిగుండాల నుంచి బయటకు రావడానికి... మహిళలకు వ్యక్తిగత చైతన్యం అవసరం. అలాంటి చైతన్యం పొందడానికి మనమే చొరవ తీసుకోవాలనీ, మన జీవితాల్ని మనమే కాపాడుకోవాలనీ నేను నమ్ముతాను. ఇదే భావనతో ముప్పై ఏళ్ళ కిందట తిరుపతిలో 'ఉమెన్స్ ఇనీషియేటివ్' స్వచ్ఛంద సంస్థ ప్రారంభించాను. అప్పటినుంచి సెక్స్‌వర్కర్లతో కలిసి వారి హక్కుల కోసం ఉద్యమిస్తున్నాను. పితృస్వామ్య వ్యవస్థలో ఇంటా బయటా మహిళలు ఎదుర్కొనే హింస అంతాఇంతా కాదు. అందులోనూ సెక్స్‌వర్కర్స్ లాంటి వృత్తిలో జీవితాన్ని గడుపుతున్న మహిళలు మరింత హింసను అనుభవించడం, దుర్భర జీవితాన్ని గడపడం కళ్లారా చూస్తూ ఊరుకోలేకపోయాను. అప్పుడప్పుడే హెచ్‌ఐవీ, ఎయిడ్స్ కేసులు ప్రబలుతున్న రోజులవి. దానివల్ల మహిళలు ఎక్కువమంది నష్టపోవడం నన్ను బాధించింది. సెక్స్‌వర్కర్లలోనే కాదు... చిన్నవయసులోనే వివాహమై, భర్తద్వారా ఈ వ్యాధికి గురై, తీవ్ర మనోవ్యథను అనుభవించిన అమ్మాయిలు ఎందరినో చూశాను. ఇదే విషయం మీద రుయా ఆస్పత్రిలో వైద్యుడైన నా భర్త చిత్తూరు ఆనందరావుతో చర్చిస్తే, "హెచ్‌ఐవీ, ఎయిడ్స్ మీద ముఖ్యంగా సెక్స్ వర్కర్లలో అవగాహన పెంచాలి" అని సూచించారు. అలా నా భర్త ప్రోత్సాహంతో 1994 నుంచి సెక్స్‌వర్కర్ల సమస్యల మీద పనిచేస్తున్నాను. సుమారు 12వేలమందికి మా సంస్థ సేవలు అందుతున్నాయి.

నన్ను సొంత అక్కగా భావించి...

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు కండోమ్ వాడకం ఒక్కటే పరిష్కారం కనుక, ఆ విషయంపై సెక్స్‌వర్కర్లకు అవగాహన కల్పించడం మొదలు పెట్టాను. నిరోధ్ ఫొటో ఒకటి చేతపట్టుకొని... రోజూ సాయంత్రం తిరుపతి కోనేరు కట్టమీద వరుసగా కూర్చొన్న సెక్స్‌వర్కర్లు ఒక్కొక్కరి దగ్గరకెళ్లి, "మీ లైంగిక భాగస్వామి తప్పనిసరిగా కండోమ్ వాడేలా చొరవ తీసుకోండి. హెచ్‌ఐవీ బారి నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి" అని చెబుతుంటే... కొందరు మాత్రమే వినేవారు. ఇంకొందరు నన్ను అనుమానంగా చూసి, పక్కకు తప్పుకొనేవారు. అయినా, నా ప్రయత్నం మాత్రం ఆపలేదు. అదే సమయంలో రోడ్డుమీద ఆడుకుంటున్న ఒక సెక్స్ వర్కర్ కొడుకును అకారణంగా పోలీసులు చిల్డ్రన్ హోమ్‌కు తరలించారు. ఆ సంగతి తెలిసి... పోలీసులతో, లాయర్లతో మాట్లాడాను. ఆ పిల్లాడు తిరిగి ఇంటికి చేరేవరకు ఆ తల్లికి నేను అడుగడుగునా అండగా ఉన్నాను. దాంతో ఆమె నన్ను సొంత అక్కగా భావించి, తన జీవితంలోని కష్టాలన్నింటిని నాతో పంచుకొంది. నా ఉద్దేశం చెప్పడంతో, మిగతా ప్రాంతాల్లోని సెక్స్‌వర్కర్లను కూడా పరిచయం చేసింది. వారికి హెచ్‌ఐవి, ఎయిడ్స్ గురించి అవగాహన కల్పిస్తున్న క్రమంలో... పోలీసులు, వీధి రౌడీలు, ఆకతాయిలు డబ్బుకోసం వారిని ఎంతగా హింసిస్తారో తెలిసింది. కొందరు తోడు కోసమో లేదంటే అద్దెకు ఇల్లు ఇవ్వరనో... ఎవరో ఒక పరిచయస్థుడిని భాగస్వామిగా ఎంచుకుంటారు. వాడు వీళ్ళను విపరీతంగా వేధిస్తుంటాడు. "ఈ సమస్యలన్నిటికీ ఒక్కటే పరిష్కారం. అది మీరంతా సమష్టిగా ఉండటమే" అని వారికి అర్థమయ్యేలా చేశాను. దాంతో సెక్స్‌వర్కర్లంతా బృందాలుగా ఏర్పడ్డారు. ఒకరికి ఆపద వస్తే విగతావారంతా అండగా నిలిచేవారు. అదే సమయంలో ప్రభుత్వం కూడా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణ కార్యక్రమాలను సెక్స్ వర్కర్ కమ్యూనిటీ భాగస్వామ్యంతో నిర్వహించడంతో వారంతా 'కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్లు' (సీబీఓలు)గా ఏర్పడ్డారు. దాంతో మా పని మరింత సులువయింది. అలా పన్నెండేళ్ళపాటు ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో హెచ్‌ఐవీ మీద విస్తృతంగా అవగాహన కల్పించాం. హెచ్‌ఐవీ బాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పి, వారి పిల్లల చదువును ప్రోత్సహించాం. వారిపట్ల సమాజంలో నెలకొన్న వివక్షను కొంతవరకు నిర్మూలించగలిగాం. ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాన్ని నిర్వహించాం. తద్వారా కొంతమేరకైనా సత్ఫలితాలను సాధించగలిగాం.

ఆ మార్పు తీసుకురాగలిగాం...

తామేదో తప్పు చేస్తున్నామన్న ఆత్మన్యూనత సెక్స్‌వర్కర్లను బాగా వేధించడం గమనించా. దాంతో తమ దగ్గర మిగిలిన నాలుగు రూపాయలను కూడా 'పాపపు సొమ్ము' అనుకొనేవారు. దాన్ని దాచుకోకుండా దుబారా చేసేవారు. రేపటి రోజు అనేది వారి జీవితంలో ఒకటుందనే ఆలోచన వారెవ్వరిలో నాకు కనిపించలేదు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించేందుకు పెద్దఎత్తున శిక్షణ శిబిరాలు, అవగాహనా తరగతులు నిర్వహించాం. తాము చేస్తున్నది తప్పుకాదన్న భావనను వారిలో కలిగించాం. సమాజంలోని ఇతరులతో సఖ్యతగా మెలిగేలా శిక్షణ ఇచ్చాం. దీనిలో పోలీసులను కూడా భాగస్వాముల్ని చేశాం. మొదట... వారానికి ముప్పై రూపాయలు పొదుపు చేసేలా ప్రోత్సహించాం. అప్పట్లో పోలీసులు చాలావరకు సెక్స్‌వర్కర్లను విపరీతంగా వేధించేవారు. వీళ్ళు అడ్డామీదకెళ్లి సంపాదించిన



సొమ్మును వారు బలవంతంగా లాక్కునేవారు. ఎవరైనా డబ్బు ఇవ్వకుంటే... కక్షసాధింపులు ఉండేవి. కొందరు పోలీసులు లైంగికంగానూ వేధించేవారు. అకారణంగా అరెస్టు చేయడం, కేసు పెట్టడం, లాఠీలతో బాదడం తదితర రూపాల్లో సెక్స్‌వర్కర్ల మీద హింస విపరీతంగా ఉండేది. అదే అదనుగా వీధి రౌడీలు కూడా మరింత రెచ్చిపోయేవారు. ఇటువంటి పరిస్థితుల్లో... అందరూ సంఘటితంగా, అన్యాయానికి వ్యతిరేకంగా ఉద్యమించేలా మా 'ఉమెన్స్ ఇనీషియేటివ్' సంస్థ కృషి చేసింది.

> **రెస్క్యూ హోమ్‌లు సాక్షాత్తూ యమకూపాలే**
>
> 'సెక్స్‌వర్కర్లను అసంఘటిత రంగ మహిళా కార్మికులుగా గుర్తించాలి' అనేది మా ప్రధాన డిమాండ్. అక్రమ రవాణా ద్వారా లేదా బలవంతంగా ఈ వృత్తిలోకి వచ్చినవారెవరూ మేము పనిచేస్తున్న కమ్యూనిటీల్లో లేరు. వీరంతా కుటుంబ పరిస్థితులు అనుకూలించక లేదా కొన్ని అనివార్య కారణాలవల్ల ఇష్టపూర్వకంగానే సెక్స్‌వర్క్‌లోకి వచ్చారు. కనుక వారికి కార్మికుల హక్కులు వర్తింపచేయాలని చాలా కాలంగా అడుగుతున్నాం. 'సేవియర్స్' పేరుతో వీళ్ళనేదో ఉద్ధరిద్దామని రెస్క్యూ హోమ్‌లలో పెట్టడం లాంటి వాటిని మేము మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాం. రెస్క్యూ హోమ్‌లంటే అచ్చంగా యమకూపాలే. వాటివల్ల ఎలాంటి మార్పు లేకపోగా... జీవితం మరింత దుర్భరంగా మారుతుంది. ఈ వృత్తిని మానేయాలని అనుకొన్నవారికి ప్రత్యామ్నాయ జీవనోపాధులు చూపించవచ్చు. సమాజంలో వీరిపట్ల ఉన్న వివక్ష, చులకన భావం పోవాలి. దీన్ని ఒక గౌరవప్రదమైన వృత్తిగా చూడాలి.

ప్రత్యేక శిక్షణ...

సెక్స్‌వర్కర్లు తమతమ ప్రాంతాల్లో సంఘటితం కావడంతో... క్రమంగా పోలీసుల హింస కూడా చాలావరకు తగ్గింది. కొంతమంది మంచి పోలీసు అధికారులు ఉన్న ప్రాంతాలలో... వేధింపులు ఏమాత్రం ఉండేవి కావు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విడుదల అయిన తర్వాత, వారి తీరు చాలా మారిందని చెప్పాలి. తిరుపతి, నెల్లూరు, ఏలూరు, కంచికచర్ల తదితర ప్రాంతాల్లోని సీబీఓలతో మేము ప్రస్తుతం పనిచేస్తున్నాం. తద్వారా వారికి చట్టాల మీద అవగాహన కల్పిస్తున్నాం. ట్రాన్స్‌జెండర్లపై వివక్ష రూపుమాపడానికి కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో సమావేశాలు నిర్వహిస్తున్నాం. అలా కర్నూలులోని ఒక కళాశాలవారు ట్రాన్స్ మహిళకు పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులో సీటు ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఇదివరకటిలా భయం భయంగా కాకుండా... ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లు ఇప్పుడు ప్రభుత్వ అధికారులతో, సిబ్బందితో తమ సమస్యల గురించి ధైర్యంగా చర్చిస్తున్నారు. వారి హక్కుల గురించి మాట్లాడుతున్నారు. ఈమేరకు వారిని చైతన్యవంతుల్ని చేయగలిగాం. మా మార్గదర్శకత్వంతో చాలామంది సెక్స్‌వర్కర్లు వారి పిల్లలను బాగా చదివిస్తున్నారు. హెచ్‌ఐవీ బాధితుల్లో కూడా ఇప్పుడు ఆనందమయ జీవితాన్ని గడుపుతున్నవారు ఎందరో ఉన్నారు.

మహిళా రైతులు, కూలీల కోసం...

వ్యవసాయ రంగంలో కనీస గుర్తింపునకు నోచుకోని వారు మహిళా రైతు, కూలీలు. అందులో మహిళా కౌలు రైతుల కష్టాల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిజానికి వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర, అందులోనూ అణగారిన వర్గాల మహిళల శ్రమ వెలకట్టలేనిది. ఇప్పుడు చాలా గ్రామాల్లో భూమిలేని దళిత మహిళలు కౌలు రైతులుగా మారారు. వీరికి వెన్నుదన్నుగా నిలవడం కోసం 'ప్రణీక్ష మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ' ప్రారంభించాం. దీనిలో 300మందికి పైగా సభ్యులున్నారు. ఇందులో కొందరు ఒంటరి మహిళలు కూడా ఉన్నారు. వారికి అధునాతన వ్యవసాయ పద్ధతులమీద శిక్షణ ఇప్పించడం. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వారు పండించిన పంటను వారే నేరుగా అమ్ముకొనే అవకాశాలు కల్పించడం లాంటివి చేస్తున్నాం. షాంపూలు, సబ్బులు, పచ్చళ్ళు లాంటి ఉత్పత్తుల తయారీని ప్రోత్సహిస్తున్నాం. బ్యాంకు రుణాలు, రాయితీలు పొందడానికి వారికి ఉన్న అవకాశాలను తెలియజేస్తున్నాం.

ప్రతి మనిషికి సమాన గౌరవం

సెక్స్‌వర్కర్ల హక్కుల కోసం పనిచేసినా, మహిళా రైతు కూలీలను కూడగట్టినా 'ఉమెన్స్ ఇనీషియేటివ్' ప్రధాన లక్ష్యం... సామాజిక భద్రతకు నోచుకోని బాధిత మహిళలను ఐక్యం చేయడం, తద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం, సమష్టిగా సమస్యను అధిగమించవచ్చన్న విశ్వాసాన్ని కలిగించడం. ఒకరికొకరు అండగా నిలిచే సంస్కృతిని పెంపొందించడం, వారికి ఉన్న అవకాశాలను, హక్కులను తెలియజేయడం... ఇవన్నీ మేము చేస్తున్న పనుల్లో ప్రధానమైనవి. మనుషులంతా ఒక్కటే. కుల, మత, లింగ, వర్ణ, వర్గ భేదాలకు అతీతంగా ప్రతి మనిషికి సమానమైన గౌరవం ఈ సమాజం నుంచి దక్కాలి. ధనిక, పేద అంతరాలు తగ్గాలి. అందుకోసం నా వంతుగా కృషి చేస్తున్నాను."

• సాంత్వన్

కౌన్సెలింగ్

డాక్టర్! రోజంతా ఎండగా ఉన్నప్పుడు, పదే పదే సన్‌స్క్రీన్ అప్లై చేయడం అన్నిసార్లూ సాధ్యపడకపోవచ్చు. ఇలా పైపూతగా ఎండ వేడి నుంచి రక్షణ పొందడానికి బదులుగా 'ఓరల్ సన్‌స్క్రీన్స్' వాడుకోవచ్చని విన్నాను. ఇవెంత వరకూ ఫలితాన్నిస్తాయి? వీటిని ఎలా వాడుకోవాలి?
– ఓ సోదరి, హైదరాబాద్.

నోటి మాత్రల్లో సన్‌స్క్రీన్?



కొంతమందికి సన్‌స్క్రీన్ అలర్జీ ఉంటుంది. ఇంకొందరికి సన్‌స్క్రీన్స్ వాడినా ట్యానింగ్ తప్పదు. అంతే కాకుండా ఎండకు బహిర్గతమయ్యే శరీరం మొత్తానికీ సన్‌స్క్రీన్ అప్లై చేయడం కూడా అందరికీ సాధ్యపడకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఓరల్ సన్‌స్క్రీన్స్ వాడుకోవచ్చు. సాధారణంగా ఇలాంటి ఓరల్ సన్‌స్క్రీన్స్‌లో పాలీపోడియమ్ లూకోటొమస్ అనే కాంపౌండ్ ఉంటుంది. గ్రీన్ టీ ఎక్స్‌ట్రాక్ట్, గ్రేప్ సీడ్ ఎక్స్‌ట్రాక్ట్ లాంటి పాలీఫినాలిక్ కాంపౌండ్స్‌తో కొన్ని ఓరల్ సన్‌స్క్రీన్స్ తయారవుతూ ఉంటాయి. ఎరుపు రంగు పండ్లలో, కూరగాయల్లో ఉండే లికోపిన్, అలాగే వృక్షాధారిత కాంపౌండ్ అయిన ఆస్టాక్సాంథిన్ అనే కాంపౌండ్‌లతో కూడా ఇంకొన్ని ఓరల్ సన్‌స్క్రీన్స్ తయారవుతూ ఉంటాయి. విటమిన్ సి, ఇ, బీటాకెరోటిన్‌లు కూడా సూర్యరశ్మి నుంచి రక్షణ కల్పిస్తాయి. ఈ రకమైన ఓరల్ సన్‌స్క్రీన్స్ ప్రయోగదశలో సత్ఫలితాలనివ్వడమే కాకుండా, ఉపయోగించిన వినియోగదారుల్లో కూడా సత్ఫలితాలనివ్వడం కనిపిస్తోంది. అయితే ఓరల్ సన్‌స్క్రీన్స్ వాడుకున్నంత మాత్రాన చర్మానికి అప్లై చేసే సన్‌స్క్రీన్స్‌ను పూర్తిగా మానేయొచ్చా అంటే అది సాధ్యపడకపోవచ్చు. అలా కాకుండా ఓరల్ సన్‌స్క్రీన్స్‌తో పాటు సాధారణ సన్‌స్క్రీన్స్ కూడా అప్లై చేసుకుంటే ఫలితాలు ఎంతో మెరుగ్గా ఉంటాయి. పిగ్మెంటేషన్, మంగు సమస్య ఉన్నవాళ్లకు ఇవెంతో మంచి ఫలితాన్నిస్తాయి. ఓరల్ సన్‌స్క్రీన్స్ ఉపయోగకరమే అయినా, ప్రతి రోజూ, ప్రతి ఒక్కరూ వాడుకోవడానికి ఇవి పనికి రావు. సన్ అలర్జీలు తలెత్తిన సందర్భాల్లో, విహార యాత్రలకు వెళ్లే సందర్భాల్లో డబుల్ ప్రొటెక్షన్‌గా వాడుకోవడం కోసం మాత్రమే ఓరల్ సన్‌స్క్రీన్స్ ఉపయోగపడతాయి. చర్మ వైద్యులు ఓరల్ సన్‌స్క్రీన్స్‌ను దీర్ఘకాల వినియోగం కోసం సూచించడం లేదు.

డాక్టర్ స్వప్న ప్రియ, డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vpNePIOలో చదవండి.

స్ఫూర్తి



ఆర్థిక సమస్యలు, సామాజిక, లింగ, భాషా భేదాలు లాంటి అవరోధాలను అవలీలగా అధిగమించి, మర్చంట్ నేవీ ఆఫీసర్‌గా ఎదిగింది 25 ఏళ్ల సిమ్రన్ తోరట్. పూణెకు చెందిన సిమ్రన్, కన్న కలను పట్టుదలగా నిజం చేసుకున్న తీరు గురించి తెలుసుకుందాం!

మారుమూల పల్లె నుంచి మర్చంట్ నేవీలోకి

పూణెకు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండాపూర్ నుంచి సిమ్రన్ తల్లితండ్రులు ఎప్పుడూ అడుగు బయట పెట్టలేదు. అయినా కూతురు, సప్త సముద్రాలు దాటి, పురుషాధిక్య వృత్తిలోకి అడుగుపెడతానంటే ఆ తల్లితండ్రులు భయపడకుండా వెన్ను తట్టి ప్రోత్సహించారు. కానీ వాళ్లకు ఆర్థిక సమస్య పెద్ద అవరోధంగా మారింది. పూణెలోని మర్చంట్ నేవీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మూడేళ్ల కోర్సుకు 9 లక్షలు వసూలు చేస్తూ ఉండడంతో, సిమ్రన్ తల్లితండ్రులు మరో ఆలోచన లేకుండా, మూడెకరాల వ్యవసాయ భూమిని అమ్మేశారు. నిజానికి ఆ భూమిలో పండే మొక్కజొన్న, గోధుమలు, చెరకు పంటలే వాళ్ల జీవనాధారం. అయినా కూతురి అభీష్టాన్ని నెరవేర్చడం కోసం కడుపు నింపే భూమిని సైతం అమ్మేయాలని నిర్ణయించుకున్నారు. "పెళ్లి నాటికి పదో తరగతి కూడా పాసవ్వని మా అమ్మ నాన్నను ఒప్పించింది. అప్పటికే నాన్న అన్నయ్య చదువు కోసం కొంత భూమిని అమ్మేశాడు. మిగతాది నా కోసం అమ్మడానికి సిద్ధ పడ్డాడు. వ్యవసాయం చేయడానికి భూమి లేకపోవడంతో, ఆయన ఎలక్ట్రీషియన్ వృత్తిలో కొనసాగడం కోసం, ఐటీఐలో శిక్షణ తీసుకున్నాడు. అమ్మ ఇండాపూర్‌లోని ఫెరారో చాక్లెట్ ఫ్యాక్టరీలో పని చేయడం మొదలు పెట్టింది" అంటూ తన కోసం భూమిని త్యాగం చేసిన తన తల్లితండ్రులు బ్రహ్మదేవ్, ఆశా తోరట్‌ల గురించి చెప్పుకొచ్చింది తన కుటుంబంలో, గ్రామంలో, జిల్లాలో మొట్టమొదటి మహిళా మర్చంట్ నేవీ ఆఫీసర్‌గా ఎదిగిన సిమ్రన్.

లోకుల నోళ్లు మూయించి...

సిమ్రన్ లక్ష్యానికి రెండో అవరోధం సమాజం నుంచి ఎదురైంది. బంధువులు, స్నేహితులు సిమ్రన్ తల్లితండ్రుల తెగింపును విమర్శించడం మొదలుపెట్టారు. ఓడలో నెలల తరబడి ఆడపిల్ల ఉద్యోగం చేయడం సరికాదనీ, ఆడపిల్ల చదువు కోసం అంత డబ్బు ఖర్చు పెట్టడం అవివేకమనీ సిమ్రన్ తండ్రిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. "నాన్న, వాళ్ల అనుమానాల మూలంగా తను తీసుకున్న నిర్ణయం ప్రభావితం కాకుండా జాగ్రత్త పడ్డారు. అలాగే అంతకు కొన్నేళ్ల ముందే ఇంజనీర్‌గా మర్చంట్ నేవీలో చేరిపోయిన అన్నయ్య కూడా మా నిర్ణయానికి అండగా నిలబడి నన్ను ప్రోత్సహించాడు. జపనీస్ షిప్పింగ్ కంపెనీలో థర్డ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న అన్నయ్య, శుభమ్ తోరట్, నా నిర్ణయాన్ని సమర్థించి, కెరీర్‌లో ఎదురయ్యే సవాళ్ల గురించి అవగాహన కల్పించాడు" అని తన లక్ష్యాలకు అందిన కుటుంబ సభ్యుల తోడ్పాటు గురించి వివరించింది సిమ్రన్.



సిమ్రన్ లక్ష్యానికి రెండో అవరోధం సమాజం నుంచి ఎదురైంది. బంధువులు, స్నేహితులు సిమ్రన్ తల్లితండ్రుల తెగింపును విమర్శించడం మొదలుపెట్టారు. ఓడలో నెలల తరబడి ఆడపిల్ల ఉద్యోగం చేయడం సరికాదనీ, ఆడపిల్ల చదువు కోసం అంత డబ్బు ఖర్చు పెట్టడం అవివేకమనీ సిమ్రన్ తండ్రిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు.

చదువులో తడబడి...

చదివింది మరాఠీ మీడియం. కానీ మారిటైమ్ కాలేజీలో కోర్సు వర్క్ మొత్తం ఇంగ్లీషులోనే సాగడంతో సిమ్రన్ మొదట్లో కాస్త తడబడింది. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ... "నేను ఎనిమిదో తరగతి వరకూ మరాఠీ మీడియంలోనే చదివాను. తర్వాత సెమి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివాను. మర్చంట్ నేవీ కోర్సు మొత్తం ఇంగ్లీషులో సాగడం, పూణె లాంటి నగరంలో ఒక్కదాన్నే ఉండవలసి రావడంతో మొదట్లో బాగా భయపడ్డాను. నా బ్యాచ్‌లో ఉన్న ముగ్గురు అమ్మాయిల్లో నేనొకదాన్ని. మొదటి రౌండ్ ప్లేస్‌మెంట్‌లో నేను రిజెక్ట్ అయ్యాను. ఆ అతి పెద్ద షిప్పింగ్ కంపెనీ నన్ను రిజెక్ట్ చేయడానికి కారణం నాకు ఇంగ్లీష్ భాష మీద పట్టు లేకపోవడమే! దాంతో నేను మొదట్లో బాధపడినా ఇంగ్లీషు భాష మీద పట్టు పెంచుకోవడం కోసం అన్నయ్యతో ఫోన్లో ఆ భాషలోనే మాట్లాడడం మొదలుపెట్టాను. అద్దం ముందు గంటల తరబడి ఇంగ్లీషు భాషను సాధన చేశాను. చివరి ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్ సమయంలో, సీస్పాన్ అనే ప్రపంచంలోనే అగ్ర కంటెయినర్ షిప్ మేనేజ్‌మెంట్ కంపెనీకి నేను ఎంపికయ్యాను. అప్పటివరకూ ఆ కంపెనీ మహిళలను నియమించుకోలేదు. ఆ కంపెనీలో మొట్టమొదటి విమెన్ ఆన్ డెక్ కేడెట్‌గా ఎంపికైన మొదటి మహిళలను నేనే! అలా 2019లో సింగపూర్‌లో నేను ఉద్యోగంలో చేరాను. 24 మంది సిబ్బందిలో ఏకైక మహిళా ఉద్యోగినిగా ఏడు నెలల పాటు విధులు నిర్వహించాను. మొదట్లో సీ సిక్‌నెస్‌తో బాధపడినా నెమ్మదిగ ఆ ఇబ్బంది జయించాను" అని చెప్పుకొచ్చిన సిమ్రన్, పురుష సిబ్బందితో సమానంగా బరువైన టగ్ లైన్స్‌ను లాగడంతో పాటు, పోర్ట్స్‌లో స్వతంత్ర వాచ్‌గా కూడా విధులు నిర్వహించగలుగుతోంది. ఇప్పటివరకూ మూడు ఓడల్లో ప్రయాణించిన సిమ్రన్, థర్డ్ ఆఫీసర్‌గా నాలుగో ఓడలో ప్రయాణించడానికి సిద్ధపడుతోంది. అలాగే సిమ్రన్ తన అన్నతో కలిసి చదువు కోసం అమ్ముకున్న భూమిని తిరిగి కొని, తల్లితండ్రులకు బహూకరించాలనే ప్రయత్నంలో ఉండడం చెప్పుకోదగిన విశేషం.

ఫైనల్లో సురేఖ త్రయం



ఆర్చరీ వరల్డ్‌కప్

యెచెయోన్ (దక్షిణకొరియా): ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-2 కాంపౌండ్ టీమ్ విభాగంలో విజయవాడ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ త్రయం ఫైనల్లో ప్రవేశించింది. బుధవారం జరిగిన సెమీస్ పోరులో సురేఖ, పర్నీత్ కౌర్, అదితి గోపీచంద్‌లతో కూడిన భారత బృందం 233-229తో అమెరికా త్రయానికి షాకిచ్చింది. శనివారం జరిగే ఫైనల్లో వరల్డ్ నెంబర్. 7 టర్కీ జట్టుతో సురేఖ జట్టు తలపడనుంది. కాగా, పురుషుల కాంపౌండ్ విభాగంలో ప్రియాన్ష్, ప్రథమేష్, అభిషేక్ వర్మలతో కూడిన భారత జట్టు కాంస్య పతక పోరులో ఓటమి పాలైంది. ఇక, రికర్వ్ సింగిల్స్ క్వాలిఫయర్స్‌లో దీపిక కుమారి 4వ, తరుణ్‌దీప్ 6వ స్థానాలు సాధించగా, తెలుగు ఆర్చర్ ధీరజ్ టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయాడు.

సింధు శుభారంభం

మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-17, 21-16తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలుపొందింది. తదుపరి రౌండ్‌లో సిమ్ యు జిన్ (కొరియా)తో సింధు తలపడుతుంది. మరో మొదటి రౌండ్‌లో అస్మిత చలిహా 21-17, 21-6తో లిన్ సి యున్‌పై నెగ్గి ముందంజ వేసింది. అయితే ఆకర్షి కశ్యప్ 24-22, 13-21తో వాంగ్ ఝీ చేతిలో, ఉన్నతీ హుడా 13-21, 18-21తో ఫాంగ్ జీ చేతిలో, కిరణ్ జార్జ్ 16-21, 17-21తో ఒబయాషి చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్/సిక్కిరెడ్డి జోడీ 21-15, 12-21, 21-17తో లీ చున్/పుచి(హాంకాంగ్) జంటపై, పురుషుల డబుల్స్‌లో కృష్ణప్రసాద్/సాయిప్రతీక్ ద్వయం 23-21, 21-11తో మింగ్/టాంగ్‌పై నెగ్గి రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు.

హాకీ ప్రొ లీగ్‌లో భారత్ బోణీ

అంట్వెర్ప్ (బెల్జియం): ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్‌ను భారత పురుషుల హాకీ జట్టు విజయంతో ప్రారంభించింది. బుధవారం జరిగిన యూరోపియన్ లెగ్ తొలి మ్యాచ్‌లో భారత్ షూటౌట్‌లో 5-4తో అర్జెంటీనాను ఓడించింది. ఇదే వేదికపై జరిగిన మహిళల ప్రొ లీగ్‌లో భారత్ 0-5 గోల్స్‌తో అర్జెంటీనా చేతిలో ఓడింది.

అర్జున్‌కు ఏడో స్థానం

షార్జా: షార్జా మాస్టర్స్ చెస్‌లో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ ఏడో స్థానంతో టోర్నీని ముగించాడు. బుధవారం జరిగిన ఆఖరిదైన తొమ్మిదో రౌండ్‌లో బర్దియా దనేశ్వర్ (ఇరాన్)తో గేమ్‌ను అర్జున్ డ్రా చేసుకున్నాడు. ఇక చివరిరౌండ్‌లో నిహాల్ సరిన్‌తో ప్రణవ్, సఫర్లీ ఎల్తాజ్ (అజర్‌బైజాన్)తో రాజా రిత్విక్ గేమ్‌లను డ్రాగా ముగించారు. మొత్తంగా అర్జున్ 6 పాయింట్లతో ఏడో స్థానంతో సరిపెట్టుకోగా, బర్దియా 6.5 పాయింట్లతో మెరుగైన టైబ్రేక్ స్కోరుతో విజేతగా నిలిచాడు. ప్రణవ్ 5 పాయింట్లతో 23వ, రిత్విక్ 4 పాయింట్లతో 63వ స్థానాల్లో నిలిచారు.



సచిన్‌కే స్వర్ణం


» వరల్డ్ పారా అథ్లెటిక్స్

కోబె (జపాన్): భారత్‌కు చెందిన సచిన్ సర్జేరావు ఖిలారీ ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ షాట్‌పుట్‌లో తన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్నాడు. ఈ క్రమంలో అతడు ఆసియా రికార్డును తిరగ రాశాడు. బుధవారం జరిగిన షాట్‌పుట్ ఎఫ్-46 విభాగంలో ఇనుప గుండును సచిన్ 16.30 మీటర్ల దూరం విసిరి టైటిల్ దక్కించుకున్నాడు. అంతే కాదు గతేడాది పారిస్‌లో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ పోటీలలో తానే నెలకొల్పిన 16.21 మీ. ఆసియా రికార్డును బద్దలుగొట్టాడు. ఈ ప్రదర్శనతో అతడు పారిస్ పారా ఒలింపిక్స్‌కు ఎంపికవడం విశేషం. పురుషుల క్లబ్ త్రో ఎఫ్-51 కేటగిరీలో ధరమ్‌వీర్ కాంస్య పతకం గెలుపొందాడు. ఈ స్వర్ణ, కాంస్యాలతో కలిపి ఈసారి చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల సంఖ్య 12కు చేరింది. ప్రపంచ అథ్లెటిక్స్‌లో పతకాల పరంగా మనోళ్లకిదే అత్యుత్తమ ప్రదర్శన. చైనా, బ్రెజిల్ తర్వాత ఓవరాల్‌గా పతకాల పట్టికలో భారత్ మూడో స్థానంలో ఉంది.

బెంగళూరు కథ ముగిసె..



ఎలిమినేటర్‌లో రాజస్థాన్ విజయం
రేపు క్వాలిఫయర్-2లో హైదరాబాద్‌తో ఢీ



యశస్వీ జైస్వాల్ (45)

అహ్మదాబాద్: ఐపీఎల్ టైటిల్ సాధించాలనుకొన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కల మరోసారి భగ్నమైంది. వరుసగా ఆరు విజయాలతో ప్లేఆఫ్స్ చేరుకొన్న బెంగళూరును రాజస్థాన్ రాయల్స్ నాకౌట్ చేసింది. బుధవారం హోరాహోరీగా సాగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ 4 వికెట్ల తేడాతో ఆర్సీబీపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన రాజస్థాన్ ఫైనల్లో చోటుకోసం.. శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. మరోవైపు ఆర్సీబీ టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలుత బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 172/8 స్కోరు చేసింది. రజత్ పటీదార్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 34), కోహ్లీ (24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 33), మహిపాల్ లోమ్రోర్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అశ్విన్ (2/19), బౌల్ట్ (1/16) బెంగళూరు బ్యాటర్లను కట్టడి చేయగా.. అవేశ్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రాజస్థాన్ 19 ఓవర్లలో 6 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. యశస్వీ జైస్వాల్ (30 బంతుల్లో 8 ఫోర్లతో 45), రియాన్ పరాగ్ (26 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 36), హెట్‌మయెర్ (14 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. సిరాజ్ 2 వికెట్లు తీశాడు.

ఆదుకొన్న పరాగ్-హెట్‌మయెర్: లక్ష్య ఛేదనలో ఓ దశలో ఉత్కంఠ రేగినా.. పరాగ్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌కు హెట్‌మయెర్ ధనాధన్ బ్యాటింగ్ తోడు కావడంతో రాజస్థాన్ విజయం సాధించింది. వీరిద్దరూ 5వ వికెట్‌కు 25 బంతుల్లో 45 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు ముంగిట నిలిపారు. ఓపెనర్లు జైస్వాల్, టామ్ కోహ్లెర్ (20) శుభారంభాన్ని అందించారు. తొలి రెండు ఓవర్లు ఆచి తూచి ఆడినా.. మూడో ఓవర్‌లో యశ్ దయాళ్ బౌలింగ్‌లో జైస్వాల్ నాలుగు బౌండ్రీలతో విరుచుకుపడ్డాడు. మరోవైపు కోహ్లెర్ కూడా ఫోర్లతో బ్యాట్‌కు పని చెప్పడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. అయితే, ఆరో ఓవర్‌లో కోహ్లెర్‌ను ఫెర్గూసన్ బౌల్డ్ చేయడంతో.. పవర్‌ప్లే ముగిసే సమయానికి రాజస్థాన్ 47/1తో మెరుగ్గా కనిపించింది. మధ్య ఓవర్లలో కూడా జైస్వాల్ ఎడాపెడా షాట్లతో జోరు కొనసాగించగా.. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ శాంసన్ (17) అతడికి చక్కని సహకారం అందిస్తూ స్కోరు బోర్డును నడిపించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 35 పరుగులు జోడించారు. అయితే, నాలుగు పరుగుల తేడాతో జైస్వాల్, శాంసన్ వికెట్లు కోల్పోయిన రాజస్థాన్ 86/3తో ఒక్కసారిగా ఇబ్బందుల్లో పడింది. 10వ ఓవర్‌లో జైస్వాల్‌ను గ్రీన్ క్యాచవుట్ చేయగా.. ఆ తర్వాతి ఓవర్‌లో కర్ణ్ బౌలింగ్‌లో శాంసన్ స్టంపౌట్ అయ్యాడు. కోహ్లీ మెరుపు ఫీల్డింగ్‌తో ధ్రువ్ జురెల్ (8) రనౌట్ కావడంతో.. రాయల్స్ శిబిరంలో గుబులు రేగింది. ఈ దశలో పరాగ్‌కు జత కలసిన హెట్‌మయెర్ అటాకింగ్ గేమ్‌తో ఆశలు రేపాడు. చివరి 5 ఓవర్లలో రాయల్స్ గెలుపునకు 47 పరుగులు కావాల్సి ఉండగా.. గ్రీన్ వేసిన 16వ ఓవర్‌లో హెట్‌మయెర్, పరాగ్ చెరో సిక్స్‌తో 17 పరుగులు పిండుకొన్నారు. దీంతో లక్ష్యం 24 బంతుల్లో 30 పరుగులకు దిగివచ్చింది. ఆ తర్వాత హెట్‌మయెర్ మరో రెండు బౌండ్రీలు బాదడంతో మ్యాచ్ రాజస్థాన్ రాయల్స్ వైపు మొగ్గింది. 18వ ఓవర్‌లో పరాగ్, హెట్‌మయర్‌ను సిరాజ్ అవుట్ చేసినా.. పావెల్ (8 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో16 నాటౌట్) 4,4,6తో మరో ఆరు బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు.



అశ్విన్ (2/19)

తడబడుతూనే..: బౌల్ట్, అశ్విన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు తడబడింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ.. కీలక భాగస్వామ్యాలు నిర్మించలేక ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. పవర్‌ప్లేలో బౌల్ట్ పదునైన బంతులతో ముప్పుతిప్పలు పెట్టడంతో.. ఓపెనర్లు కోహ్లీ, డుప్లెసి (17) దూకుడుగా ఆడలేకపోయారు. తన తొలి మూడు ఓవర్లలో 6 పరుగులు మాత్రమే ఇచ్చిన బౌల్ట్.. డుప్లెసిని క్యాచవుట్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 37 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బౌండ్రీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న పావెల్ డైవ్ చేస్తూ అద్భుత క్యాచ్ అందుకోవడంతో డుప్లెసి నిరాశగా వెనుదిరిగాడు. అయితే, సందీప్, అవేశ్ లక్ష్యంగా కోహ్లీ బ్యాట్‌ను ఝుళిపించడంతో.. పవర్‌ప్లేను బెంగళూరు 50/1తో ముగించింది. ఇక, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు అశ్విన్, చాహల్ కూడా పరుగులను కట్టడి చేస్తూ బెంగళూరుపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో దూకుడుగా ఆడే ప్రయత్నం చేస్తున్న కోహ్లీని చాహల్ ఊరించే బంతితో బోల్తా కొట్టించాడు. కానీ, బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వన్‌డౌన్‌లో వచ్చిన గ్రీన్ (27) 6,4తో బ్యాట్‌కు పని చెప్పడంతో 10 ఓవర్లకు జట్టు 76/2తో నిలిచింది. మరోవైపు అవుటయ్యే ప్రమాదం నుంచి బతికిపోయిన రజత్ పటీదార్.. గ్రీన్‌తో కలసి మూడో వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, స్కోరు బోర్డు వేగం పుంజుకొంటున్న సమయంలో 13వ ఓవర్‌లో గ్రీన్‌తోపాటు మ్యాక్స్‌వెల్ (0)ను అవుట్ చేసిన అశ్విన్.. బెంగళూరును కోలుకోలేని దెబ్బకొట్టాడు. పావెల్ అందుకొన్న మరో గ్రేట్ క్యాచ్‌తో గ్రీన్ పెవిలియన్ చేరగా.. భారీ షాట్ ఆడే క్రమంలో మ్యాక్సీ అవుటయ్యాడు. ఈ దశలో పటీదార్, మహిపాల్ లోమ్రోర్ బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ స్కోరు బోర్డులో ఊపు తెచ్చారు. చాహల్ వేసిన 14వ ఓవర్‌లో రజత్ 6,4 కొట్టగా.. లోమ్రోర్ సిక్స్‌తో ఆ ఓవర్‌లో 19 పరుగులు లభించాయి. కానీ, పటీదార్‌తో పాటు దినేష్ కార్తీక్ (11), లోమ్రోర్‌ను అవేశ్ వెనక్కి పంపాడు. ఇక, ఆఖరి ఓవర్‌లో కర్ణ్ శర్మ (5), స్వప్నిల్ (9 నాటౌట్) 4,6తో టీమ్ స్కోరును 170 మార్క్ దాటించారు. రాయల్స్ బౌలర్ల దెబ్బకు డెత్ ఓవర్లలో బెంగళూరు 47 పరుగులు మాత్రమే చేసింది.

1 ఐపీఎల్‌లో 8 వేల పరుగుల మైలురాయి చేరిన తొలి బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ.

స్కోరుబోర్డు

బెంగుళూరు: కోహ్లీ (సి) (సబ్-ఫెరీరా) (బి) చాహల్ 33, డుప్లెసి (సి) పావెల్ (బి) బౌల్ట్ 17, గ్రీన్ (సి) పావెల్ (బి) అశ్విన్ 27, పటిదార్ (సి) పరాగ్ (బి) అవేశ్ 34, మ్యాక్స్‌వెల్ (సి) జురెల్ (బి) అశ్విన్ 0, లోమ్రోర్ (సి) పావెల్ (బి) అవేశ్ 32, దినేశ్ కార్తీక్ (సి) జైస్వాల్ (బి) అవేశ్ 11, స్వప్నిల్ (నాటౌట్) 9, కర్ణ్ శర్మ (సి) పావెల్ (బి) సందీప్ శర్మ 5, **ఎక్స్‌ట్రాలు: 4, మొత్తం: 20 ఓవర్లలో 172/8; వికెట్ల పతనం:** 1-37, 2-56, 3-97, 4-97, 5-122, 6-154, 7-159, 8-172; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-16-1, సందీప్ 4-0-48-1, అవేశ్ 4-0-44-3, అశ్విన్ 4-0-19-2, చాహల్ 4-0-43-1.

రాజస్థాన్: జైస్వాల్ (సి) కార్తీక్ (బి) గ్రీన్ 45, కోహ్లెర్ (బి) ఫెర్గూసన్ 20, శాంసన్ (స్టంప్డ్) కార్తీక్ (బి) కర్ణ్ 17, రియాన్ పరాగ్ (బి) సిరాజ్ 36, జురెల్ (రనౌట్) 8, హెట్‌మయెర్ (సి) డుప్లెసి (బి) సిరాజ్ 26, పావెల్ (నాటౌట్) 16, అశ్విన్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19 ఓవర్లలో 174/6; వికెట్ల పతనం:** 1-46, 2-81, 3-86, 4-112, 5-157, 6-160; **బౌలింగ్:** స్వప్నిల్ 2-0-19-0, సిరాజ్ 4-0-33-2, యశ్ దయాల్ 3-0-37-0, ఫెర్గూసన్ 4-0-37-1, కర్ణ్ శర్మ 2-0-19-1, గ్రీన్ 4-0-28-1.



బెంజ్ నుంచి రెండు కొత్త కార్లు

» ప్రారంభ ధర రూ.3.3 కోట్లు

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ బుధవారం భారత మార్కెట్లోకి రెండు కొత్త కార్లను ప్రవేశపెట్టింది. అందులో మేబాక్ జీఎల్ఎస్ 600 4మ్యాటిక్ ఎస్‌యూవీ ధర రూ.3.35 కోట్లు కాగా.. ఏఎంజీ ఎస్ 63 ఈ పెర్ఫార్మెన్స్ ఎడిషన్ 1 రేటు రూ.3.3 కోట్లుగా ఉంది. ఎక్స్‌క్లూజివ్ 'ఎడిషన్ 1' ధర రూ.3.8 కోట్లని కంపెనీ తెలిపింది. ఎస్ క్లాస్ సిరీస్‌లో బెంజ్ ఇప్పటివరకు ప్రవేశపెట్టిన మోడళ్లలో ఇదే అత్యంత శక్తిమంతమైనది. గత ఆర్థిక సంవత్సరంలో భారత మార్కెట్లో 18,123 కార్లను విక్రయించిన బెంజ్.. ఈ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం విక్రయాల్లో రెండంకెల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది.

పేటీఎం నష్టం రూ.550 కోట్లు

న్యూఢిల్లీ: పేటీఎం పేరుతో ఆర్థిక సేవలందిస్తున్న ఫిన్‌టెక్ కంపెనీ 'వన్97 కమ్యూనికేషన్స్ నష్టం మరింత పెరిగింది. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలో కంపెనీ నష్టం గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే రూ.167.5 కోట్ల నుంచి రూ.550 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం కూడా 3 శాతం తగ్గి రూ.2,26 కోట్లకు పడిపోయింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ యూపీఐ లావాదేవీలపై ఆర్‌బీఐ విధించిన ఆంక్షలు ఇందుకు ప్రధాన కారణం. అయితే మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి పేటీఎం నష్టాలు రూ.1,776.5 కోట్ల నుంచి రూ.1,422.4 కోట్లకు తగ్గాయి. ఇదే సమయంలో ఆదాయం మాత్రం 25 శాతం పెరిగి రూ.9,978 కోట్లకు చేరింది.

మూడేళ్ల కనిష్ఠానికి యూకే ద్రవ్యోల్బణం

యునైటెడ్ కింగ్‌డమ్‌లో (యూకే) గత నెలకు వినియోగదారుల ధరల సూచీ దాదాపు మూడేళ్ల కనిష్ఠ స్థాయి 2.3 శాతానికి తగ్గింది. అయినప్పటికీ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ) నియంత్రణ లక్ష్యమైన 2 శాతానికి ఎగువనే ఉంది. అలాగే, మార్కెట్ వర్గాల అంచనాల కంటే ఎగువ స్థాయిలోనే నమోదైంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 20న ద్రవ్యపరపతి సమీక్షలో బీఓఈ ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలపై మళ్లీ అనిశ్చితి పెరిగింది.

సత్య నాదెళ్లకు జరిమానా



కంపెనీల చట్టం ఉల్లంఘనకు శిక్ష

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, మైక్రోసాఫ్ట్ అనుబంధ సంస్థ లింక్డ్‌ఇన్ ఇండియా, మరో ఎనిమిది మంది వ్యక్తులపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. వీరు కంపెనీల చట్టం, 2013లోని 90వ సెక్షన్‌ను ఉల్లంఘించినందుకు రూ.27,10,800 జరిమానా విధించింది. ఇందులో లింక్డ్ ఇన్ ఇండియాపై రూ.7 లక్షలు, సత్య నాదెళ్ల, లింక్డ్‌ఇన్ ఇండియా సీఈఓ ర్యాన్ రొస్లాన్‌స్కీలపై చెరో రూ.2 లక్షల చొప్పున జరిమానా విధిస్తున్నట్టు కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. లింక్డ్‌ఇన్ ఇండియా ఈక్విటీలో వీరికి చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రయోజన హక్కులు ఉన్నా, వారు ఆ విషయాన్ని వెల్లడించలేదని, అందుకు ఈ జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది. కనీసం కంపెనీల చట్టంలోని నిబంధన 2ఏ (2) కింద కూడా వీరు తమకు ఈ విషయం తెలియజేయకపోవడాన్ని కంపెనీ వ్యవహారాల శాఖ తప్పు పట్టింది.

గ్రాన్యూల్స్‌లో స్వల్ప వాటా విక్రయించిన ప్రమోటర్

» 3.09 శాతం వాటా రూ.304 కోట్లకు అమ్మకం

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన గ్రాన్యూల్స్ ఇండియా ప్రమోటర్ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి కంపెనీలో స్వల్ప వాటా విక్రయించారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) డేటా ప్రకారం.. చిగురుపాటి తనకు చెందిన 3.09 శాతం వాటాకు సమానమైన 75 లక్షల షేర్లను బహిరంగ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా రూ.304 కోట్లకు విక్రయించారు. ఒక్కో షేరు సగటున రూ.405.08కు అమ్ముడైంది. వ్యక్తిగత రుణ చెల్లింపులు, కంపెనీలో తన వాటా తనఖాను విడిపించుకోవడంతో పాటు కొంత ద్రవ్య నిల్వను ఏర్పాటు చేసుకునే ఉద్దేశంతోనే ప్రమోటర్ ఈ వాటా విక్రయించారని గ్రాన్యూల్స్ ఇండియా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. అయితే భవిష్యత్‌లో మరింత వాటా విక్రయించే ఉద్దేశం ప్రమోటర్‌కు లేదని స్పష్టం చేసింది. తాజా వాటా విక్రయంతో గ్రాన్యూల్స్ ఇండియాలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ షేర్‌హోల్డింగ్ 41.96 శాతం నుంచి 38.87 శాతానికి తగ్గింది. కృష్ణ ప్రసాద్ చిగురుపాటి వాటా 34.78 శాతం నుంచి 31.69 శాతానికి తగ్గింది. ఎన్ఎస్ఈలో గ్రాన్యూల్స్ షేరు ధర బుధవారం 4.61 శాతం పెరిగి రూ.427.95 వద్ద ముగిసింది.

ఇక ఇళ్ల ధరల పెరుగుదల అంతంతే

ఇప్పటికే చుక్కలనంటాయి
కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ హెడ్ అన్షుల్ జైన్



న్యూఢిల్లీ: దేశంలో ఇళ్ల ధరల పెరుగుదల స్వల్పకాలిక, మధ్యకాలిక ధోరణిలో నామమాత్రంగానే ఉంటుందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఇండియా హెడ్ అన్షుల్ జైన్ అన్నారు. కొవిడ్ అనంతరం గత రెండేళ్ల కాలంలో ఇళ్ల ధరలు విపరీతంగా పెరిగాయని, ఈ కారణంగా కొంత కాలం పాటు ధరల్లో స్తబ్ధత ఉండవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం ప్రస్తుతం అత్యధిక ఆర్థిక వృద్ధి సాధిస్తూ ఉండడంతో పాటు ప్రజల్లో ప్రత్యేకించి యువతరంలో సొంత ఇల్లు కలిగి ఉండాలనే ఆకాంక్ష బలంగా ఉన్నందు వల్ల భవిష్యత్తులో ఇళ్ల డిమాండు బలంగానే ఉంటుందని ఆయన తెలిపారు. 2013-14 నుంచి 2019 వరకు దేశంలో ఇళ్ల డిమాండు స్తబ్ధంగానే ఉన్నదని, ఆ సమయంలో యువత సొంతంగా ఏదైనా కలిగి ఉండాలని ఆకాంక్షించలేదని ఆయన చెప్పారు. కొవిడ్ మహమ్మారి నుంచి ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చిందంటూ సొంత ఇల్లు కలిగి ఉండడం వల్ల స్థిరత్వం ఉంటుందనే భావం నెలకొన్నట్టు ఆయన తెలిపారు. మారిన పరిస్థితుల కారణంగా ప్రజలు పెద్ద ఇళ్లు కావాలని కోరుకున్నారని, దేశంలో కనిష్ఠంగా ఉన్న వడ్డీరేట్లు కూడా ఇళ్ల కొనుగోలుదారులకు ప్రోత్సాహకమైన అంశమని జైన్ అన్నారు. దీంతో డిమాండు గణనీయంగా పెరిగి ధరలు కూడా దూసుకుపోయాయని తెలిపారు. ధరల పెరుగుదల తీరును చూసి ఇన్వెస్టర్లు కూడా గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ముందుకు రావడం మార్కెట్‌ను ఉత్తేజితం చేసిందని వివరించారు. ఆ తీరులో గత రెండేళ్లుగా ఇళ్ల ధరలు దూసుకుపోయిన కారణంగా ఒకటి, రెండు సంవత్సరాల కాలం పాటు ధరల్లో స్థిరీకరణ ఏర్పడవచ్చునన్నది తన అభిప్రాయమని స్పష్టం చేశారు. వచ్చే రెండేళ్లలో ధరల్లో రెండంకెల వృద్ధి ఉండకపోవచ్చునని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దేశంలో ఇళ్ల మార్కెట్ ధోరణులను పరిశీలించే వివిధ కన్సల్టెన్సీ సంస్థల అధ్యయనం ప్రకారం ఎనిమిది ప్రధాన నగరాల్లో కొవిడ్ అనంతరం ధరలు సగటున 10 శాతం పెరిగాయి. అయితే కొన్ని చిన్న మార్కెట్లలో మాత్రం ధరలు 40 నుంచి 70 శాతం వరకు కూడా పెరిగాయి. పైగా మంచి పేరు ప్రఖ్యాతులున్న బిల్డర్ల ప్రాజెక్టులకే ప్రజలు మొగ్గు చూపడం ప్రారంభించారు.

బిజినెస్


గ్లాండ్ ఫార్మా లాభం రెండింతలు

» రూ.20 తుది డివిడెండ్

న్యూఢిల్లీ : హైదరాబాద్ కేంద్రంగా పని చేసే గ్లాండ్ ఫార్మా నాలుగో త్రైమాసికంలో రూ.192 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే లాభం దాదాపు రెండింతలు పెరిగింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.785 కోట్ల నుంచి రూ.1,537 కోట్లకు చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ నికర లాభం రూ.781 కోట్ల నుంచి రూ.772 కోట్లకు పడిపోయింది. ఆదాయం మాత్రం రూ.3,625 కోట్ల నుంచి రూ.5,665 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరమే యూరప్ కేంద్రంగా పని చేసే సినెక్సీ అనే ఫార్మా కంపెనీని కొనుగోలు చేసినట్టు గ్లాండ్ ఫార్మా ఎండీ, సీఈఓ శ్రీనివాస్ సాదు తెలిపారు. వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.20 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

కావేరి సీడ్స్ లాభం 2.79 కోట్లు

హైదరాబాద్: స్థానిక కావేరి సీడ్స్ కంపెనీ మార్చి త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి అనుబంధ కంపెనీలను మినహాయిస్తే (స్టాండ్ అలోన్) కంపెనీ రూ.80.54 కోట్ల ఆదాయంపై రూ.2.79 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే క్యూ4లో కంపెనీ ఆదాయం 32.82 శాతం, నికర లాభం 1.2 రెట్లు పెరిగాయి. స్థూల లాభం 3.3 రెట్లు పెరిగి రూ.15.5 కోట్లకు చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణలోకి తీసుకుంటే ఆదాయం 6.18 శాతం పెరిగి రూ.1,062.43 కోట్లకు, నికర లాభం 9.72 శాతం వృద్ధితో రూ.293 కోట్లకు చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో షేరు రూ.725 చొప్పున రూ.325 కోట్లతో వాటాదారుల నుంచి 44.83 లక్షల షేర్లను బైబ్యాక్ చేసినట్టు కావేరి సీడ్స్ సీఎండీ జీవీ భాస్కర రావు ఒక ప్రకటనలో తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,550 ▲	68,350 ▲	1,00,300 ▲
ముంబై	74,080 ▼	67,860 ▼	92,890 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ

హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	145	గోదావరి	149
వరంగల్	145	విజయవాడ	149
కరీంనగర్	145	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	160
విశాఖపట్నం	141		

రిలయన్స్, ఇన్ఫీ షేర్లలో కొనుగోళ్లు

» సెన్సెక్స్ 267 పాయింట్లు అప్

» 5 లక్షల కోట్ల డాలర్లు దాటిన మార్కెట్ సంపద

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలు మిశ్రమంగా ఉన్నప్పటికీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు దేశీయ ఈక్విటీ సూచీలను ముందుకు నడిపించాయి. బుధవారం ట్రేడింగ్ నిలిచేసరికి, సెన్సెక్స్ 267.75 పాయింట్ల లాభంతో 74,221.06 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 68.75 పాయింట్ల వృద్ధితో 22,597.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ లాభపడటం వరుసగా ఇది ఐదో రోజు. కాగా బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద తొలిసారిగా 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.415.94 లక్షల కోట్లు) వద్ద ముగిసింది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్‌కు ఇది సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి.

బీకన్ ట్రస్టీషిప్ లిమిటెడ్ షేరు ధర శ్రేణి రూ.57-60

ప్రముఖ డిబెంచర్ ట్రస్టీ 'బీకన్ ట్రస్టీషిప్ లిమిటెడ్' ఐపీఓ ఈనెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.57-60గా నిర్ణయించింది. తద్వారా రూ.32 కోట్లకు పైగా సమీకరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

అయోధ్యలో కరూర్ వైశ్యా బ్యాంక్

హైదరాబాద్: పాత ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) అయోధ్యలో కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేసింది. బ్యాంకుకు ఇది 840వ బ్రాంచ్. బ్యాంక్ చైర్‌పర్సన్ డాక్టర్ మీనా హేమచంద్ర బుధవారం ఈ బ్రాంచ్‌ను ప్రారంభించారు. కేవీబీకి ఉత్తరప్రదేశ్‌లో ఇది ఏడవ బ్రాంచ్. ఈ బ్రాంచ్‌లో ఏటీఎం, నగదు డిపాజిట్ మెషిన్, పాస్‌బుక్ ప్రింటర్ వంటి సదుపాయాలు కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపింది. కేవీబీ ఎండీ, సీఈఓ బీ రమేశ్ బాబుతో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 100 కొత్త బ్రాంచిలు ప్రారంభించనున్నట్టు బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది.

పిన్నెల్లి అరాచకాలకు సాక్ష్యం ఈ చిత్రాలు



పోలింగ్ బూత్‌లో ఈవీఎంను ఎత్తి నేలకేసి కొడుతున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి





ఈవీఎం బద్దలు కొడుతుంటే అడ్డుకున్నాడని...



పోలింగ్ బూత్‌లో అరాచకాలను అడ్డుకున్న ఏజెంట్‌పై...



వైసీపీ అల్లరి మూకల దాడిలో పోలీసు అధికారికి వదలక...





కారంపూడి వీధుల్లో కత్తులు, కర్రలతో వైసీపీ మూకల వీరంగం

పిన్నెల్లి ఈవీఎంను పైకెత్తి కింద పడేశారు

అడ్డుకున్న సిబ్బంది, ఏజెంట్‌ను బెదిరించారు

డీజీపీకి నివేదించిన ఎస్పీ మాలికా గార్గ్

అమరావతి (ఆంధ్రజ్యోతి), రెంటచింతల, మే 22: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి పోలింగ్ సిబ్బంది, ఏజెంట్‌ను బెదిరించి ఈవీఎంను ధ్వంసం చేశారని పల్నాడు జిల్లా ఎస్పీ మాలికా గార్గ్ డీజీపీకి నివేదించారు. 'కొందరు అనుచరులతో పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించిన వైసీపీ అభ్యర్థి ఈవీఎం(అసెంబ్లీ)ను పైకెత్తి రెండుసార్లు కింద పడేశారు. అనూహ్య ఘటనను అడ్డుకునేందుకు ఒక పోలింగ్ సిబ్బంది, మరో ఏజెంట్ ప్రయత్నించగా వారిద్దరినీ బెదిరించి ఈవీఎంను ధ్వంసం చేసి వెళ్లిపోయారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు రెంటచింతల పోలీస్‌స్టేషన్లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం. ఎమ్మెల్యేతో పాటు అనుమతి లేకుండా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించిన ఇద్దరిపైనా చర్యలకు ఉపక్రమించాం. పల్నాడు అదనపు ఎస్పీ నేతృత్వంలో బృందాలు ఏర్పాటు చేశాం. ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, ముగ్గు రు ఎస్‌ఐలతో కూడిన బృందాలు నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నాయి' అని ఎస్పీ తన నివేదికలో వివరించారు.

అల్లర్లకు పాల్పడితే తీవ్ర చర్యలు: గార్గ్

ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ మాలికా గార్గ్ హెచ్చరించారు. అలాగే తమ వాహనాలకు తామే నిప్పంటించుకుని ఇతర పార్టీలపై తప్పుడు కేసులు పెట్టే వ్యక్తులను కూడా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా ఈవీఎంలు ధ్వంసమైన రెంటచింతల మండలం, పాల్వాయిగేట్ గ్రామంలోని 202 పోలింగ్ బూత్, తుమ్మకోటలోని 205, 206, 207 పోలింగ్ బూత్‌లను మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఆమె పరిశీలించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుమ్మకోట, రెంటాల గ్రామానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని సేకరించారు. రెంటాల గ్రామంలో టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై కారంతో దాడి, వాహనానికి నిప్పు తదితర అంశాలను సావధానంగా విన్నారు.

అరాచకానికి అధికారముద్ర!

» పిన్నెల్లి బ్రదర్స్ కళ్లల్లో ఆనందం కోసం ఖాకీల సంపూర్ణ సహకారం

» టీడీపీ నేతలను స్టేషన్‌లో హింసించి లైవ్‌లో బ్రదర్స్‌కు చూపించిన ఎస్‌ఐలు

మాచర్లటౌన్, మే 22: మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి సాగించిన అరాచకాలకు అధికారులు అడుగడుగునా ఒత్తాసు పలికారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉండడం, స్థానికంగా పిన్నెల్లి గెలవడంతో ఆయన ఆశీస్సుల కోసం పలువురు అధికారులు పిన్నెల్లి ఇంటి ముందు ఉదయం నుంచే క్యూ కట్టేవారు. ఆయన ఆశీస్సులు తమకు మెండుగా ఉండాలని కోరుకున్నారు. దీనికి అనుగుణంగానే తమకు అణిగి మణికి ఉండే అధికారులను ఏరికోరి మరీ ఇక్కడ పిన్నెల్లి పోస్టింగ్ వేయించారు. మాచర్ల నియోజకవర్గంలో పోస్టింగ్‌కు వచ్చిన అధికారులు ముందుగా పిన్నెల్లి సోదరులను కలిశాకే తమ బాధ్యతలు స్వీకరించేవారు. ఎమ్మెల్యే, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి అరాచకాలకు, అకృత్యాలకు వీరు వత్తాసు పలికారు. పిన్నెల్లి సోదరులు.. ప్రతిపక్ష టీడీపీకి సంబంధించి ఎవరి పేరు చెబితే వారిని స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలు పెట్టి సెల్‌ఫోన్లో వీడియోలు తీసి మరీ వారికి పంపేవారు.

అర్ధరాత్రి నిద్రలేపి.. స్టేషన్‌కు తరలించి

పిన్నెల్లి సోదరులు తమ అరాచకాలను ప్రశ్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలపై తమ ఝులుం ప్రదర్శించేవారు. అర్ధరాత్రి సమయంలో ప్రతిపక్ష నాయకుల ఇళ్లకు పోలీసులను పంపి వారి కుటుంబసభ్యులు చూస్తుండగానే భౌతిక దాడులు చేయించి భయభ్రాంతులకు గురి చేశారు. అంతేకాదు.. స్టేషన్‌కు ఈడ్చుకొచ్చేవారు. లాఠీలతో చితకబాది టీడీపీ నేతల ఆక్రందనలను సెల్‌ఫోన్లో పిన్నెల్లి సోదరులకు లైవ్‌లో చూపించేవారు. ఇలా పిన్నెల్లి సోదరులను సంతోషపరిచి ప్రసన్నం చేసుకున్న అధికారులు రూ.కోట్లలో సొమ్మును వెనుకేసుకున్నారు. మాచర్ల పట్టణానికి చెందిన టీడీపీ నేత అన్వర్‌ను బక్రీదు పండుగ పూట అర్ధరాత్రి సమయంలో చేయని నేరానికి అక్రమ కేసులు ఇరికించి ఇబ్బందులకు గురి చేయడం ఈ కోవలోదే. ఇలా నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామంలోనూ వైసీపీ నేతలకు ఎదురు తిరిగిన ప్రతి టీడీపీ కార్యకర్తపైనా పోలీసుల పైశాచిక లాఠీ విరిగింది. మరికొందరు పిన్నెల్లి పోలీసు భక్తులు ఇంకో అడుగు ముందుకేసి టీడీపీ నేతలు ఎక్కడ కనపడితే అక్కడ పోలీసు వాహనంలో స్టేషన్‌కు ఎత్తుకొచ్చి చావబాదేవారు. మండల కేంద్రమైన కారంపూడిలో సీఐ చినమల్లయ్య టీ తాగుతున్న టీడీపీ నేత చప్పిడి రాముకు సర్వీస్ రివాల్వర్ చూపించి బెదిరించడం సంచలనం రేకెత్తించింది.

మండలానికో రౌడీని పెట్టి...

పిన్నెల్లి సోదరులు తమ ఆధిపత్యం కొనసాగించేందుకు మండలానికో రౌడీని పురమాయించారు. మాచర్లకు తురకా కిశోర్, రూరల్‌కు బూడిద శ్రీను, దుర్గి మండలానికి ఊరిబండి మన్నెయ్య, రెంటచింతల మండలానికి మోర్తాల ఉమామహేశ్వరరెడ్డి, వెల్దుర్తి మండలానికి చింతా ఆదినారాయణలనునియమించారు.

- స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో నియోజకవర్గం ఏకగ్రీవం చేసేందుకు పిన్నెల్లి సోదరులు దౌర్జన్యాలకు దిగారు. వీరిని అడ్డుకునేందుకు, టీడీపీ తరుఫున కూడా నామినేషన్లు వేయించేందుకు పార్టీ సీనియర్ నేతలైన బొండా ఉమ, బుద్ధా వెంకన్న, లీగల్ న్యాయవాది మాచర్ల ప్రాంతానికి వచ్చారు. వీరి కారు మాచర్ల పట్టణంలోని రింగు రోడ్డు సమీపంలోకి రాగానే తురకా కిశోర్ వారి వాహనంపై పెద్ద బాదుతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు.
- మాచర్ల మండలంలో బూడిద శ్రీను సాగర్ చెక్ పోస్టు వద్ద పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన గ్రానైట్‌లారీలను చెక్‌పోస్టు దాటించి డబ్బులు వసూలు చేసేవాడు. అక్రమ సంపాదనకు సహకరించినందుకు శ్రీను తల్లికి ఎంపీపీ పదవిని ఇచ్చారు.

అదుపులోకి తీసుకున్నారా!?

నరసరావుపేట, మే 22: పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు ఏ క్షణమైనా అరెస్టు చూపే అవకాశం కనిపిస్తోంది. ఆయనను బుధవారం సంగారెడ్డి సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. డ్రైవర్‌తోపాటే పిన్నెల్లినీ అదుపులోకి తీసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిని పోలీసు ఉన్నతాధికారులెవరు ధ్రువీకరించడంలేదు. మంగళవారం అర్ధరాత్రి సమయానికి కూడా పిన్నెల్లి అరెస్టు లేదా అదుపులోకి తీసుకోవడంపై ఎలాంటి ప్రకటన రాలేదు. కానీ, ఆయనను నర్సరావుపేటలో మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీతో పాటు పలువురు పోలీసు అధికారులు అర్ధరాత్రి వరకు మకాం వేసి ఉండటం గమనార్హం.

ఇవీ.. కేసులు-సెక్షన్లు!

- ఎన్నికల రోజున పిన్నెల్లి సోదరులు పోలింగ్ కేంద్రాలు లక్ష్యంగా సృష్టించిన విధ్వంసకాండపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వెల్దుర్తి మండలంలో టీడీపీ ఏజెంట్ నోముల మాణిక్యంను పోలింగ్ కేంద్రం నుండి బయటకు రప్పించేందుకు ఆయన భార్యాపిల్లలను తీవ్రంగా హింసించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేసిన సిట్ అధికారులు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తోపాటు అతని అనుచరులపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.
- రెంటచింతల మండలం పాల్వాయి గేట్‌లోని 202 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం పగలగొట్టినందుకు ఐపీసీ, ఆర్‌పీ, పీడీపీపీ చట్టాల పరిధిలో 10 సెక్షన్లతో పిన్నెల్లిపై కేసులు నమోదు చేశారు. ఐపీసీ కింద 143, 147, 448, 427, 353, 452, 120బీ సెక్షన్లు, పీడీపీపీ కింద మరో కేసు, ఆర్‌పీ చట్టంలోని 131, 135 నమోదు చేశారు.
- పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ ఏజెంట్ నంబూరు శంకరరావుపై పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ ఘటనలో శంకరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. పిన్నెల్లిపై అదనపు సెక్షన్లు కూడా పెట్టేందుకు కోర్టులో మెమో దాఖలు చేశారు.

బెదిరింపులు.. హత్యలు..

» పిన్నెల్లి బ్రదర్స్‌కు కామన్.. వేల కోట్లు పోగేసిన సోదరులు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడినప్పటికీ అరాచకాల్లో మాత్రం ముందంజలో ఉంది. వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 15 ఏళ్ల కిందట 2009లో ఇక్కడ విజయం దక్కించుకున్న నాటి నుంచి ఆయనతోపాటు సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి నియోజకవర్గంపై ఆధిపత్యం చేయడం ప్రారంభించారు. దీంతో పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. మాచర్లలో ఆటవిక సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకొని అన్నదమ్ములు పాశవిక పాలన కొనసాగిస్తున్నారు. అక్కడ వారు చెప్పిందే వేదం. వారు చెప్పిందే ధర్మం. వాళ్ల అనుమతి లేకుండా కాకి కూడా ఆ నియోజకవర్గంలో అడుగుపెట్టడానికి వీల్లేదన్నట్టుగా వ్యవహరించారు. కాంట్రాక్టర్లు కప్పం కట్టకుండా టెండర్ వేయటానికి వీల్లేదు. ఇక, ఎన్నికలు వచ్చాయంటే అన్నదమ్ముల క్రూరత్వానికి హద్దే ఉండదని ఇక్కడివారు చెబుతారు. అడ్డొచ్చిన వారిని తెగ నరకటానికి ఏమాత్రం సంకోచించరు. వీరికి తోడుగా కొంతమంది రౌడీలను, అరాచకవాదులను పెంచి పోషిస్తున్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన కాలమంతా మాచర్లలో ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా ఖూనీ అయింది. సొంత బాబాయిలకే వెన్నుపోటు పొడిచి ఎమ్మెల్యే సీటు సంపాదించుకున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆ తర్వాత అందరికీ చెక్ పెట్టడం ప్రారంభించారు. చూడటానికి సౌమ్యుడిలా కనిపించినప్పటికీ అత్యంత కిరాతక మనస్తత్వం కలిగిన వ్యక్తి అని ఆయనతో సన్నిహితంగా ఉండే వాళ్లు చెబుతుంటారు. రామకృష్ణారెడ్డి సోదరులు అక్కడి టీడీపీ కార్యకర్తలపై జరిపిన దాడులు, చేసిన హత్యలు అన్నీ ఇన్నీ కావు. 2006 నుండి 2009 వరకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల జడ్పీటీసీగా పనిచేశారు. నిధుల కోసం అప్పటి జిల్లా పరిషత్ పాలకవర్గంపై కూడా రౌడీయిజాన్ని ప్రదర్శించారు. 2009 ఎన్నికల్లో సొంతవారికి వెన్నుపోటు పొడిచి ఎమ్మెల్యే సీటు దక్కించుకున్నారు.

మహిళలపై బూతుపురాణం

» తిరగబడటంతో పారిపోయిన పిన్నెల్లి

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో పాల్వాయి గేటు బూత్‌లో ఈవీఎంను ధ్వంసం చేసిన తర్వాత మహిళల పట్ల పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అభ్యంతరంగా ప్రవర్తించారు. బూత్ నుంచి పిన్నెల్లి బయటకు వచ్చాక మహిళలను కూడా ఆయన, ఆయన అనుచరులు 'ల'కారాలతో కూడిన బూతులు తిడుతూ అనుచితంగా ప్రవర్తించారు. ఓ వృద్ధ మహిళను 'ల..' అంటూ దూషించారు. గ్రామస్తులు తిరగబడటంతో పిన్నెల్లి తన అనుచరులతో కలసి అక్కడి నుంచి ఉడాయించారు.

ఆ రెండ్రోజుల్లో తీవ్రహింస!

మాచర్లలో కనీవినీ ఎరుగని రీతిలో వైసీపీ అరాచకాలు

డీజీపీకి జాబితా సమర్పించిన టీడీపీ నేతలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలింగ్ రోజు పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ కనీవినీ ఎరుగని రీతిలో దారుణాలకు పాల్పడింది. మర్నాడు కూడా తన అరాచకాలు కొనసాగించింది. ఆ రెండ్రోజుల్లో అధికార పక్షం చేసిన హింసాత్మక దాడుల్లో మొత్తం 79మంది టీడీపీ కార్యకర్తలు గాయాలపాలయ్యారు. వీటికి సంబంధించి టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ, ఏఎస్ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు, చిట్టిబాబు, మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, పాల్వాయి గేటు గ్రామ ఘటనలో గాయపడ్డ టీడీపీ నేత నంబూరు శేషగిరి రావు తదితరులు బుధవారమిక్కడ మంగళగిరి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు నివేదిక అందజేశారు. ఇందులో గాయపడిన టీడీపీ కార్యకర్తల పేర్లు, గ్రామాల వివరాలతో జాబితా సమర్పించారు. 'వైసీపీ మూకల దాడులు పోలింగ్ తర్వాతి రోజు కొనసాగాయి. మొత్తం 79 మంది గాయపడితే వీరిలో నాలుగోవంతు మంది కూడా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ప్రాణ భయంతో గ్రామాలు వదిలి పారిపోయారు. పోలీసు అధికారుల్లో ఎక్కువమంది జగన్ ప్రభుత్వం నియమించినవారు కావడంతో ఫిర్యాదు చేసినా పెద్ద ఉపయోగం లేదన్న భావనతో ఫిర్యాదులు ఇవ్వలేదని మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి చెప్పారు. 'పోలింగ్ రోజు రెంటచింతల పోలీసు స్టేషన్‌కు టీడీపీ వాళ్లు వెళ్తే కనీసం ఫిర్యాదు తీసుకోవడానికి కూడా పోలీసులు ఎవరూ లేరు. రెంటాల గ్రామానికి వెళ్లిన నాపై కారం పొట్లాలతో దాడిచేసి కొట్టాలని చూశారు. ఎస్పీ సుప్రజ అక్కడే ఉన్నా కూడా ఏమీ చేయలేకపోయారు. నా వాహనాలు ధ్వంసమయ్యాయి. దాడి చేసినవారిని వదిలిపెట్టి పోలీసులు గృహనిర్బంధం పేరుతో నన్ను తీసుకెళ్లారు. మాచర్లలో టీడీపీ నేత కేశవరెడ్డి, ఇతరులను ఎమ్మెల్యే పిన్నెల్లి తన వాహనంతో ఢీకొట్టి గాయపరిస్తే ఆయనపై హత్యాయత్నం కేసు పెట్టలేదు. అక్కడి పోలీసులు వైసీపీ తొత్తుల్లా మారిపోయారు. మేం ఏ ఫిర్యాదు ఇచ్చిన వెంటనే ఎమ్మెల్యేకు సమాచారం వెళ్లిపోతోంది. ఎమ్మెల్యే తమ్ముడు కూడా దాడులు చేశాడు. సీఎస్ పంపిన పేర్లతోనే సిట్ ఏర్పాటైంది. అందుకే ఆ వ్యవస్థను నమ్మలేకపోతున్నాం. మాచర్ల దారుణాలపై స్వతంత్ర వ్యవస్థతో దర్యాప్తు చేయించాలి. నమోదుచేసిన కేసుల్లో పెట్టిన సెక్షన్లపై పునఃపరిశీలన చేయాలి' అని బ్రహ్మారెడ్డి కోరారు.

ఆ పోలీసు అధికారుల తీరు దుర్మార్గం: టీడీపీ

కొన్ని నియోజకవర్గాల్లో పోలీసు అధికారులు వైసీపీ పక్షంగా మారి ఆ పార్టీ ప్రయోజనాల కోసం దుర్మార్గంగా వ్యవహరించారని టీడీపీ ఆరోపించింది. మాచర్ల, తాడిపత్రి, చంద్రగిరి, విశాఖ నియోజకవర్గాల్లో పోలీసు అధికారులపై నిర్దిష్ట ఆరోపణలు చేస్తూ డీజీపీకి ఐదు పేజీల వినతిపత్రం సమర్పించింది. వినతిపత్రంలోని అంశాలపై విచారణ చేయిస్తానని డీజీపీ హామీ ఇచ్చారు.

ఈవీఎంను ఎమ్మెల్యే ధ్వంసం చేయడమా?

పిన్నెల్లి తీరును ఏకిపారేసిన తమిళ మీడియా



తమిళ పత్రికల్లో ప్రచురితమైన కథనాలు

చెన్నై, మే 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల పోలింగ్ రోజున పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేయడాన్ని తమిళ మీడియా తూర్పారబట్టింది. ఏపీలో పోలింగ్ నాడు అధికార పార్టీ అరాచకానికి పాల్పడిందని, పోలీసుశాఖ నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయిందని ఏకిపారేసింది. బుధవారం సాయంకాల పత్రికలు ఈ వ్యవహారాన్ని ప్రధానంగా ప్రచురించగా, టీవీ చానెళ్లు రోజంతా పిన్నెల్లి తీరుపై దుమ్మెత్తిపోశాయి. ఎన్నికల్లో అధికార వైసీపీ అరాచకానికి పాల్పడిందని విమర్శలు గుప్పించాయి. ఎన్నికల సమయంలో కొంతమంది ఆకతాయిలు దౌర్జన్యాలకు పాల్పడటం సహజమని, కానీ ఏకంగా ఎమ్మెల్యేనే ఈవీఎంను ధ్వంసం చేస్తుంటే ఈసీ, పోలీసు శాఖ చోద్యం చూశాయని, ఇంత జరిగినా పిన్నెల్లిని అరెస్టు చేయకపోవడమేంటని నిలదీస్తూ పలు చానళ్లు చర్చలు సాగించాయి.

'గుర్తుతెలియని' పిన్నెల్లి!

సిట్ రాకతోనే గుట్టు బయటపడింది

(అమరావతి/నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ఎప్పుడో 13వ తేదీ పోలింగ్ రోజున జరిగిన ఈవీఎం ధ్వంసం ఘటన! 9 రోజుల తర్వాత, మంగళవారం వెలుగులోకి వచ్చింది! స్వయంగా ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డే ఈవీఎంను బద్దలు కొట్టినా... అంతా గప్‌చుప్! జగన్ పాలనలో రాజ్యమేలిన భయానికి... యంత్రాంగం సలాం కొట్టిన తీరుకు ఇదే నిదర్శనం! పోలింగ్ రోజున మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పోలింగ్ బూత్‌లోకి పిన్నెల్లి తన అనుచరులతో జొరబడ్డారు. నేరుగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్ దగ్గరికి వెళ్లి.. ఈవీఎంను బద్దలు కొట్టారు. వీవీప్యాట్ మెషిన్‌నూ విసిరికొట్టారు. దీనిపై సంబంధిత బూత్ ప్రిసైడింగ్ ఆఫీసర్ అదే రోజున సెక్టోరల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ... ఫిర్యాదులో పిన్నెల్లి పేరు ప్రస్తావించలేదు. 'గుర్తు తెలియని వ్యక్తులు' అని రాశారు. సెక్టోరల్ ఆఫీసర్ కూడా పోలీసులకు అదే విధంగా ఫిర్యాదు చేశారు. చివరికి... వీఆర్వో కూడా 'గుర్తు తెలియని' వాంగ్మూలమే ఇచ్చారు. పోలీసులూ 'గుర్తు తెలియని వ్యక్తుల'పైనే కేసు నమోదు చేశారు. 15వ తేదీన ఇదే కేసులో మరి కొన్ని సెక్షన్లు జత చేశారు. ఎమ్మెల్యే పేరు మాత్రం చేర్చలేదు. అసలు విషయం ఏమిటంటే... పిన్నెల్లి 20 ఏళ్లుగా మాచర్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన బూత్‌లోకి రాగానే పోలింగ్ సిబ్బంది లేచి నిలబడి, దండాలు పెట్టారు. అయినా సరే... 'గుర్తు తెలియని వ్యక్తులు' అని ప్రిసైడింగ్ ఆఫీసర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజానికి... పాల్వాయిగేటులో ఈవీఎం విధ్వంసం కేసు 'గుర్తు తెలియకుండా' గల్లంతయ్యేదే! కానీ పోలింగ్ జరిగిన మరుసటి రోజు మాచర్ల, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. మొత్తం ఘటనలపై 'సిట్' విచారణకు ఆదేశించింది. హింసాత్మక ఘటనలకు సంబంధించి నమోదు చేసిన సెక్షన్లు, నిందితులు, అరెస్టులపై 'సిట్' ఒక్కో కేసును నిశితంగా పరిశీలించింది. ఇదే క్రమంలో... పాల్వాయి గేటులో పోలింగ్ బూత్‌లో విధ్వంసం కేసులో 'గుర్తు తెలియని వ్యక్తుల'ను చూసి ఆశ్చర్యపోయింది. ఇంకా ఎందుకు గుర్తుపట్టలేదని పోలీసులను ప్రశ్నించింది. దీంతో వారు నీళ్లు నమిలారు. సంబంధిత ఫుటేజ్ కోసం సీఈవోకు లేఖ రాశారు. ఈనెల 20న ఆ దృశ్యాలను సీఈవో కార్యాలయం అందించింది. అదే రోజున ఈ కేసులో పిన్నెల్లిని ఏ1గా చేర్చారు. ఈవీఎం విధ్వంసం దృశ్యాలు మంగళవారం బయటికి వచ్చాయి. మొత్తంగా తేలిందేమిటంటే... ఎమ్మెల్యేకు భయపడి ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ సిబ్బంది నోరు మెదపలేదు. సెక్టోరల్ ఆఫీసర్ కూడా అంతే. 'సిట్' రంగంలోకి దిగాకగానీ అసలు విషయం బయటపడలేదు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూంలో మాచర్ల నియోజకవర్గ ప్రత్యేక అధికారిగా ఉన్న డీపీవో విజయభాస్కరరెడ్డి ఈవీఎంల ధ్వంసాన్ని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఏమీ తెలియనట్టు మిన్నకున్నారు. ఈ అంశంపై కూడా సిట్ విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

వెంటనే పిన్నెల్లిని అరెస్ట్ చేయండి

● సీఈవోకు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన్ను అరెస్ట్ చేయకుండా జాప్యం చేసినందుకు రాష్ట్ర సీఈవోపై మండిపడింది. వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించింది. ఎక్స్ వేదికగా టీడీపీ నేత లోకేశ్ పోస్టు చేసిన వీడియో లింక్‌ను జతచేస్తూ పలు ఆదేశాలు జారీ చేసింది. సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర నివేదిక సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్ ఆదేశించారు. కాగా.. ఎమ్మెల్యే పిన్నెల్లితో పాటు ఇతర నిందితులను వీలైనంత త్వరలో అరెస్టు చేస్తామని ఎన్నికల కమిషన్‌కు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా నివేదించారు. ఎఫ్ఐఆర్‌లో ఏ1గా ఎమ్మెల్యేను చేర్చి నిందితులను అరెస్టు చేసేందుకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈవీఎం ధ్వంసం లో ప్రధాన నిందితుడైన పిన్నెల్లి పారిపోయినట్లు తెలియడంతో లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్టు వివరించారు.

పిన్నెల్లి పరార్!

(మొదటి పేజీ తరువాయి)

వేట సాగిస్తున్నాయి. పోలింగ్ రోజు ఈవీఎం ధ్వంసం చేసిన దృశ్యాలు బయటపడటంతో... ఆ కేసులో పిన్నెల్లిని పోలీసులు ఏ1గా చేర్చారు. నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదంటూ కేంద్ర ఎన్నికల సంఘం కూడా నిలదీసింది. డీజీపీకి గట్టి ఆదేశాలు జారీ చేసింది. దీంతో... పిన్నెల్లి సోదరులను పట్టుకునేందుకు 4 పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు హైదరాబాద్, దాని చుట్టుపక్కల తెలంగాణ జిల్లాల్లో విస్తృతంగా గాలిస్తున్నాయి. పిన్నెల్లి సోదరులు విదేశాలకు పారిపోవాలని చూస్తున్నారని అనుమానించిన పోలీసులు.. అన్ని ఎయిర్‌పోర్టులను అప్రమత్తం చేశారు. మరోవైపు పిన్నెల్లి విదేశాలకు పరారయినట్టు కూడా వార్తలు హల్‌చల్ చేశాయి.

అదిగో... అక్కడ... ఇక్కడ...

బుధవారం పిన్నెల్లితో 'ఎలుకా - పిల్లి'లాగా పోలీసుల చేజింగ్ సాగింది. పిన్నెల్లి సోదరులకు తెలంగాణలో కొందరు బీఆర్ఎస్ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. వారి ఫామ్‌హౌస్‌లో తలదాచుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఏపీ పోలీసులు ఆ కోణంలోనూ విచారణ చేపట్టారు. పిన్నెల్లి సోదరులు హైదరాబాద్ నుంచి వాహనంలో వెళ్తున్నారన్న సమాచారంతో అప్రమత్తమై.. సంగారెడ్డి జిల్లా పోలీసుల సహకారంతో పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలో తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో పిన్నెల్లి వాహనం అటు వైపు వచ్చింది. పోలీసులను గమనించి పిన్నెల్లి సోదరులు వాహనం దిగి మరో వాహనంలో పారిపోయినట్టు తెలుస్తున్నది. పిన్నెల్లి తన సెల్‌ఫోన్ కూడా వాహనంలోనే వదిలేసినట్లు సమాచారం. పోలీసులు వాహనంతో పాటు డ్రైవర్‌ను, పిన్నెల్లి గన్‌మెన్‌ను, అతని అనుచరులను అదుపులోకి తీసుకొని సంగారెడ్డి సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం మాచర్ల పోలీసులకు అప్పగించారు. అయితే, సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో బాత్‌రూమ్ సింక్‌లు తయారుచేసే ఫ్యాక్టరీ ఆవరణలో ఆయన దొరికిపోయినట్టు ప్రచారం జరిగింది. కానీ తెలంగాణ పోలీసులు స్పష్టత ఇవ్వలేదు. మాచర్ల పోలీసులనే అడగాలని చెప్పారు. బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన ఓ వ్యాపారికి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్, జడ్చర్ల పరిసరాల్లో పత్తి విత్తనాల మిల్లు ఉండేది. ఏడాది క్రితమే దానిని మూసివేశారు. సదరు వ్యాపారి 2019 ఎన్నికల్లో పర్చూరు నుంచి వైసీపీ తరఫున పోటీచేయాలనుకున్నారు. కానీ టికెట్ దక్కలేదు. మాచర్ల నుంచి పరారు కాగానే.. పిన్నెల్లి సోదరులు తొలుత ఆ వ్యాపారి వద్దకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భూత్పూర్, జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అయితే, అప్పటికే పిన్నెల్లి సోదరులు పారిపోయారు. పిన్నెల్లికి ఆశ్రయం ఇచ్చినవారినీ అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. రామకృష్ణారెడ్డి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ వేసుకున్నారని, పోలీసుల అప్రమత్తతతో ఆయన వ్యూహం బెడిసికొట్టిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వర్గాల కథనం ప్రకారం, బుధవారం మధ్యాహ్నం 1.20 గంటలకు హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు పిన్నెల్లి సోదరులు ప్లాన్ చేసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎయిర్‌పోర్ట్‌కు వారు చేరుకోవాల్సి ఉంది. అయితే, అప్పటికే ఏపీ పోలీస్ టీమ్ మాటు వేసి ఉందని తెలుసుకొని ఎయిర్‌పోర్టు వద్దకు వెళ్లలేదు. ఇప్పుడు అరెస్ట్ అయితే చాలాకాలం బయటకు రాలేమనే విదేశాలకు పారిపోయే ఆలోచనలో వారు ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు పిన్నెల్లిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. అన్ని విమానాశ్రయాలను అప్రమత్తం చేశారు. విదేశాలకు పరారయ్యేందుకు పిన్నెల్లి సోదరులు ఒక ప్రముఖ టీవీ చానల్‌కు చెందిన వ్యక్తుల సహకారం తీసుకున్నట్టు సమాచారం. ఆంధ్ర సరిహద్దులు దాటే సమయంలో ఆ చానల్ ప్రతినిధి వారితో ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఆ చానల్ వాహనాల్లోనే వారు తిరుగుతున్నారని సమాచారం.



సంగారెడ్డి జిల్లా సీసీఎస్ పోలీసుల అదుపులో పిన్నెల్లి డ్రైవరు, గన్‌మెన్..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శేషగిరిరావు, చిత్రంలో జూలకంటి బ్రహ్మారెడ్డి తదితరులు

'ఎమ్మెల్యేనే అడ్డుకునేంత మగాడివా.. నువ్వెలా బతికుంటావో చూస్తా!'

» ఇప్పటికీ నన్ను ఫోన్‌లో బెదిరిస్తున్నారు

» ఎమ్మెల్యేనే రెండుసార్లు ఈవీఎంను ఎత్తిపడేశారు

» ఏంటని ప్రశ్నించిన నాపై ఆగ్రహించారు

» పిన్నెల్లి సోదరుల నుంచి నాకు ప్రాణహాని

» బాధితుడు నంబూరు శేషగిరిరావు వేదన

» అండగా ఉంటాం : చంద్రబాబు భరోసా

గుంటూరు, అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని బాధితుడు, టీడీపీ నేత నంబూరు శేషగిరిరావు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యం నిమిత్తం గుంటూరు వచ్చిన శేషగిరిరావు బుధవారం ఉదయం మాచర్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాల్వాయి గేట్ వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంటుగా కూర్చున్న శేషగిరిరావుపై ఎమ్మెల్యే పిన్నెల్లి సమక్షంలో అమానుష దాడి జరిగిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన మీడియా వద్ద స్పందించారు. "పోలింగ్ కేంద్రంలోకి స్వయంగా ఎమ్మెల్యేనే వచ్చి ఈవీఎంలు రెండుసార్లు ఎత్తి పడేశారు. 'ఏంటి సార్! అలా పడేస్తున్నారని అడిగితే జాగ్రత్త అంటూ నాకు వేలు చూపించారు. పీవోలు గది తలుపులు వేశారు. నన్ను బయటికి పంపించారు. నేను ఇంటికి వెళుతుంటే కారులో వచ్చి కర్రలతో నాపై దాడి చేశారు. తల, చెయ్యి, కాళ్లమీద, తొడల మీద కొట్టారు. నేను చచ్చిపోతానేమోనని భయపడిన మా పిల్లలు...వారిని అడ్డుకుని నన్ను కాపాడి తీసుకెళ్లారు. నేను ఫిర్యాదు చేయడానికి భయపడ్డాను. మమ్మల్ని చంపేస్తారని భయపడి మేం మా పొలాల్లోనే దాక్కున్నాం. పోలింగ్ జరిగిన మరునాడు కారంపూడి మీద దాడి చేసిన రోజు మామీద కూడా దాడి చేస్తారని భయపడ్డాం. నాకు తగిలిన దెబ్బలకు ప్రైవేటు ఆర్‌ఎంపీతో కుట్లు వేయించుకున్నా. ఇప్పటికీ నాకు బెదిరింపులు వస్తున్నాయి. 'ఎమ్మెల్యేనే అడ్డుకునేంత మగాడివా.. నువ్వెలా బతికుంటావో చూస్తా'నని ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. నన్ను, నా కుటుంబాన్ని పోలీసులే కాపాడాలి. మాకు రక్షణ కల్పించాలి. నాకు ఏమైనా జరిగితే పిన్నెల్లి సోదరులదే బాధ్యత" అని శేషగిరిరావు వాపోయారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, కనపర్తి శ్రీనివాసరావు సహకారంతో డీజీపీని కలిసి వాస్తవాలు వివరించి ప్రాణ రక్షణ కల్పించాలని కోరతానని తెలిపారు.

చంద్రబాబు భరోసా..

పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రం ఘటనలో బాధితుడు నంబూరి శేషగిరిరావును టీడీపీ అధినేత చంద్రబాబు పరామర్శించారు. బుధవారం శేషగిరిరావును చంద్రబాబు ఫోన్ చేసి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈవీఎంను ధ్వంసం చేసిన పిన్నెల్లిని ధైర్యంగా అడ్డుకున్నావంటూ ఆయనను అభినందించారు.

జగన్‌కు 'కౌంట్ డౌన్!'

» పార్టీ ఆఫీసు ప్రాంగణంలో డిజిటల్ బోర్డు



ఇది తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు. ఎన్నికల ఫలితాలు వెలువడే జూన్ 4వ తేదీకి 'కౌంట్ డౌన్' ఇలా మొదలుపెట్టారు. పోలింగ్ సరళితోనే వైసీపీకి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని... 4న ఓటమి ఖరారవుతుందని ఇప్పటికే మెజారిటీ సర్వేలు, విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. '151 దాటేస్తాం' అని ఇటీవల ఐప్యాక్ ప్రతినిధుల భేటీలో జగన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. ఫలితాలు వెలువడేలోపు పార్టీ శ్రేణుల్లో భరోసా నింపేందుకే ఈ వ్యాఖ్య చేసినట్లు తెలుస్తోంది. 'మళ్లీ గెలుస్తున్నాం' అని చెబితే కాస్త నమ్మకంగా, భరోసాగా ఉండేదని... 151 దాటేస్తామనడంతో అంతా ఉత్తిదే అని తేలిపోయిందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. అవన్నీ పక్కన పెట్టేసి... 'జగన్ అనే నేను' అనే అక్షరాల కింద ఫలితాలకు కౌంట్‌డౌన్ క్లాక్ పెట్టేశారు. దాని కింద 'సిద్ధం' అని కూడా రాశారు. ప్రమాణ స్వీకారానికి 'సిద్ధం' అనుకుంటే, అది 4వ తేదీన జరిగే అవకాశమేలేదు. అందుకే... ఆ 'సిద్ధం' ఓటమికే అని సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ఏబీవీకి 'ఆన్‌లైన్' మద్దతు

» 87 దేశాల నుంచి 35 వేల మందికిపైగా తెలుగు ప్రజల సంతకాలు

» ఏపీ టుమారో అభిప్రాయ సేకరణ

హైదరాబాద్, అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావు విషయంలో సీఈసీ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఏపీ టుమారో అధ్యక్షుడు నలమోతు చక్రవర్తి కోరారు. ఏబీవీపై జగన్ ప్రభుత్వ కక్షపూరిత చర్యలను వ్యతిరేకిస్తూ 87 దేశాల నుంచి 35 వేలకు పైగా తెలుగు ప్రజలు మద్దతు ప్రకటించారని 'ఏపీ టుమారో' స్వచ్ఛంద సంస్థ తెలిపింది. 'చేంజ్.ఆర్గ్' ద్వారా ఆన్‌లైన్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టగా.. ఆయా దేశాల నుంచి 35 వేల మందికి పైగా చేసిన సంతకాలను జోడించి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రులకు పంపించినట్లు చక్రవర్తి బుధవారం తెలిపారు.

రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి

» ఎన్నికల ప్రక్రియ అయ్యాక ఏపీ సీఎంను కలుస్తా: రేవంత్‌రెడ్డి



తిరుమల ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో రేవంత్

తిరుమల, మే 22(ఆంధ్రజ్యోతి): రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి. అభివృద్ధివైపు నడవాలి. ఏపీలో ఏర్పడబోయే ప్రభుత్వంతో తెలంగాణ సీఎంగా సత్సంబంధాలు కొనసాగిస్తా. రెండు రాష్ట్రాలు సమస్యలన్నిటినీ పరిష్కరించుకుని, కలిసికట్టుగా అభివృద్ధి పథంలో పయనించాలి. ఒకరికి ఒకరు సహకరించుకుంటూ ముందుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. శ్రీవారి దర్శనానంతరం బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడ్డాక స్వామి దర్శనం చేసుకోవాలని ప్రయత్నించినా.. సమయం దొరకలేదని, ఇన్నాళ్లకు స్వామి దర్శన భాగ్యం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం తరఫున తిరుమలలో ఓ సత్రం, కల్యాణమండపం నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు. ఏపీలో ఎన్నికల ప్రక్రియ ముగిశాక ఏపీ ముఖ్యమంత్రిని కలిసి తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి సేవలో భాగస్వాములవుతామన్నారు. మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్న రేవంత్‌రెడ్డి, బుధవారం ఉదయం మనవడి పుట్టింట్రుకల మొక్కు చెల్లించారు. అనంతరం సంప్రదాయ వస్త్రధారణతో కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లారు. ధ్వజస్తంభానికి మొక్కుకుని రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు రేవంత్‌రెడ్డి కుటుంబానికి ఆశీర్వచనం చేశారు. ఈవో ధర్మారెడ్డి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

డీఎస్పీ చైతన్యను ఎవరు రప్పించారు?

» పోలీసు అధికారులను ప్రశ్నించిన సిట్

» ఎంత అడిగినా జవాబివ్వని వైనం



డీఎస్పీ చైతన్య

తాడిపత్రి టౌన్, మే 22: అనంతపురం జిల్లా తాడిపత్రిలో పోలింగ్ సందర్భంగా తలెత్తిన హింసాత్మక ఘటనలను అదుపు చేసే పేరిట అన్నమయ్య జిల్లా రాజంపేట డీఎస్పీ చైతన్యను ఎవరు రప్పించారనే కోణంలో ఎన్నికల సంఘం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాడిపత్రిలో విచారణ చేపట్టింది. సిట్ సభ్యులు శ్రీనివాస్, భూషణం, శ్రీనివాసులు ఈ విషయమై జిల్లాలోని పలువురు పోలీసు అధికారులను ప్రశ్నిస్తున్నా.. స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని తెలిసింది. బుధవారం కూడా కొందరు అధికారులను వారు విచారించారు. తాడిపత్రిలో పనిచేసే సమయంలో వైసీపీ నాయకులతో అంటకాగిన డీఎస్పీ చైతన్యను ఎన్నికల అల్లర్ల సమయంలో ఎందుకు రమ్మన్నారని సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. శాంతిభద్రతల పరిరక్షణ పేరిట తాడిపత్రికి ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి వచ్చిన డీఎస్పీ చైతన్య.. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌తోపాటు టీడీపీ కార్యకర్తలను చితకబాదారు. తాడిపత్రి గొడవలకు బాధ్యులను చేస్తూ ఎస్పీ అమిత్ బర్దార్, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, తాడిపత్రి టౌన్ సీఐ మురళీకృష్ణను ఈసీ సస్పెండ్ చేసింది. కానీ డీఎస్పీ చైతన్యపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదు. రాజకీయ ప్రోద్బలంతోనే ఆయన్ను తాడిపత్రికి రప్పించారని ప్రచారం జరుగుతోంది. ఆయన వచ్చీరావడంతోనే టీడీపీ వాళ్లను టార్గెట్ చేశారని, ఆయన వెళ్లిపోయాకే పరిస్థితి అదుపులోకొచ్చిందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

అనంతపురం జిల్లా తాడిపత్రిలో పోలింగ్, ఆ మరుసటి రోజు జరిగిన గొడవలకు సంబంధించి ముందస్తు సమాచారం ఇవ్వడంలో విఫలమైనందుకు ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఆ రెండ్రోజులూ అక్కడి పరిస్థితులను అధికారులకు ఈశ్వర్‌రెడ్డి ఎప్పటికప్పుడు చేరవేశారని, ఎవరో నిర్లక్ష్యానికి మరెవరినో బలిపశువును చేశారని పోలీసు శాఖ నుంచే విమర్శలు వస్తున్నాయి. మరికొందరిపైనా చర్యలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది.

తాడిపత్రి ఘటనలో అమాయకులపై కేసులు: టీడీపీ

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలో జరిగిన అల్లర్లలో సంబంధంలేదని వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని టీడీపీ నేతలు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ ఆరోపించారు. అనంతపురం జిల్లాతో సంబంధంలేని డీఎస్పీ చైతన్య అర్ధరాత్రి పూట జేసీ ఇంట్లో ప్రవేశించి దాడులకు పాల్పడ్డారన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అనర్హుడిగా ప్రకటించి, మరోసారి పోటీ చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందించారు.

ఏపీకి 'అష్ట'కష్టాలు!

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని, జనాభా ప్రాతిపదికన ఆదాయం, అప్పుల కేటాయింపులు జరపాలని నాటి సీఎం చంద్రబాబు కేంద్రానికి పలుమార్లు విన్నవించారు. లేఖలు కూడా రాశారు. కానీ ఇంతవరకూ ఏ ఒక్క నిబంధనను కూడా సవరించలేదు. వాటిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే ప్రస్తుత సీఎం జగన్ తెస్తున్న రూ.లక్షల కోట్ల అప్పులతో గాడితప్పిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కొంతమేర కోలుకొనే అవకాశం ఉంటుంది. రాష్ట్ర జనాభా 58.42 శాతం అయితే విభజన చట్టంలో 14వ ఆర్థిక సంఘం కేవలం 46శాతం ఆదాయాన్నే కేటాయించింది. దీనివల్ల నిధుల కొరత ఏర్పడటమే కాకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి. 2020-21 నుంచి 15వ ఆర్థిక సంఘం అమల్లోకి వచ్చింది. 14వ ఆర్థిక సంఘంలో జరిగిన అన్యాయాన్ని జగన్ సర్కారు ప్రశ్నించకపోగా, 15వ ఆర్థిక సంఘం నిధులను ఇష్టారీతిగా వాడేశారు. కేంద్రం ప్రతినెలా రాష్ట్రానికి ఇచ్చే రెవెన్యూ లోటు గ్రాంటు నిధుల కింద 15వ ఆర్థిక సంఘం రూ.30,500 కోట్లు కేటాయించింది. వీటిని ఐదేళ్లపాటు సమానంగా వాడుకోవాలి. అంటే ఏడాదికి రూ.6,100 కోట్లు చొప్పున వాడాలి. కానీ, జగన్ మొదటి ఏడాది రూ.17,000 కోట్లు, రెండో ఏడాది రూ.11,000 కోట్లు, మూడు, నాలుగో ఏడాదుల్లో రూ.2,500 కోట్లు వాడారు. ఇవి చాలకపోవడంతో నాలుగో ఏడాది విభజన హామీ కింద రావాల్సిన రెవెన్యూ లోటు రూ.10,000 కోట్లు తెచ్చి వాడేశారు. విభజన నాటి రెవెన్యూ లోటు కింద ఏపీకి ఇంకా రూ.11,000 కోట్లు రావాల్సి ఉంది. విభజన నాటికి ఉమ్మడి ఏపీ సాధించిన రూ.9,15,852 కోట్ల జీడీపీలో ఏపీకి రూ.4,64,272 కోట్లు అంటే 50.69 శాతం మాత్రమే కేటాయించారు. జనాభా ప్రాతిపదికన కేటాయించి ఉంటే మరో 8శాతం అదనంగా లభించి ఉండేది. దీంతో రాష్ట్ర తలసరి ఆదాయం బాగా తగ్గిపోయింది. విభజన అనంతరం 2013-14లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,12,162 కాగా ఏపీకి రూ.82,870గా ఉంది. రెండు రాష్ట్రాల మధ్య రూ.30,292 తేడా ఉంది. ఈ లోటును పూడ్చటానికి ఏపీకి కేంద్రం ప్రత్యేకంగా నిధులేమీ కేటాయించలేదు.

1. అశాస్త్రీయంగా ఆదాయం కేటాయింపు

ఏపీలో 58.42 శాతం జనాభా ఉన్నప్పటికీ.. 14వ ఆర్థిక సంఘం 46శాతం ఆదాయాన్నే రాష్ట్రానికి కేటాయించింది. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రానికి సంక్షేమ ఖర్చులు, ఇతర ఖర్చులు అధికంగానే ఉంటాయి కానీ, ఆదాయం మాత్రం తక్కువగా కేటాయించారు.

2. భౌగోళిక ప్రాతిపదికన ఆస్తుల విభజన

ఈ నిబంధన ప్రకారం తెలంగాణలో ఉన్న సంస్థలు, కార్పొరేషన్లు, కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ ఆస్తులన్నీ ఆ రాష్ట్రానికే సొంతమవుతాయి. వీటన్నింటి నిర్మాణంలో ఏళ్ల తరబడి భాగస్వామ్యం ఉన్న ఏపీకి ఎలాంటి వాటా లభించదు. పైగా ఆదాయం అధికంగా వచ్చే హైదరాబాద్ తెలంగాణకే దక్కింది. ఎంసీహెచ్‌ఆర్డీ అనేది పెద్ద వ్యవస్థ. రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడే హైదరాబాద్‌లో అనేక ఎకరాల్లో దీన్ని నిర్మించారు. కానీ, ఇందులో ఏపీకి వాటా లేదు. కనీసం దాని విలువ కూడా కట్టివ్వలేదు. దీంతో బాపట్లలోని పాత భవనంలో ఏపీకి చెందిన ఎంసీహెచ్‌ఆర్డీని కొనసాగిస్తున్నారు. అలాగే, ఉమ్మడి రాష్ట్రం సచివాలయంలోని కొన్ని బ్లాకులను 2019లో జగన్ ప్రభుత్వం తెలంగాణకు అప్పగించింది. దీనికి సంబంధించి ఎలాంటి విలువ కట్టలేదు. ఏపీకి రూపాయి కూడా ఇవ్వలేదు.

3. జనాభా ప్రాతిపదికన అప్పులు పంచడం

ఏపీలో జనాభా ఎక్కువ. కాబట్టి రాష్ట్రం వాటా కింద అప్పులు ఎక్కువ వచ్చాయి. లోన్లు, గ్యారంటీలు, ఇతర అప్పులను జనాభా ప్రాతిపదికన విభజించడంతో ఏపీకి తీరని ఆర్థిక నష్టం వాటిల్లింది.

4. వినియోగం ప్రాతిపదికన విద్యుత్తు వాటాలు

తెలంగాణ, ఏపీల్లో విద్యుత్తును ఎక్కడ ఎక్కువ వినియోగిస్తున్నారనే ప్రాతిపదికన విద్యుదుత్పత్తి కేంద్రాల్లో వాటాలు పంచారు. హైదరాబాద్ ఉన్న తెలంగాణలోనే విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీని ఆధారంగా జనాభా ఎక్కువగా ఉన్న ఏపీకి తక్కువ విద్యుత్తును కేటాయించి, జనాభా తక్కువగా ఉన్న తెలంగాణకు ఎక్కువ కేటాయించారు. దీంతో విభజన తర్వాత ఏపీలో డిమాండ్‌కు తగినట్టుగా విద్యుత్తును ప్రభుత్వం సరఫరా చేయలేకపోయింది.

5. పన్నుల్లోనూ అదే తేడా

పన్నుల పంపకంలో కూడా ఏపీకి అన్యాయం జరిగింది. విభజన నాటికి ప్రభుత్వం ప్రజలకు, కంపెనీలకు, ఇతర సంస్థలకు తిరిగి చెల్లించాల్సిన పన్ను రీఫండ్లను జనాభా ప్రాతిపదికన విభజించారు. దీనివల్ల ఎక్కువ జనాభా ఉన్న ఏపీపై అధిక భారం పడింది. అలాగే, ప్రజలు, ఇతర సంస్థలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను మాత్రం భౌగోళిక ప్రాతిపదికన, ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంత ప్రభుత్వానికి చెల్లించాలన్న నిబంధన పెట్టారు. ఈ నిబంధనతో తెలంగాణ ప్రభుత్వానికి లాభం చేకూరగా, ఏపీకి రూ.3,800 కోట్ల నష్టం వాటిల్లింది.

6. సింగరేణిపై ద్వంద్వ వైఖరి

సింగరేణి సంస్థ 9వ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ భౌగోళిక ప్రాతిపదికన ఆ కంపెనీలో తెలంగాణకు 51 శాతం ఈక్విటీ కేటాయించారు. విజయవాడ కొండపల్లిలో ఉన్న ఉన్న సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్‌ఎంఈఎల్ కూడా 9వ షెడ్యూల్‌లో ఉంది. భౌగోళికంగా ఏపీలో ఉన్న ఈ సంస్థ రాష్ట్రానికే దక్కాలి. కానీ, దాన్ని కూడా తెలంగాణకే కేటాయించారు.

7. ఏపీపైనే వేల కోట్ల అప్పుల భారం

విభజన తర్వాత ఏపీకి రూ.1,30,000 కోట్ల రుణ భారాన్ని కేటాయించారు. దీంతోపాటు రూ.33వేల కోట్ల రుణాన్ని విభజించకుండా కేవలం ఏపీ ఖాతాలో పెట్టడం రాష్ట్ర ఖజానాను కుంగదీసింది. దీంతో ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి చాలా తగ్గిపోయింది. కనీసం ఈ రూ.33,000 కోట్లను జనాభా ప్రాతిపదికన పంచినా ప్రభుత్వంపై కొంత భారం తగ్గేది. కానీ, మొత్తం ఏపీ ఖాతాలోనే వేయడంతో వాటి అసలు, వడ్డీ చెల్లింపులతో రాష్ట్రం మరింత కుంగిపోయింది.

8. పెన్షన్ రుణాలు

ఉమ్మడి రాష్ట్రం పెన్షన్ రుణాలను జనాభా ప్రాతిపదికన విభజించి ఏపీపై మోయలేని భారం వేశారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు పూర్తవుతున్నా విభజన చట్టంలోని అనేక సమస్యలు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయి. వీటి పరిష్కారానికి టీడీపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రయత్నించింది. జగన్ సీఎం అయ్యాక విభజన అంశాలపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

కోడ్ ఉన్నా 'క్లీన్'గా కట్టబెట్టేశారు!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం ప్రోత్సహిస్తోందన్న మిషతో జగన్ సర్కారు భూసంతర్పణ నిర్ణయం తీసుకోవడం ఇంధన రంగ నిపుణులను విస్మయానికి గురి చేస్తోంది. ఓవైపు కోడ్ అమలు.. ఇంకోవైపు రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు తథ్యమంటూ జోరుగా ప్రచారం జరుగుతున్న సమయంలో క్లీన్ ఎనర్జీకి ఏకంగా 1,725 ఎకరాలు కట్టబెట్టడాన్ని తప్పుబడుతున్నారు. అస్మదీయుల కోసమే ప్రభుత్వ పెద్దలు నిర్ణయం తీసుకున్నారని విమర్శిస్తున్నారు.

క్లీన్ వెనుక ప్రభుత్వ పెద్దలు..

ఫలితాల ముంగిట ఇంత హడావుడిగా క్లీన్ సంస్థకు భూపందేరం వెనుక ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. వెబ్‌సైట్‌లో వెతికితే.. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ (బార్మర్) ప్రైవేట్ లిమిటెడ్‌ను 2021 జూలై 12వ తేదీన కేవలం లక్ష రూపాయల పెట్టుబడితో స్థాపించారు. అంటే ఈ కంపెనీ పెట్టి మూడేళ్లయినా పూర్తికాలేదు. ఇది ఢిల్లీ పారిశ్రామికవాడలో ఉన్నట్లుగా పేర్కొన్నారు. అరుణ్ త్రిపాఠీ, సీతాంశు రస్తోగి డైరెక్టర్లుగా ఉన్నారు. కంపెనీ కార్యకలాపాలు అంతంతమాత్రమే. ఆర్థిక లావాదేవీలు కూడా పారదర్శకంగా లేవు. రూ.లక్ష పెట్టుబడితో.. దాదాపు రెండేళ్ల పదినెలల కింద స్థాపించిన కంపెనీకి 1,725 ఎకరాలు కట్టబెట్టడంపై సందేహాలు నెలకొన్నాయి.

పది చదివి.. కోట్లకు పడగలెత్తి

బెట్టింగుల్లో ఆరితేరిన 'లంకపల్లి'

» ఖరీదైన విల్లాలు, కార్లతో విలాసాలు

» రేవ్ పార్టీతో బయటపడిన బండారం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

బెట్టింగులు మాత్రమే తెలిసిన కుర్రాడు... కేవలం 10వ తరగతి మాత్రమే చదివినోడు... బుకీగా ఎదిగి విలాసాలకు చిరునామాగా మారాడు. కోట్లాది రూపాయల ఆస్తులను పోగేశాడు. ఫార్మా కంపెనీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలంటూ ప్రపంచానికి అందమైన అబద్ధాన్ని పరిచయం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు, రాజకీయ నేతలతో సన్నిహిత సంబంధాలను నెరిపాడు. చివరకి బెంగళూరు శివారు ఫాం హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించి పోలీసులకు చిక్కాడు. అతడే విజయవాడ అంజనేయ వాగు సెంటర్‌కు చెందిన లంకపల్లి వాసు అలియాస్ వాసు. పేదరికాన్ని జయించడానికి అక్రమ మార్గాన్ని ఎంచుకున్న వాసు తాను సంపాదించిన రూ.వందల కోట్లతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో, వివిధ రాష్ట్రాల్లో తన అభిరుచులకు తగ్గట్టుగా విల్లాలను, అతిథి గృహాలను నిర్మించుకున్నాడు. పోలీసులకు చిక్కిన తరువాత వాసుకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వాసుకు తల్లి, అక్క, చెల్లి ఉన్నారు. వాళ్లంతా ఆంజనేయవాగులోనే ఉంటారు. తండ్రి లేరు. బెంగళూరు పోలీసులకు, పార్టీకి వచ్చిన వారికి తన తండ్రికి ఫార్మ కంపెనీలు ఉన్నాయని చెప్పాడు. కొంత మందికి రియల్ ఎస్టేట్ వ్యాపారమని చెప్పాడు. వాస్తవానికి ఈ రెండింటితో వాసుకు ఎలాంటి పరిచయం లేదు. అతడితో పరిచయం ఉన్నవారు, స్థానికులు... వాసు 10 వరకే చదువుకున్నాడని చెబుతున్నారు. తల్లి ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించేవారు. వాసు మాత్రం స్నేహితులతో తిరుగుతూ బెట్టింగ్‌ల వైపు అడుగులు వేశాడు. మెల్లగా బుకీగా ఎదిగాడు. అక్కడితో ఆగలేదు. తన చేతికింద వందల మంది బుకీలను పెట్టుకునే స్థాయికి ఎదిగాడు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి కాస్మోపాలిటన్ నగరాల్లో ఉన్న ప్రధాన బుకీలతో స్నేహాన్ని పెంచుకున్నాడు. బెట్టింగునే ఆదాయ వనరుగా మార్చుకున్న వాసు... ఒక్క విజయవాడ నగరంలోనే 150 మంది వరకు బుకీలను ఏర్పాటు చేసుకున్నాడు. కొన్నాళ్ల క్రితం విశాఖలో జింబాబ్వే, ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఎక్కువ మంది ఆస్ట్రేలియా గెలుస్తుందని బెట్టింగ్ కట్టారు. ఊహించని విధంగా జింబాబ్వే గెలిచింది. ఆ సమయంలో వాసుకు అనుబంధంగా ఉన్న బుకీలు రూ.5 కోట్ల వరకు ఎగ్గొట్టినట్టు సమాచారం.

వాసు... ది బుకీ



విల్లాలన్నీ కోట్లలోనే...

ఆంజనేయవాగులో ఒక షెడ్‌లో ఉండే లంకపల్లి వాసు.. విజయవాడలో వైవీరావు ఎస్టేట్ వద్ద రూ.4 కోట్లతో సొంతంగా విల్లా కట్టించుకున్నాడు. దీంతోపాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల్లో ఈ తరహా విల్లాలున్నాయి. ప్రతి విల్లాకూ సీసీ కెమెరాల రక్షణ ఉంది. రూ.1.50 కోట్ల విలువైన 4కార్లను అతడు వినియోగిస్తున్నాడు. మరో 10కార్లు బినామీల పేర్లతో కొన్నాడని సమాచారం. నెలకోసారి విజయవాడకు వస్తుంటాడు. అవన్నీ ఇక్కడున్న బుకీలకు, కుటుంబ సభ్యులకు మాత్రమే తెలుస్తుంది.

మమ్మల్ని కాపాడండి

» కిర్గిస్థాన్‌లో భయంగుప్పిట్లో భారత వైద్య విద్యార్థులు



కిర్గిస్థాన్‌లో భారతీయులపై దాడి చేస్తున్న స్థానికులు, ఓ విద్యార్థి మెడపై గాయం

ఒంగోలు కార్పొరేషన్, మే 22: వైద్య విద్యను అభ్యసించేందుకు కిర్గిస్థాన్ వెళ్లిన భారతీయ విద్యార్థులు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఈ నెల 13న ఆ దేశ రాజధాని బిష్కెక్‌లో స్థానిక, ఈజిప్టు విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న గొడవ.. ప్రాంతీయ విద్వేషాలు, భౌతిక దాడులకు దారితీసింది. ఘర్షణ జరిగిన బిష్కెక్‌కు 20కిలోమీటర్ల దూరంలోని ఏషియన్ మెడికల్ యూనివర్సిటీలో సుమారు 3,500 మంది భారతీయ విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వారిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు 1500మంది ఉన్నారు. అందులో ఏపీవారు 400 మంది ఉండగా, ప్రకాశం జిల్లాకు చెందినవారు పదిహేను మందిపైనే ఉన్నారు. ప్రాంతీయ విద్వేషాలతో విదేశీ విద్యార్థులపై స్థానికులు దాడులు చేస్తున్నారు. దీంతో మన విద్యార్థులు దాడుల భయంతో రూముల్లోనే గడుపుతున్నారు. అక్కడే ఉండలేక, స్వదేశానికి రాలేక ఇబ్బందిపడుతున్నారు. బుధవారం ప్రకాశం జిల్లా విద్యార్థులు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి తమ పరిస్థితిని వివరించారు. రోజురోజుకు పరిస్థితి అదుపుతప్పుతోందని, రాష్ట్ర ప్రభుత్వం తమను ఇళ్లకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జార్జిబుష్‌ని ముద్దాడిన గిరిజన మహిళ చనిపోయింది!



జార్జిబుష్‌తో నాగరాజమ్మ, పక్కన అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి

ఎర్రావారిపాళెం, మే 22: ఆమె ఓ గిరిజన మహిళ. 2006లో అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్‌ను ముద్దాడి వార్తల్లోకి ఎక్కింది. పేదరికం, అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందిన తిరుపతి నాగరాజమ్మ (46) స్వగ్రామం తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలంలోని కోటగాడపల్లె. అటవీ ఉత్పత్తుల సేకరణతో జీవితాన్ని ప్రారంభించిన నాగరాజమ్మ.. మహిళా సంఘాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2006లో అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం రాజశేఖర్‌రెడ్డి చొరవతో హైదరాబాద్‌లో గిరిజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో అటవీ ఉత్పత్తుల సేకరణ-వినియోగంపై ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. ఈ సమయంలో జార్జిబుష్ అటవీ ఉత్పత్తులను పరిశీలిస్తుండగా.. నాగరాజమ్మ చొరవ తీసుకుని అటవీ ఉత్పత్తుల ప్రాముఖ్యాన్ని వివరించి ఆయనను మెప్పించారు. ఈ సందర్భంగా ఆయనను ముద్దాడి వార్తల్లోకెక్కారు.

ఆసుపత్రుల సమ్మె పాక్షికం

» 'ప్రైవేటు' సభ్యులతో సీఈవో చర్చలు

» సేవలకు విఘాతం కలిగితే ఊరుకోబోమంటూ హెచ్చరిక

» 203 కోట్లు విడుదల... త్వరలో మిగిలిన బకాయిలు: లక్ష్మీశా

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె పాక్షికంగానే సాగింది. జిల్లాల్లో ఒకటి రెండు ఆస్పత్రులు మినహా ఏ నెట్‌వర్క్ ఆస్పత్రి కూడా సమ్మెకు మొగ్గు చూపలేదు. ఆస్పత్రుల అసోసియేషన్ ఆరోగ్యశ్రీ సేవల బంద్‌కు పిలుపునిచ్చింది. అసోసియేషన్‌లో ఉన్న ఇద్దరు ముగ్గురు మినహా మిగిలిన ఆస్పత్రులన్నీ ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాయి. ప్రతిరోజు ట్రస్ట్‌కు ఎన్ని ప్రీ ఆథరైజేషన్లు వస్తాయో బుధవారం కూడా అదే స్థాయిలో వచ్చాయి. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు సమ్మె అంశంపై ఇప్పటికే అనేకసార్లు అసోసియేషన్ లేఖలు రాసింది. అయినా ఏ రోజూ సమ్మె జరిగిన దాఖలాలు లేవు. కాగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీశా అసోసియేషన్ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'ప్రస్తుతం రూ.203 కోట్లు విడుదల చేస్తున్నాం. మిగిలిన బకాయిలు కూడా త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు. ఆస్పత్రుల అసోసియేషన్ సభ్యులు ససేమిరా అన్నారు. కనీసం సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న రూ.800 కోట్లు అయినా విడుదల చేయాలని కోరారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని సీఈవో వివరించారు. ఆరోగ్యశ్రీ సేవలను యథాతథంగా కొనసాగించాలని కోరారు. అసోసియేషన్ సభ్యులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని సీఈవోకి చెప్పిన నేతలు వీడియో కాన్ఫరెన్స్ నుంచి బయటకు వచ్చేశారు.

ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం లేదు: లక్ష్మీశా

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలుకు ఎలాంటి అంతరాయం లేదని ట్రస్ట్ సీఈవో లక్ష్మీశా ఒక ప్రకటనలో తెలిపారు. 'మేం నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్, ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. ఆరోగ్యశ్రీ సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం' అని లక్ష్మీశా తెలిపారు.

ఫలితాలకు ముందే హడావుడి!

» ఆదరాబాదరాగా కర్నూలులో ఏపీఈఆర్‌సీ కార్యాలయం

» భవనం పూర్తికాకుండానే నేడు ప్రారంభోత్సవం

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాలు రాకముందే జగన్ సర్కారు హడావుడి చేస్తోంది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) రాష్ట్ర కార్యాలయాన్ని కర్నూలులో ప్రారంభించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఏపీఈఆర్‌సీ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అద్దెకు ఉంటోంది. విద్యుత్ రంగానికి సంబంధించిన వివాదాలను కమిషన్ పరిష్కరిస్తుంది. ఏటా టారిఫ్‌ను ఖరారు చేస్తుంది. ప్రజల నుంచి అభిప్రాయాలను కూడా సేకరిస్తుంది. అయితే కమిషన్ విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ క్రమంలో విశాఖపట్నంలోని తూర్పు ప్రాంతీయ విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆఫీసులో కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకుంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు సాగించడం సరికాదన్న అభిప్రాయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్‌కు సమీపంలో ఇంధన శాఖ కమిషన్ కార్యాలయానికి స్థలం కేటాయించింది. ఇందులో రూ.23 కోట్లతో ఏపీఈఆర్‌సీ భవనాన్ని నిర్మిస్తున్నారు. సదరు భవనం పనులు 75 శాతమే పూర్తయ్యాయి. ఇంకా కీలకమైన సివిల్ పనులు మిగిలే ఉన్నాయి. ఈలోపలే గురువారం పూజలు చేపట్టి కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు కమిషన్ సిద్ధమైంది. వాస్తవానికి వచ్చే నెల రెండో తేదీ నుంచి కర్నూలు నుంచే తన కార్యకలాపాలు సాగుతాయని ఏపీఈఆర్‌సీ గతంలోనే ప్రకటించింది. అక్కడి నుంచే విధుల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని సిబ్బందిని కూడా ఆదేశించింది. అయితే పనులు పూర్తికాకుండానే కార్యాలయాన్ని అంత హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఇంధన రంగ నిపుణులతో పాటు ఉద్యోగులు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక కార్యాలయ ప్రారంభోత్సవానికి ప్రణాళికలు సిద్ధం చేస్తే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు.

పిన్నెల్లి అరాచకం అంతా ఇంతా కాదు: అచ్చెన్న

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజు ఈవీఎంను బద్దలు కొట్టడమంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు సృష్టించిన అరాచకం అంతా ఇంతా కాదు. పోలింగ్ రోజు ఈవీఎంను బద్దలు కొట్టి, టీడీపీకి ఓటేసిన సానుభూతిపరులపై దాడులకు పాల్పడిన పిన్నెల్లిపై ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలి' అని అచ్చెన్న డిమాండ్ చేశారు. కాగా, ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లిని రాజకీయాల నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని టీడీపీ మాచర్ల అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు.

పిన్నెల్లిని కాల్చి చంపినా తప్పులేదు: బుద్దా వెంకన్న

విజయవాడ (వన్‌టౌన్), మే 22: ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, 2019లో తమ కారుపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన తురకా కిశోర్‌ను తుపాకీతో కాల్చి చంపినా తప్పులేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పేర్కొన్నారు. అప్పట్లో తన కారుపై దాడి దృశ్యాన్ని బుధవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పిన్నెల్లి ఇస్తానన్న పదవికి ఆశపడిన తురకా కిశోర్ తమపై దాడి చేశాడని తెలిపారు. ఇటువంటి నేరచరిత్ర కలిగిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తురకా కిశోర్‌ను తుపాకీతో కాల్చి చంపినా తప్పులేదని బుద్దా వెంకన్న తీవ్రంగా స్పందించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 23 మే 2024
diksuchi@andhrajyothy.com

యూఓహెచ్‌లో ఎంటెక్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ-యూఓహెచ్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం 115 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, గేట్ వ్యాలిడ్ స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- బయోఇన్ఫర్మాటిక్స్ 25, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 18, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ 18, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 18, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ 18, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్ 18 సీట్లు ఉన్నాయి.

అర్హత

- స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

శస్త్ర యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ

శస్త్ర యూనివర్సిటీ(డీమ్డ్ యూనివర్సిటీ)- డిగ్రీ, పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. తంజావూరు, కుంభకోణం, చెన్నై క్యాంపస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు

బీటెక్, బీఎస్సీ, బీఎస్సీ ఎలక్ట్రానిక్స్, బీకాం, బీఏ, బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకాం బీఈడీ, బీసీఏ, బీబీఏ, బీబీఏ-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీఏ-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీకాం-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీ ఆప్టమ్, బీఎస్సీ విజువల్ కమ్యూనికేషన్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ తదితరాలు

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎం ఆప్టమ్, ఎంఎఫ్ఏ, ఎంఏ సంస్కృతం, ఎమ్మెస్సీ డేటా సైన్స్ తదితరాలు

ఎంపిక

- బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ఇంటర్ మార్కులు+జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లను; ఇంటర్ మార్కుల ద్వారా మిగిలిన సీట్లను భర్తీ చేస్తారు.
- ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లలో ఇంటర్ స్కోర్+క్లాట్ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ అర్హత ఉన్నవారికి స్కాలర్‌షిప్, స్టయిపెండ్ ఇస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. క్యాట్/జీమ్యాట్/ఎక్స్ఏటీ/ఏఐమ్యాట్ స్కోర్ ఉన్నవారు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లకు జూన్ 15; ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లకు జూన్ 8
- **వెబ్‌సైట్:** www.sastra.edu



డా.వైఎస్సార్ హెచ్‌యూ హార్టిసెట్

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(హార్టిసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డిప్లొమా కేటగిరీ కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొత్తం 101 సీట్లు ఉన్నాయి. వీటిలో ఈడబ్ల్యూఎస్ కోటా కింద 9 సీట్లు ఉన్నాయి. యూనివర్సిటీ కళాశాలలకు 61 సీట్లు, అనుబంధ కళాశాలలకు 40 సీట్లు కేటాయించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.



అర్హత

డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు కౌన్సెలింగ్ నాటికి మార్కుల పత్రం, సర్టిఫికెట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

హార్టిసెట్ 2024 వివరాలు

దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డా.వైఎస్సార్‌హెచ్‌యూ నిర్దేశించిన డిప్లొమా(హార్టికల్చర్) సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 15
- **హార్టిసెట్ 2024 తేదీ:** జూలై 26
- **పరీక్ష కేంద్రాలు:** కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్ (వెంకటరామన్నగూడెం-పశ్చిమగోదావరి జిల్లా, అనంతరాజులుపేట-అన్నమయ్య జిల్లా, పార్వతీపురం-మన్యం జిల్లా, చినలతరిపి-నెల్లూరు జిల్లా) క్యాంపస్‌లు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, వెంకటరామన్నగూడెం-534101, పశ్చిమగోదావరి జిల్లా.
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఆర్‌జీఎన్‌ఏయూలో డిగ్రీ, పీజీ డిప్లొమా

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని రాజీవ్ గాంధీ నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ (సెంట్రల్ యూనివర్సిటీ, అమేథీ)- డిగ్రీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(బీఎంఎస్) ఇన్ ఏవియేషన్ సర్వీసెస్ అండ్ ఎయిర్ కార్గో, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్(పీజీడీఏఓ) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్, ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ రిటెన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (బీఎంఎస్) ఇన్ ఏవియేషన్ సర్వీసెస్ అండ్ ఎయిర్ కార్గో

లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. దీని వ్యవధి మూడేళ్లు. ఇది అప్రెంటిస్‌షిప్-ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్. మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి 21 ఏళ్ల మించకూడదు.



పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ (పీజీడీఏఓ)

జీఎంఆర్ ఏవియేషన్ అకాడమీ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. దీని వ్యవధి 18 నెలలు. ప్రోగ్రామ్‌లో భాగంగా 12 నెలలు క్లాస్ రూం ట్రెయినింగ్ ఉంటుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్‌లలో ఆర్నెల్లు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు 2024 ఆగస్టు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి నాటికి 25 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.rgnau.ac.in

ఎన్‌హెచ్‌పీసీలో అప్రెంటిస్‌లు

చంపావత్(ఉత్తరాఖండ్)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ప్రయివేట్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌పీసీ)...కింద పేర్కొన్న ట్రేడ్‌లలో 64 అప్రెంటిస్ ఖాళీలున్నాయి.

ట్రేడులు: సీఓపీఏ, వెల్డర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్, ప్లంబర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్, వైర్‌మన్, టర్నర్, మెషినిస్ట్.

అర్హత: 10వ తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ 2019, 2020, 2021, 2022, 2023, 2024 ఏడాదిలో ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 30

దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: జూన్ 6

వెబ్‌సైట్: https://www.nhpcindia.com/welcome/job.htm

సిఫ్‌నెట్‌లో వీఎన్‌సీ/ఎంఎఫ్‌సీ

కొచ్చిన్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ (సిఫ్‌నెట్)- వెసల్ నేవిగేటర్ కోర్సు(వీఎన్‌సీ)/మెరైన్ ఫిట్టర్ కోర్సు(ఎంఎఫ్‌సీ)ల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వీటిలో కూడా ప్రాక్టికల్, ఆన్ బోర్డ్ ట్రెయినింగ్ ఉంటాయి. ఈ కోర్సులను ఎన్‌సీవీటీ క్రాఫ్ట్స్‌మన్ ట్రెయినింగ్ స్కీం కింద డీజీఈటీ-న్యూఢిల్లీ నిర్వహిస్తోంది. కొచ్చి, చెన్నై, విశాఖపట్నం క్యాంపస్‌లలో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో క్యాంపస్‌లో ఒక్కో కోర్సులో 20 సీట్లు ఉన్నాయి. ప్రతి క్యాంపస్‌లో కోర్సుకు నాలుగు సీట్లను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్ చేస్తాయి. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన పాఠశాలనుంచి పదో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. మేథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో 40 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.175
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ కేంద్రాలు:** కొచ్చి, చెన్నై, విశాఖపట్నం, కోల్‌కతా
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 29

వెబ్‌సైట్: www. cifnet.gov.in

ఎన్‌యూజేఎస్‌లో ఎమ్మెస్సీ, ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ

కోల్‌కతాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిడికల్ సైన్సెస్(ఎన్‌యూజేఎస్)-ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్), ఎల్ఎల్ఎం(డేటా సైన్స్ అండ్ డేటా ప్రొటెక్షన్ లా), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్

ఈ ప్రోగ్రామ్‌నకు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ(సీఎఫ్ఎస్ఎల్-కోల్‌కతా), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్-కోల్‌కతా) సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయవచ్చు. ఇందులో మొత్తం 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన ప్రాక్టికల్ కోర్సును సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో నిర్వహిస్తారు. రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో (బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్) (ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/మైక్రో బయాలజీ/కంప్యూటర్ సైన్స్/బోటనీ/జువాలజీ/ఆంత్రోపాలజీ/మేథమెటిక్స్/ఫోరెన్సిక్ సైన్స్) లేదా బీఎస్సీ ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులందరికీ ఆంగ్లభాషలో ప్రావీణ్యం తప్పనిసరి.

రిటెన్ టెస్ట్: రాత పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్, ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, ఫోరెన్సిక్ సైన్సెస్, లైఫ్ సైన్స్, డేటా సైన్స్, కాన్సెప్ట్స్ ఆఫ్ జస్టిస్ ప్రొసీజర్ ఇన్ ఇండియా త్రూ ఫోరెన్సిక్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత పొందినవారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకి 50 మార్కులు నిర్దేశించారు.

ఎల్ఎల్ఎం(డేటా సైన్స్ అండ్ డేటా ప్రొటెక్షన్ లా)

ఈ ప్రోగ్రామ్‌నకు ఐఐఎస్ఈఆర్-కోల్‌కతా, ఐఐఐటీ-కల్యాణి, ఎన్ఐటీటీటీఆర్-కోల్‌కతా, కాగ్నిజెంట్ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణులు లేదా ఏదేని డిగ్రీ పూర్తిచేసి లా&టెక్నాలజీ విభాగాల్లో అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. లీగల్ ప్రాక్టీస్, టెక్నాలజీ, డేటా సైన్స్, పాలసీ మేకింగ్ విభాగాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూలు:** జూలై 6న
- **వెబ్‌సైట్:** www.nujs.edu



పీహెచ్‌డీ

విభాగాలు-సీట్లు: కార్పొరేట్ లా 2, క్రిమినల్ లా 3, లా అండ్ టెక్నాలజీ 2, ఐపీఆర్ 4, బిజినెస్ లాస్ 2, ఎయిర్ అండ్ స్పేస్ లా/ఇంటర్నేషనల్ ట్రేడ్ లా 1, ఎన్విరాన్‌మెంటల్ లా 3, హ్యూమన్ రైట్స్ 1, ఇంటర్నేషనల్ లా 1, కాన్‌స్టిట్యూషనల్ లా 2, క్రిమినాలజీ 1, హిస్టరీ 2, పొలిటికల్ సైన్స్ 1, ఎకనామిక్స్ 1, ఫోరెన్సిక్ సైన్స్ 4 సీట్లు చొప్పున మొత్తం 30 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను పార్ట్ టైమ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎల్ఎల్ఎం డిగ్రీ లేదా సంబంధిత లా విభాగంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులందరూ దరఖాస్తుతోపాటు 3000 పదాలతో కూడిన రీసెర్చ్ ప్రపోజల్‌ను జతచేయాలి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ నెట్/జేఆర్ఎఫ్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది రీసెర్చ్ మెథడాలజీ కాగా రెండోది లా సబ్జెక్ట్/సోషల్ సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 70 మార్కులు, రెండు గంటల పరీక్ష సమయం నిర్దేశించారు.

లా సబ్జెక్టులు: లా ఆఫ్ కాంట్రాక్ట్, కాన్‌స్టిట్యూషనల్ లా, లా ఆఫ్ క్రైమ్స్, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, జ్యూరిస్‌ప్రుడెన్స్, కంపెనీ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లా.

సోషల్ సైన్స్ సబ్జెక్టులు: పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్, ఫోరెన్సిక్ సైన్స్

లిటిల్స్



మీకు తెలుసా?

- చూడానికి చిన్న ఎలుగుబంటులా.. బూడిద రంగులో భయపడుతూ కనపడే ఈ జంతువును 'కోలా' అని పిలుస్తారు.
- కోలా అంటే అర్థం 'నీళ్ల లేవు' అని అర్థం. ఇవి నీళ్ల తాగవు. అయితే ఆకుల్లోని, పండ్లల్లోని నీళ్లను గ్రహిస్తాయి. ఇవి కేవలం ఆస్ట్రేలియాలో మాత్రమే ఉంటాయి.
- ఇవి చెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసిస్తాయి. రోజుకు కేజీ ఆకుల్ని తింటాయి.
- తల్లి కోలాలు బాధ్యతగా ఉంటాయి. వాటి పిల్లలు పెద్దయ్యేదాకా



భుజాల మీద ఎత్తుకుని ఉంటాయి.
- ఇవి పాలిచ్చే జంతువులు. గుంపులుగా ఉండటానికి ఇష్టపడవు. అందుకే ఒంటరిగా మాత్రమే ఉంటాయి.
- వీటి ముక్కు నల్లగా ఉంటుంది. ఎలాంటి ఆహారం అయినా దూరం నుంచే వాసన పడతాయి.
- ఇవి దాదాపు రోజులో ఇరవై గంటలు నిద్రపోతాయి.
- వీటి ముక్కు కింద నిర్మాణం వల్ల బురదలో ముద్రలు పడతాయి. అంటే ఫింగర్ ప్రింట్‌లా జీవ శాస్త్రవేత్తలకు అవసరం అవుతాయి.
- వీటి నాలుగు కాళ్ల పాదాలు గట్టిగా ఉంటాయి. అందువల్లనే కిందపడకుండా చెట్లమీదనే నిద్రపోతాయి.
- ఇవి లక్షకంటే తక్కువ ఉన్నాయి. బెల్లో అంటూ గట్టిగా అరుస్తాయి. ఈ సౌండ్ ద్వారా ఇతర జంతువులతో కమ్యూనికేట్ అవుతాయి.
- వీటి జీవనకాలం గరిష్ఠంగా 15 ఏళ్ల మాత్రమే.

సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



ఎన్ని డ్రాగన్లు ఉన్నాయి?



డైలీ సుడోకు - 314

7		1			6			
			5	9				3
			4					6
		9	7			3		8
	4	5				1	7	
2		7			3	5		
9					5			
5				3	7			
			8			2		5

సుడోకు - 313 సమాధానం

6	1	7	3	9	5	4	8	2
3	5	2	6	4	8	7	9	1
4	8	9	1	7	2	5	6	3
5	9	4	2	3	6	8	1	7
8	7	3	4	1	9	2	5	6
1	2	6	8	5	7	9	3	4
7	3	8	9	6	4	1	2	5
9	4	1	5	2	3	6	7	8
2	6	5	7	8	1	3	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.